గెలిస్తే.. రికార్డే
www.andhrajyothy.com
వెల (Price) : Rs. 8.00
విజయవాడ సిటీ
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 12 + 16 + 32 పేజీల ఆదివారం అనుబంధం
ఆదివారం | 22-12-2019
సంపుటి (Volume) : 60
సంచిక (Issue) : 247
శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి మ. 3.23 తదుపరి ద్వాదశి; నక్షత్రం: స్వాతి రా. 6.38 తదుపరి విశాఖ; వర్జ్యం: రా.12.00-1.32; దుర్ముహూర్తం: సా.4.15-4.59; అమృతఘడియలు: ఉ.10.16-11.47; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.44; సూర్యాస్తమయం: 5.42
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai



## వరుసగా పదో సిరీస్‌పై కన్నేసిన టీమిండియా

## వెస్టిండీస్‌తో చివరి వన్డే నేడు

8

వెస్టిండీస్‌పై టీ20 సిరీస్ నెగ్గిన టీమిండియా ఇప్పుడు వన్డే సిరీస్‌నూ సొంతం చేసుకునేందుకు సిద్ధమైంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా కీలకమైన చివరి వన్డే జరిగేది నేడే. ఇప్పటికే చెరో మ్యాచ్ నెగ్గి ఇరుజట్లు సమంగా ఉన్నాయి. ఈ నిర్ణాయక పోరులో సత్తాచాటితే కరీబియన్లపై వరుసగా పదో ద్వైపాక్షిక సిరీస్ నెగ్గిన రికార్డును భారత్ అందుకోనుంది.



## పిచ్చయ్‌కి 'స్టాక్'పాట్!

వచ్చే మూడేళ్లలో **1,721** కోట్లు

ప్రస్తుతం 13.5 కోట్ల వేతనం

12



ఈ బుడతడి ఏడాది రాబడి

**185** కోట్లు

యూట్యూబ్ హీరో అతడు

ఆట వస్తువులపై వివరణ

## ఫేస్'బుక్క'యిన

**26.7** కోట్ల మంది

ఈ ఏడాది ఇది మూడో అతిపెద్ద లీకేజీ

ఏప్రిల్‌లో 54 కోట్ల మంది డేటా బహిర్గతం

12

## 'క్యాట్' దెబ్బకు మటాష్!

- దేశీయ మత్స్య సంపదకు పెను ముప్పు
- కృష్ణా, గోదావరి నదుల్లో ఎక్కువైన క్యాట్ ఫిష్
- ఎగువ రాష్ట్రాల్లో వరదలతో మన నదుల్లోకి
- ఆపై చెరువుల్లో కలిసినట్టు అనుమానాలు

2

- సంతానోత్పత్తి అధికం.. మత్స్యకారుల్లో కలవరం



పంటకాల్వలో మత్స్యకారులకు దొరికిన ఆఫ్రికన్ రకం క్యాట్ ఫిష్



## ఈ దూడ ఖరీదు 5 లక్షలు

ఈ చిత్రంలో కనిపిస్తున్న ఆవు దూడ వయసు రెండు నెలలు. దీని ఖరీదు ఐదు లక్షల పైమాటే. అంత ధర ఎందుకంటే ఇది పేరొందిన పుంగనూరు జాతికి చెందిన అరుదైన స్వర్ణ కపిల ఆవు కనుకనే. వీటికి కేరళలో మంచి డిమాండ్ ఉంది. తూర్పు గోదావరి జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరుకు చెందిన రైతు రెడ్డి సత్తిబాబు ఇటీవలే ఆవుతోసహా ఈ పెయ్యిదూడను కొనుగోలు చేశారు. ఈ స్వర్ణ కపిల దూడను చూసేందుకు రైతులు ఆసక్తిగా వస్తున్నారు.

- ఆలమూరు

# నివేదికపై నిప్పులు





## రగులుతున్న రాజధాని రైతన్న

- పార్టీలకతీతంగా రైతు కవాతు
- పలు పంచాయతీ భవనాలకు రంగులేసి నిరసనల హోరు
- వైసీపీ కార్యకర్తలే ముందుండి నల్లరంగులు పులిమిన వైనం
- మందడంలో పడవెక్కి నిరసన
- రోడ్డుకడ్డంగా మండిన టైర్లు
- కూడళ్లలో ట్రాఫిక్ స్తంభన
- నాలుగో రోజూ రిలేల సెగలు
- మోదీ ఫొటోలను చేతపట్టి తల్లులతో ధర్నాల్లో పిల్లలు
- రైతులకు బాసటగా దీక్షల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు
- 2 రోజుల్లో తరలింపుపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలి
- 'అమరావతి జేఏసీ' డెడ్‌లైన్



1) తమకు అన్యాయం చేయొద్దంటూ కన్నీరుమున్నీరవుతున్న రాజధాని మహిళ. 2) వైసీపీ రంగులకు నల్లరంగు పూసి సేవ్ ఏపీ నినాదాలు. 3) ఎర్రబాలెంలో బైఠాయించిన గ్రామస్థులు, మండుతున్న టైర్లు

గుంటూరు, విజయవాడ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నివేదనలే నిప్పులయ్యాయి. 'రాజధానిని మార్చొద్దు' అంటూ కార్చిన రైతుల ఉప్పటి కన్నీరే జీఎన్ రావు కమిటీ నివేదికతో ఉప్పెనై ముంచెత్తాయి. రాజధాని కోసం ఇప్పటిదాకా పరితపించిన గుండెలు.. ఆగ్రహ సముద్రాలై పొంగిపొర్లాయి. వరుసగా నాలుగోరోజూ పరిపరివిధాలా ప్రతిఘటనా చప్పుళ్లను రాజధాని గ్రామాలు వినిపించాయి. సచివాలయం చుట్టుపక్కల ఉన్న 29 గ్రామాలూ శనివారం రోడ్డెక్కాయి. రహదారి కూడళ్లలో టైర్లు వేసి కాల్చి, ట్రాఫిక్‌ను రైతులు అడ్డుకొన్నారు. ఎన్నెన్ని ఆందోళనా రూపాలున్నాయో అంతంతగా జీఎన్‌రావు కమిటీ నివేదికను నిరసించారు. 'మూడు రాజధానులు' ఆలోచన క్రమంలో మంత్రులు చేసిన వ్యాఖ్యలనూ రాజధాని రైతులు వదిలిపెట్టలేదు. 'మాది మునిగే ప్రాంతమా లేక మీరు ముంచిన ప్రాంతమా' అంటూ కొందరు పడవ ఎక్కి నినదిస్తే, 'మా ఆవేదనపై చలించరా' అంటూ దున్నపోతుకు

మిగతా 11వ పేజీలో...

## వేల కోట్లు వృథా!

- 'మూడు'లో అమరావతి పాత్ర నామమాత్రం
- 6 వేల కోట్ల ప్రాజెక్టులు పూర్తి
- వివిధ దశల్లో మరో 10 వేల కోట్ల పనులు
- వాటన్నింటికీ కాలం చెల్లినట్లే!

10

## సీమలో రాజధాని

- లేకపోతే.. కర్నూలు నుంచి ఢిల్లీ దాకా పోరాటం
- సీఎంకు సీమ కమిటీ లేఖ

11



వైఎస్సార్ నేతన్న నేస్తం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మగ్గం నేస్తున్న సీఎం జగన్

# చేనేతకు చేయూత

## మగ్గముంటే ఏడాదికి 24 వేలు

- ఇస్తానని చెప్పా.. ఖాతాల్లో వేస్తున్నా
- 81,783 కుటుంబాలకు 196 కోట్లు
- ఆత్మహత్యలపైనా బాస నిలుపుకొని 57 కుటుంబాలకు రూ.5 లక్షలు
- త్వరలోనే ఆప్కోని ప్రక్షాళన చేస్తా
- రాష్ట్రంలో సామాజిక విప్లవాన్ని తెస్తా
- ఐదుగురు ఉప ముఖ్యమంత్రులలో నలుగురు ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, బీసీలే
- ఇంత చేస్తున్నా శత్రువుల విమర్శలు
- వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని ధర్మవరంలో ప్రారంభించిన జగన్

అనంతపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): "గత పాలకులు నేతన్నల ఘనత చెప్పారే తప్ప వారి కష్టాలను ఎవరూ పట్టించుకోలేదు. చేనేతలకు సబ్సిడీలు లేక వారు ఆత్మహత్యలు చేసుకుంటున్న సమయంలో గళం విప్పి గట్టిగా అడిగిన వ్యక్తిని నేనే. పేదరికం, అప్పుల్లో కూరుకుపోయిన వారి దుస్థితిని నా పాదయాత్రలో గమనించాను. వారిని ఆదుకొంటానని నాడు చెప్పిన మాటను ఈరోజున నిలబెట్టుకొన్నాను. మగ్గమున్న ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.24 వేల ప్రకారం వారివారి ఖాతాల్లో జమ చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఇంత బాగా చేస్తున్నా శత్రువులు తనను విమర్శిస్తూనే ఉన్నారని ఆయన

మిగతా 10వ పేజీలో...

## సంక్రాంతి సెలవుల్లో టీచర్ల బదిలీలు!

3

## కొత్త పలుకు

### 3 ముక్కల చిచ్చు!

..ఏ రాష్ట్రానికైనా దాని అస్తిత్వానికి రాజధాని చిహ్నంగా ఉంటుంది. రాజధానిగా అమరావతిని ప్రకటించడాన్ని నిండు శాసనసభ సాక్షిగా స్వాగతించిన ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు తద్విరుద్ధమైన నిర్ణయం తీసుకోబోతున్నారు.

..13 జిల్లాలకు మధ్యలో ఉంటుందన్న కారణంగా అమరావతిని రాజధానిగా ప్రకటిస్తే, ఆ విషయాన్ని మరుగునపరిచి కమ్మ సామాజికవర్గం కోసమే చంద్రబాబు అమరావతిని ఎంపిక చేశారని ప్రచారం చేస్తున్నా ఒక్కరు కూడా నోరు విప్పడం లేదు. జగన్మోహన్‌రెడ్డికి తెలుసో లేదో తెలియదు గానీ విశాఖలో కూడా కమ్మ సామాజికవర్గానికి చెందినవారున్నారు.

..అధికార యంత్రాంగాన్ని ప్రజలకు చేరువ చేయడం కోసం ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మండల వ్యవస్థను తీసుకువచ్చారు. ఇప్పుడు తెలంగాణ సీఎం కేసీఆర్ జిల్లాల సంఖ్యను పెంచారు. ఇలాంటి చర్యల వల్ల అధికార వికేంద్రీకరణ జరుగుతుంది గానీ, జీఎన్ రావు కమిటీ సిఫారసుల వల్ల కాదు.

..ప్రైవేట్ పెట్టుబడులు రానంతవరకు ఏ నగరం కూడా అభివృద్ధి చెందదు. గత ప్రభుత్వ నిర్ణయాలను తిరగదోడుతూ పోవడం వల్ల పెట్టుబడిదారులలో విశ్వాసం సన్నగిల్లుతోంది.

..'నవ్వేటోడి ముందు జారిపడవద్దు' అని కేసీఆర్ అంటుంటారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఈ మాటలను గుర్తుచేసుకోవడం మంచిది.

..'ఉట్టి కెగరలేనమ్మ స్వర్గానికి ఎగురుతా' అన్నట్టుగా ఒక రాజధానిని నిర్మించలేనివారు మూడు రాజధానులను నిర్మించగలరా?

..అమరావతిని చంపేయడానికి అక్కడ కమ్మ సామాజికవర్గం వారికి కూడా భూములు ఉండటం కారణమైతే ప్రభుత్వం అదే విషయం ప్రకటించాలి. అదే నిజమైతే నష్టపరిహారం చెల్లించి వారిని అమరావతి నుంచి తరిమేయండి.

- ఆర్కే విశ్లేషణ 4లో..

# రాష్ట్రంలో 25 జిల్లాలు

- సీఎం తదుపరి ఆలోచన ఇదే!
- 3 రాజధానులు చరిత్రాత్మక నిర్ణయం
- భీమిలిలో కార్యనిర్వాహక రాజధాని
- భూముల కోసం సర్వే చేస్తున్నాం
- ఇక ఉత్తరాంధ్ర అభివృద్ధి: విజయసాయి



11

## మండలికి మంగళం!

వేలాడుతున్న రద్దు కత్తి.. అక్కడ టీడీపీకే మెజారిటీ

- సర్కారుకు ఇబ్బందికర పరిణామాలు
- రెండు బిల్లులు వీగిపోవడంపై గుస్సా
- రద్దు చేయాలనే బలమైన ఆలోచన




10

- రద్దైతే లోకేశ్, యనమల 'మాజీ'.. పిల్లి, మోపిదేవి కోసమే సంయమనం?

# కొత్త రూల్స్‌తో పాతకు కోత

- కొత్త రేషన్‌కార్డులపై పేదల్లో భయం
- నోటి దగ్గర ముద్ద లాగేస్తారని కలవరం

- కొన్ని లక్షల కార్డులు పోయే అవకాశం!
- రేషన్ తీసుకోని 20 లక్షల కార్డులు
- వాటిపై గత ప్రభుత్వంలోనే కసరత్తు
- ప్రభుత్వం మారగానే ఏరివేతకు సిద్ధం
- ఔట్, కాంట్రాక్టు కుటుంబాలకూ కోత
- అంగన్‌వాడీ వర్కర్లకు, ఆశాలకూ నిరాశే
- ప్రత్యర్థుల కార్డులపై వలంటీర్ల గురి!

అమరావతి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి పథకానికి ఒకకార్డు! రేషన్ సరుకుల సరఫరాకూ ఇలాగే నయా కార్డును రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. దీనికోసం ఈ నెల రెండో తేదీన మార్గదర్శకాలు విడుదల చేసింది. ఆ మార్గదర్శకాలు చూసిన పేదలు 'కొత్తా.. లేక కోతా' అనే భయసందేహాలకు గురవుతున్నారు. రాష్ట్రంలో 1.47 కోట్ల రేషన్‌కార్డులు ఉన్నాయి. కొత్త మార్గదర్శకాల ప్రకారం వాటిలో కొన్ని లక్షల కార్డులు గల్లంతవ్వనున్నాయని అంచనా. రాష్ట్రంలోని

మిగతా 10వ పేజీలో...



## 'బయో' అటెండెన్స్ తప్పనిసరి

- వర్సిటీ, కాలేజీల్లో సిబ్బంది, విద్యార్థులకూ..
- అన్ని చోట్లా 'ఈ-ఆఫీసు' అమలు చేయాలి
- ఉన్నత విద్యాశాఖ ఆదేశాలు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ అక్రమాలకు చెక్?

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలలు, వర్సిటీల నియంత్రణలోని కళాశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది, విదార్థులకు ఇకపై బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి. ఉన్నత విద్య

మిగతా 3వ పేజీలో...

# అప్పు పుట్టేదెలా?

- మొహం చాటేస్తున్న ఆర్థిక సంస్థలు
- ముంచుకొస్తున్న రైతు భరోసా, అమ్మ ఒడి
- వీటికి తోడు ఉగాది నాటికి 'పేదలకు ఇళ్లు'
- బ్యాంకు, బీమా సంస్థతో చర్చలు
- బ్యాంకు ఓకే అంటే 1500 కోట్లు
- బీమా సంస్థ సై అంటే 10 వేల కోట్లు

2

## చైర్మన్ ఉండగా ఇన్‌చార్జి చైర్మన్ ఎలా?

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు
- ఏపీపీఎస్సీ ఇన్‌చార్జి నియామక ఉత్తర్వు అమలు నిలిపివేత

10






కాన్పూర్‌లో నిరసనకారులు నిప్పు పెట్టడంతో తగులబడుతున్న వాహనాలు

# యూపీ రక్తసిక్తం

**16** మంది మృతి

- కాన్పూర్‌లో పోలీసు ఔట్‌పోస్ట్‌కు నిప్పు.. రాంపూర్‌లో నిరసన.. పోలీసులకు గాయాలు
- నివురుగప్పిన నిప్పుల్లా కనిపిస్తున్న రాష్ట్రాలు.. ఢిల్లీలో మళ్లీ నినదించిన 'జామియా'

న్యూఢిల్లీ, డిసెంబరు 21: పౌరసత్వ సవరణ చట్టంపై జరిగిన హింసాత్మక ఆందోళనల్లో ఉత్తర ప్రదేశ్‌లో ఇప్పటికి 16 మంది మరణించారు. ఒక్క మీరట్‌లోనే ఐదుగురు మరణించారు. వారణాసిలో పోలీసుల లాఠీ చార్జి సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో గాయపడిన ఎనిమిదేళ్ల బాలుడు చనిపోయాడు. శనివారం భారీ భద్రత నడుమ ఆ బాలుడి అంత్యక్రియలు నిర్వహించారు. శనివారం కాన్పూర్, రాంపూర్‌లో మళ్లీ హింస చోటు

మిగతా 12వ పేజీలో...



## పరంజ్యోతి

## అభ్యాస వైరాగ్యాలతోనే అరిషడ్వర్గాలపై విజయం



*లోకములన్నియున్ గడియలోన జయించిన వాడ*
*వింద్రియా*
*నీకము జిత్తముంగెలవ నేరవు నిన్ను నిబద్ధు జేయు నీ*
*భీకర శత్రులార్వుర ప్రభిన్నుల జేసిన ప్రాణి కోటిలో*
*నీకు విరోధి లేడొకడు నేర్పునజూడుము దానవేశ్వరా!*

పోతనామాత్యుని శ్రీమహాభాగవతంలో.. సప్తమస్కంధంలోని 'ప్రహ్లాద చరితం'లోనిదీ పద్యం.

"నేను దిక్కులన్నీ జయించాను. అన్ని దిక్కుల రాజులు.. దేవేంద్రునితో సహా నన్నే కొలుస్తారు" అన్న హిరణ్యకశిపుడితో.. బాలుడైన ప్రహ్లాదుడు పలికిన పల్కులివి. "తండ్రీ! నీవన్ని లోకాలను గడియలోనే జయించిన పరాక్రమశాలివి. అయినా నీవు ఇంద్రియాలను, మనస్సును జయించలేదు. నీలోనే ఉండి నిన్ను దృఢంగా బంధించిన ఆర్గురు భయంకరమైన శత్రువులున్నారు. వారిని తొలిగించుకుంటే.. ప్రాణకోటిలో నీకు పగవాడనేవాడే ఉండడు. నేర్పుగా ఆ విషయాన్ని గ్రహించుము దానవేశ్వరా!" అంటాడు ప్రహ్లాదుడు.

ఆ ఆరుగురు శత్రువులే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు. వీటినే 'అరిషడ్వర్గం' అంటారు. ఈ గుణాలే మనిషి పతనానికి దారి తీస్తాయి.

కామం అంటే కోరిక. కోరికలుండగూడదని కాదు. అవి ధర్మబద్ధమై ఉండాలి. క్రోధం అంటే కోపం. కోపం మనిషి పతనానికి ఏ విధంగా కారణమవుతుందో మనందరికీ తెలుసు. 'తన కోపమే తన శత్రువు' అని బద్దెనకవి సుమతి శతకంలో అన్నారు. లోభం అనగా పిసినారితనం. పిసినారికి కూడబెట్టడమే తెలుసు. అతని సంపద తన జీవితకాలంలో తనకు గానీ, తన వాళ్ళకు గానీ ఉపయోగపడదు. చివరికి ఎవరికి దక్కుతుందో కూడా తెలియదు. తాను అనుభవించలేడు. లోభి అధర్మంగా ఇతరుల ధనాన్ని స్వీకరిస్తాడు. మోహం అంటే అజ్ఞానము. మోహం కోరికకు దారి తీస్తుంది. కోరిక నెరవేరనప్పుడు కోపం కలుగుతుంది. కాబట్టి ఈ గుణాలు ఒకదాని నుండి ఒకదానికి దారితీసి.. పతన హేతువులవుతాయి. మదం అంటే గర్వం. కొద్దిపాటి శక్తులను చూసుకుని విర్రవీగటమే మదం. ఎంతటి శక్తిమంతుడైనా.. అనంత శక్తిసంపన్నుడైన పరమేశ్వరుని ముందు.. అతడివి కొద్ది పాటి శక్తులే అవుతాయి. గర్వమే హిరణ్యకశిపుడి పతనానికి కారణమైంది. చివరిది మాత్సర్యం.. అంటే ద్వేషం, ఈర్ష్య. మనిషిలోని ఈర్ష్యాద్వేషాలు అతణ్నే దహించివేస్తాయి.

అరిషడ్వర్గంలో ప్రధానమైన శత్రువు కామం. కోరికలు జయించిన వాడిని మిగతా దుర్గుణాలు దరిచేరలేవు. ధర్మబద్ధమైన కోరికలతో తృప్తిగా జీవిస్తేనే జీవితం బాగుంటుంది.

మానవుని కోరికలకు అంతులేకుండా పోతోంది. ఒక కోరిక తీరగానే మరో కోరిక వచ్చి కూర్చుంటుంది. కాబట్టి మనిషికి తృప్తి ఉండదు. ఉన్నది చాలు అనుకొని తృప్తిగా జీవించేవాడే ఆరోగ్యవంతుడు.. ఐశ్వర్యవంతుడు. ఆత్మ తృప్తికి మించిన ఐశ్వర్యం ఏముంటుంది? కానీ.. ఆత్మతృప్తిని పొందడం అంత సులభం కాదు. అందుకు అభ్యాసం, వైరాగ్యం కావాలి. అవే మనిషిని భగవంతుడిని చేరేందుకు దోహదపడే గొప్పసాధనాలు.

**- జక్కని వేంకటరాజం, 9440021734**



తల్లిదండ్రులతో చిన్నారి దేవిశ్రీ ప్రసాద్

## చిట్టి గుండెకు పెద్ద కష్టం!

- మూడేళ్ల బాలుడి గుండె వాల్వ్ లీక్
- శస్త్రచికిత్సకు 8 లక్షలకు పైగా ఖర్చు
- దాతల సాయం కోసం ఎదురుచూపు

గొల్లప్రోలు, డిసెంబరు 21: ఆడిపాడే వయసులో ఆ చిట్టి గుండెకు పెద్ద కష్టమే వచ్చింది. పుట్టిన నెల రోజుల నుంచే గుండె జబ్బుతో పోరాడుతున్న చిన్నారి మూడేళ్లు ఎలాగోలా నెట్టుకొచ్చాడు. ఏరోటిక్ వాల్వ్ నాళంలో లీకేజీ ఎక్కువగా ఉండడంతో.. ఓపెన్ హార్ట్ సర్జరీ చేస్తే తప్ప ప్రాణాలు నిలబెట్టలేని పరిస్థితి తలెత్తింది. అందుకు రూ.8 లక్షలకుపైగా ఖర్చవుతుందని డాక్టర్లు చెబుతున్నారు. కానీ.. నిరుపేద తల్లిదండ్రులు వద్ద అంత స్తోమత లేదు. తూర్పుగోదావరి జిల్లా గొల్లప్రోలు పట్టణంలోని ఈబీసీ కాలనీకి చెందిన ఉమ్మిడి చంద్రశేఖర్, నీరజ దంపతులకు మూడేళ్ల కొడుకు దేవిశ్రీప్రసాద్ ఉన్నాడు. పుట్టిన నెలరోజులకే వైద్యులు ఆ బాలుడి హార్ట్‌బీట్‌లో తేడాను గుర్తించారు. పరీక్షలు చేస్తే ఏరోటిక్ వాల్వ్ లోపమని తేలింది. హైదరాబాద్ తీసుకెళితే ఏరోటిక్ వాల్వ్ నాళంలో లీకేజీ ఉందని, ఓపెన్‌హార్ట్ సర్జరీ చేయాలని చెప్పారు. ఇప్పుడు వాల్వ్ నుంచి లీకేజీ అధికమై.. ఎడమవైపు గుండె పరిమాణం పెరిగింది. వెంటనే శస్త్రచికిత్స చేయాలని బెంగళూరులోని కొలంబియా ఆసియా ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఇందుకు రూ.8లక్షలు వ్యయం అవుతుందని చెప్పారు. దీంతో తల్లిదండ్రులు దాతల కోసం ఎదురుచూస్తున్నారు. సాయం చేదలచిన వారు చంద్రశేఖర్ (9032205268, 9032015489) సంప్రదించవచ్చు. బ్యాంకు వివరాలు.. ఎస్‌బీఐ అకౌంట్ నంబరు 36308857960, ఐఎఫ్ఎస్సీ కోడ్.. ఎస్‌బీఐఎన్0012990, గొల్లప్రోలు.

# అప్పు పుట్టేదెలా?

- మొహం చాటేస్తున్న ఆర్థిక సంస్థలు
- ముంచుకొస్తున్న రైతు భరోసా, అమ్మ ఒడి
- వీటికి తోడు ఉగాది నాటికి 'పేదలకు ఇళ్లు'
- బ్యాంకు, బీమా సంస్థతో చర్చలు
- బ్యాంకు ఓకే అంటే 1500 కోట్లు
- బీమా సంస్థ సై అంటే 10 వేల కోట్లు
- చిల్లిగవ్వలేక రుణాల వేటలో జగన్ సర్కార్

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): "అప్పు పుట్టేదెలా?!"-ఇదీ ఇప్పుడు జగన్ ప్రభుత్వం చేస్తున్న రుణ జపం! మరో 20 రోజుల్లో ప్రభుత్వం కీలకంగా భావిస్తున్న 'అమ్మ ఒడి' పథకాన్ని(జనవరి 9) అమలు చేయాలి. ఆ వెంటనే సంక్రాంతి సమయానికి 'రైతు భరోసా' రెండో విడత విడుదల చేయాలి. దీంతో ఈ రెండు పథకాల కోసం ప్రభుత్వానికి తక్షణావసరంగా రూ.9 వేల కోట్లు అదనంగా కావాలి. దీంతో ఇప్పుడు రుణాల వేటలో పడింది. అయితే, ఇప్పటికే అంతంత మాత్రంగా ఉన్న ఏపీ ఆర్థిక పరిస్థితిని పరిశీలిస్తున్న బ్యాంకులు కానీ, ఇతర ఆర్థిక సంస్థలు కానీ అప్పు ఇచ్చేందుకు మొహం చాటేస్తున్నాయి. దీంతో సర్కారు మల్లగుల్లాలు పడుతోంది. ప్రభుత్వానికి అందే సొంత వనరుల ఆదాయం వేతనాలు, పెన్షన్లు, ఇతర అత్యవసర ఖర్చుల కోసం ఎప్పట్లాగే రూ.9,500 కోట్ల వరకు అవసరం. వీటిని ఏదోరకంగా పూర్తి చేస్తున్నారు. అయితే, ఇవి కాకుండా జనవరి 9వ తేదీన అమ్మఒడి కోసం రూ.6,500 కోట్లు, సంక్రాంతి సమయంలో రెండో విడత రైతు భరోసా కోసం రూ.2500 కోట్లు అవసరం. దీంతో ఆర్థిక శాఖ అధికారులు అప్పుల కోసం గాలిస్తున్నారు. ప్రస్తుతం అప్పు కోసం ఓ ప్రముఖ బ్యాంకుతో ఎనర్జీ శాఖ తరపున ఆర్థిక శాఖ సంప్రదింపులు జరుపుతోంది. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రూ.1500 కోట్లు అప్పు తీసుకునే ప్రయత్నాల్లో ఉంది. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని కొన్ని పవర్ ప్రాజెక్టులను పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. వీటిని పీఎఫ్‌సీ ఆస్తులుగా చూపి బ్యాంకుల నుంచి రుణం పొందడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ రుణ ప్రయత్నాలపై ఆ ప్రముఖ బ్యాంకు కొంత మేర సానుకూలత వ్యక్తం చేసినప్పటికీ ఈ ప్రక్రియకు కొన్ని పాలనాపరమైన అడ్డంకులు ఎదురవుతున్నాయి. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పీఎఫ్‌సీ బోర్డు డైరెక్టర్లను కొత్తగా నియమించారు. ఈ బోర్డును కంపెనీస్ ఆఫ్ రిజిస్ట్రార్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఇది జరిగితేనే బోర్డుకు గుర్తింపు లభిస్తుంది. గుర్తింపు ఉన్న బోర్డు నుంచి వచ్చిన ప్రతిపాదనలను మాత్రమే బ్యాంకులు పరిగణనలోకి తీసుకుంటాయి. దీంతో ముందు ఆ నమోదు ప్రక్రియ పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. అలాగే, ఇటీవల పీఎఫ్‌సీ మేనేజింగ్ డైరెక్టర్‌ని మార్చారు. అక్టోబరు 18న రమణారెడ్డిని పీఎఫ్‌సీ ఎండీగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కొత్తగా వచ్చిన ఎండీకి డిజిటల్ సిగ్నేచర్ ఉండాలి. ఇంకా ఆ పని కూడా పూర్తి కాలేదని తెలిసింది. ఈ రెండు పనులు పూర్తయి పూర్తిస్థాయి ప్రతిపాదనలతో బ్యాంకును సంప్రదిస్తే రూ.1500 కోట్ల రుణం రావొచ్చని తెలుస్తోంది.

### వృద్ధిరేటు అడ్డంకి

నవరత్నాల్లో భాగమైన 'పేదలకు ఇళ్లు' పథకాన్ని ఉగాది నాటికి అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. దీనికి సంబంధించిన రుణం కోసం బీమా రంగంలోని దిగ్గజ సంస్థను సంప్రదించినట్టు తెలిసింది. మొదట ఈ ప్రతిపాదనకు సూత్రప్రాయ ఆమోదం తెలిపిన ఈ సంస్థ చైర్మన్ ఇప్పుడు ప్రభుత్వం నుంచి వస్తున్న ప్రతిపాదనలకు మొహం చాటేస్తున్నట్టు సమాచారం. ఇళ్ల ప్రతిపాదనలపై మొదట్లో కొంత ఆసక్తి చూపిన ఆ సంస్థ తర్వాత స్పందించడం మానేసిందని ఆర్థిక శాఖ అధికారి ఒకరు చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు వృద్ధిరేటు ప్రకటించలేదు. సాధారణంగా ప్రతి మూడు నెలలకోసారి వృద్ధిరేటు ప్రకటిస్తారు. దీనిని ఆధారంగా చేసుకుని రాష్ట్రానికి పెట్టుబడులు వస్తుంటాయి. రుణాలు ఇవ్వాలా? వద్దా? అనేది ఆర్థిక సంస్థలు నిర్ణయించుకుంటాయి. ఈ బీమా సంస్థ కూడా రాష్ట్ర వృద్ధిరేటు పరిగణనలోకి తీసుకుని మొహం చాటేస్తున్నట్టుగా ఆర్థిక శాఖ అధికారులు భావిస్తున్నారు. దీంతో ఆ బీమా సంస్థ చైర్మన్‌తో మాట్లాడేందుకు 'పేదలకు ఇళ్లు' ప్రతిపాదన లేఖను తీసుకుని స్వయంగా ఆర్థిక శాఖ నుంచి ఒక అధికారి, గృహ నిర్మాణ శాఖ నుంచి మరో అధికారి కలిసి రెండు రోజుల కిందట ముంబై వెళ్లినట్టు సమాచారం. దాదాపు రూ.10,000 కోట్ల మేర రుణాలను ఆ బీమా సంస్థ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆశిస్తోంది.

### భూసేకరణకా? గృహనిర్మాణానికా?

కేంద్ర ప్రభుత్వ పథకమైన పీఎం ఆవాస్ యోజన పథకానికి అనుసంధానంగా పేదలకు గృహాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి రూ.70,000 కోట్లు ఖర్చవుతాయని అంచనాలు సిద్ధం చేసింది. ఇది కేంద్ర పథకం కాబట్టి రూ. 40,000 కోట్ల నిధులు కేంద్రం నుంచి వస్తాయని, బీమా సంస్థ నుంచి రూ.10,000 కోట్లు రుణం తీసుకోగా మిగిలిన రూ .20,000 కోట్లను రాష్ట్రం, లబ్ధిదారులు భరించాలనే ప్రతిపాదనను గృహనిర్మాణ, ఆర్థిక శాఖలు సిద్ధం చేశాయి. ఒకవేళ ఆ బీమా సంస్థతో సంప్రదింపులు ఫలించి రూ.10,000 కోట్ల రుణం వస్తే వాటిని భూసేకరణకు వినియోగిస్తారా? గృహ నిర్మాణానికి వినియోగిస్తారా? అనే దానిపై స్పష్టత లేదు.

## సమాజానికి చుక్కాని కవిత్వం

### కవులు... ప్రజలు ఎన్నుకోని శాసనసభ్యులు

### ఐదో బహుభాషా కవి సమ్మేళనంలో గవర్నర్




కవితల సంపుటిని ఆవిష్కరిస్తున్న గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

విజయవాడ కల్చరల్, డిసెంబరు 21: కవులు ప్రజలు ఎన్నుకోని శాసనసభ్యులని, సమాజ హితాన్ని వారు చట్టబద్ధం చేస్తారని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. విజయవాడలో శనివారం ప్రారంభమైన ఐదో అంతర్జాతీయ బహుభాషా కవి సమ్మేళనాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గవర్నర్ మాట్లాడుతూ కవిత్వం సమాజానికి చుక్కాని లాంటిదని, సమాజంలోని రుగ్మతల్ని ఎత్తిచూపుతూ మార్గదర్శకం చేస్తుందన్నారు. తెలుగు భాషలో అద్వితీయమైన కవిత్వం వెలువడిందని, 16వ శతాబ్దిలో రామరాజభూషణుడు చక్కటి కవిత్వాన్ని అందించారని చెప్పారు. ఈ సందర్భంగా బహుభాషా కవి సమ్మేళనం(అమరావతి పొయెటిక్ ప్రిజం-2019) ఎడిషన్‌ను గవర్నర్ ఆవిష్కరించారు. 85 దేశాలకు చెందిన 761మంది కవులు 185 భాషల్లో అందించిన 1,303 కవితలతో ఐదో అమరావతి బహుభాషా కవితల సంపుటి రూపొందించామని కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అమరావతి వ్యవస్థాపక చైర్మన్ వై.హరిశ్చంద్రప్రసాద్ వివరించారు.



మురళీమోహన్‌కు పురస్కారం ప్రదానం చేస్తున్న విద్యాసాగర్‌రావు

## తెలుగును కాపాడుకోవాలి

- మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు
- ఘనంగా అక్కినేని పురస్కారాల ప్రదానోత్సవం
- మురళీమోహన్‌కు జీవన సాఫల్య పురస్కారం

సిరిపురం(విశాఖ), డిసెంబరు 21: తెలుగు భాష ఎంతో గొప్పదని, అలాంటి భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా(ఏఎఫ్ఏ) ఆధ్వర్యంలో డాక్టర్ అక్కినేని 6వ అంతర్జాతీయ పురస్కార ప్రదానోత్సవం శనివారం విశాఖపట్నంలో నిర్వహించారు. ముఖ్యఅతిథి విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ ఒకటి నుంచి ఆరో తరగతి వరకు కచ్చితంగా తెలుగు భాష లో పాఠాలు బోధించినప్పుడే మన చరిత్ర అంతరించకుండా ఉంటుందన్నారు. ప్రముఖ సినీనటుడు మాగంటి మురళీమోహన్‌కు డాక్టర్ అక్కినేని 6వ అంతర్జాతీయ జీవన సాఫల్య పురస్కారం అందజేశారు. ఉషా ముళ్లపూడి కార్డియాక్ సెంటర్‌కు వైద్య రత్న పురస్కారం, ప్రముఖ కూచిపూడి నర్తకీమణి డాక్టర్ కట్టా శోభానాయుడుకు రంగస్థల రత్న పురస్కారం, పద్మశ్రీ ఇనాక్‌కు విద్యారత్న పురస్కారం, మహానటి చిత్ర బృందం తరపున సావిత్రి కుమార్తె విజయ చాముండేశ్వరికి సినీరత్న పురస్కారం, ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ సూరపనేని విజయ్‌కుమార్‌కు వ్యాపార రత్న పురస్కారం, 'మన కోసం మనం' ట్రస్ట్‌కు సేవా రత్న పురస్కారం, సత్తిరాజు శంకరనారాయణకు వినూత్న రత్న పురస్కారం, ఫణికెర క్రాంతికుమార్‌కు యువ రత్న పురస్కారం అందజేశారు.

# 'క్యాట్' దెబ్బకు మటాష్!



బ్యాంక్ కెనాల్‌లో దొరికిన క్యాట్ ఫిష్‌ను పక్కన పారబోసిన దృశ్యం

- దేశీయ మత్స్య సంపదకు పెను ముప్పు
- కృష్ణా, గోదావరిలో ఎక్కువైన క్యాట్‌ఫిష్
- ఎగువ రాష్ట్రాల్లో వరదలతో నదుల్లోకి
- ఆపై చెరువుల్లో చేరినట్టు అనుమానం
- సంతానోత్పత్తి అధికం.. మత్స్యకారుల్లో కలవరం



తెనాలి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): క్యాట్‌ఫిష్.. చాలా డేంజరస్ ఫిష్..! ఇది చెరువులో ఉన్నా.. కాలువలో ఉన్నా.. ఇతర చేపలను బతకనీయదు..! దేశీయ మత్స్య సంపదకు పెనుముప్పు. పోనీ ఈ చేపను తిందామంటే ఆరోగ్యానికి హానికరం. అందుకే దేశంలో క్యాట్ ఫిష్ పెంపకాన్ని, అమ్మకాన్ని నిషేధించారు. కానీ.. ఇటీవల కురిసిన వరదలకు ఎగువ రాష్ట్రాల నుంచి మన కృష్ణా, గోదావరి జలాల్లోకి ప్రవేశించిన క్యాట్‌ఫిష్.. అక్కడి నుంచి పంట కాల్వలు, చెరువులు, నీటి కుంటలకూ వ్యాపించింది. కృష్ణా, గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లోని కాల్వల నుంచి నదీపాయల వరకూ ఎక్కడ చూసినా ఇదే కనిపిస్తోంది. గంపెడాశలతో వలలు విసురుతున్న మత్స్యకారులు వాటిలో 60 నుంచి 80 శాతం క్యాట్‌ఫిష్‌లే ఉండడం చూసి ఉసూరుమంటున్నారు. క్యాట్ ఫిష్ అమ్మకం, ఎగుమతిపై నిషేధం ఉండడంతో చేసేదీమీ లేక వాటిని ఒడ్డున పారబోస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ క్యాట్ ఫిష్‌తో దేశీయ మత్స్యసంపదకు పెను ప్రమాదం పొంచిఉందని మత్స్యశాఖ నిపుణులు చెబుతున్నారు. పులస, బొచ్చె, రేగండి, మోసు వంటి దేశీయ చేపలు అంతరించిపోయే ప్రమాదం ఏర్పడుతుందని, వాటి మనుగడకు ఇది ప్రశ్నార్థకంగా మారిందని హెచ్చరిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో ఏర్పడిన ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే పట్టినవి పట్టినట్టు పారబోయాలని సూచిస్తున్నారు.



కొల్లమూడి పంటకాల్వల్లో వంతెన కింద చేపలు పడుతున్న మత్స్యకారులు

### భయపడాల్సిన పనిలేదు

ఇటీవల వరదల్లో ఎగువ రాష్ట్రాల నుంచి మన నదుల్లోకి క్యాట్‌ఫిష్ జాతులు వచ్చిచేరిన మాట నిజమే. అయితే దాని గురించి ఆందోళన చెందాల్సిన అవసరంలేదు. దాన్ని భూతంలా చూడటం కంటే, మితంగా ఆహారం కింద తీసుకుంటే ఇబ్బందేమీ ఉండదు. అయితే వీటివలన దేశవాళీ సంపద మనుగడకు మాత్రం ప్రమాదమే. ప్రస్తుతం ఇవి మన నదీపాయల్లో, కాల్వల్లోనే ఉన్నాయి. ప్రస్తుతం నీటి ప్రవాహం లేదు. కాబట్టి వచ్చే సీజన్‌లో నీటి ప్రవాహం పెరిగే నాటికి ఆ జాతి అంతరించే అవకాశం ఉంది.

**-బలరామ్, అడిషనల్ డైరెక్టర్, మత్స్యశాఖ, విజయవాడ**

### ఏటా లక్షల్లో ఉత్పత్తి

క్యాట్‌ఫిష్ ఒక జత నీటిలో ఉంటే.. అవి ఒక సంవత్సర కాలంలో 10 లక్షల సంతతిని ఉత్పత్తి చేస్తాయి. ఆ 10 లక్షల చేపలు కూడా అంతే స్థాయితో సంతానాన్ని పెంచితే?.. మిగిలిన మత్స్యసంపదకు చాలా ప్రమాదం. క్యాట్ ఫిష్ నీటిలో ఉంటే దాని చుట్టుపక్కల దేశవాళీ చేపలను బతకనీయదు. వాటికి వేసే ఆహారాన్ని కూడా ఇవే లాగించేస్తాయి. నీటిని కలుషితం చేస్తాయి. చిన్న చేపపిల్లలను తినేస్తాయి. అందుకే ప్రభుత్వం వాటి పెంపకాన్ని నిషేధించింది.

### ఇవి తిన్నా ప్రమాదమే..

గోదావరిలో పులస, కృష్ణాలో రేగండి, మోసు చేపల్ని ఇష్టంగా తింటారు. అయితే క్యాట్‌ఫిష్ వల్ల ఇప్పుడు ఈ జాతులు తగ్గిపోతున్నాయి. దేశీయ చేపలైన జల్ల, ఇంగ్లాయి వంటివి క్యాట్‌ఫిష్ సంతతికి చెందినవే. కానీ ప్రస్తుతం నదీ జలాల్లో కనిపిస్తున్న వాటిలో అత్యంత ప్రమాదకరమైనది ఆఫ్రికన్ క్యాట్‌ఫిష్. ఈ చేపలపై మచ్చలతోపాటు, నోరు పెద్దదిగా ఉంటుంది. కాగా.. క్యాట్‌ఫిష్ తినడం ఆరోగ్యానికీ ప్రమాదమే. ఇందులో ఉండే ఒమేగా 3 ఫ్యాటీ ఆమ్లాలు గుండె జబ్బులను మేలు చేసినా.. ఒమేగా 6 ఫ్యాటీ ఆమ్లాలు నరాల వ్యవస్థను దెబ్బతీస్తాయి.



## ఎన్‌ఆర్సీ, సీఏఏలకు వ్యతిరేకంగా నెల్లూరులో ముస్లింల భారీ ర్యాలీ

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 21 : రాజ్యాంగానికి విరుద్ధంగా మత ప్రాతిపదికన పౌరసత్వాన్ని ఇవ్వాలని పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఎన్‌ఆర్సీ, సీఏఏ బిల్లులకు వ్యతిరేకంగా శనివారం రాత్రి ముస్లింలు నెల్లూరులో భారీ ప్రదర్శన నిర్వహించారు. జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు ఈ ర్యాలీలో ముస్లిం పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నగరంలోని కోటమిట్ట మసీదు సెంటర్ నుంచి కొందరు, షాదీమంజిల్ నుంచి మరి కొందరు బ్యాచ్‌లుగా తరలి వచ్చారు. వీరంతా కోటమిట్ట డైకస్ రోడ్డు, పాత జడ్పీ ఆఫీసుల మీదుగా వీఆర్సీ సెంటర్‌కు వచ్చి బిల్లులకు ప్రధాన మంత్రికి వ్యతిరేకంగా నిరసన నినాదాలు చేశారు. కొవ్వొత్తులతో నిరసనలు వ్యక్తం చేశారు. మరో బృందం షాదీ మంజిల్ నుంచి చేపల మార్కెట్, వహబ్‌పేటల మీదుగా నెహ్రూ బొమ్మ, వీఆర్సీల మీదుగా గాంధీబొమ్మ వరకు భారీ ర్యాలీగా తరలి వచ్చారు.

## లోకం తీరు




ఇప్పుడు ఈ గీతం ఎందుకు పాడుతున్నారు సార్?

### చలికాలం

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| గుంటూరు | 17.8 | 31.7 |
| అనంతపురం | 18.2 | 24.5 |
| విజయవాడ | 21.2 | 31.6 |
| శ్రీకాకుళం | 22.0 | 30.5 |
| ప్రకాశం | 22.7 | 29.7 |

## తేలికపాటి జల్లులు

విశాఖపట్నం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతం పరిసరాల్లో ఉపరితల ద్రోణి ఆవరించడంతో తేమగాలులు వీస్తున్నాయి. ఈ ప్రభావంతో శనివారం కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా తేలికపాటి జల్లులు కురిశాయి. రానున్న ఇరవై నాలుగు గంటల్లో కోస్తా, రాయలసీమల్లో చెదురుమదురుగా జల్లులు కురిసే అవకాశం వుందని వాతావరణ శాఖ తెలిపింది. కాగా ఉపరితలంలో ఉత్తరాది నుంచి పొడిగాలులు వీస్తున్నాయి. అయితే మేఘాలు ఆవరించడంతో రాత్రి చలి వాతావరణం వున్నా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఒకటి నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి.



### హక్కుల నేతల అరెస్టు తప్పు

ఎల్గార్ పరిషత్ కేసులో వరవరరావు సహా తొమ్మిది మంది హక్కుల నేతలను అరెస్టు చేయడం పెద్ద తప్పిదం. ప్రతీకారేచ్ఛతో చేసిందే. దీనిపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేసి, విశ్రాంత న్యాయమూర్తి చేత విచారణ జరిపించాలి. అరెస్టు చేసిన పోలీసు అధికారులను కూడా సస్పెండ్ చేయాలని కోరారు.

**- శరద్ పవార్, ఎన్సీపీ అధినేత**



### ప్రభావం కోల్పోతున్న చర్చిలు

ఆధునిక ప్రపంచంలో క్రిస్టియన్లపై విశ్వాసం సన్నగిల్లుతోంది. పాస్టర్లు తమ ఆలోచనా విధానాన్ని, వైఖరిని మార్చుకోకుంటే చర్చిలు ప్రజలపై ప్రభావాన్ని కోల్పోతాయి. ముఖ్యంగా యూరప్, పశ్చిమ దేశాల ప్రజల నమ్మకం పెంపొందించేందుకు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి.

**- పోప్ ఫ్రాన్సిస్**

### గుడ్డుతో గుండెకు ముప్పేం లేదు

వాషింగ్టన్, డిసెంబరు 21 : రోజూ ఓ గుడ్డు తింటే గుండెకు వచ్చే ముప్పేం లేదని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ శాస్త్రవేత్తలు అంటున్నారు. గుడ్డులోని పచ్చసొనలో ఉండే 4.5 గ్రాముల కొలెస్ట్రాల్(కొవ్వు)తో హృద్రోగాలు వచ్చే అవకాశమే లేదని పేర్కొన్నారు. మితిమీరిన కొలెస్ట్రాల్ ఉండే మాంసాహార ఉత్పత్తులు, వంటనూనెలు.. ఉప్పు, చక్కెర అతిగా ఉండే తినుబండారాల నుంచే గుండెకు అసలైన ముప్పు పొంచి ఉందని చెప్పారు. మొక్కజొన్న నూనె, సోయాబీన్ నూనెల వాడకంతో శరీరంలో కొలెస్ట్రాల్ మోతాదును అదుపులో పెట్టుకోవచ్చని సూచించారు.

### ఫిల్టర్డ్ కాఫీతో టైప్-2 మధుమేహ నివారణ

స్టాక్‌హోం, డిసెంబరు 21: టైప్-2 మధుమేహ ముప్పును నివారించడంలో ఫిల్టర్ చేసిన కాఫీ సహాయపడుతుందని పరిశోధకులు తెలిపారు. స్వీడన్‌లోని చామర్స్ యూనివర్సిటీ, యూమియా యూనివర్సిటీ పరిశోధకులు నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. ఫిల్టర్ చేసిన కాఫీని కొద్ది రోజులపాటు తాగిన వారి రక్తంలోని అణువులను పరీక్షించారు. టైప్-2 మధుమేహ ముప్పును నివారించడంలో ఫిల్టర్డ్ కాఫీ పాజిటివ్ ఫలితం చూపించిందని పరిశోధకులు తెలిపారు. కానీ వేడిచేసిన కాఫీతో ఇటువంటి ఫలితం రాలేదని వెల్లడించారు. రోజుకు ఒక కప్పు కన్నా 2 నుంచి 3 కప్పుల ఫిల్టర్డ్ కాఫీ తాగిన వారిలో టైప్-2 మధుమేహ ముప్పు 60 శాతం తగ్గిందని వివరించారు.

### సవరణ

'ఆంధ్రజ్యోతి' శనివారం ప్రధాన సంచిక తొలి పేజీలో పంచాంగం వివరాలు పాతవి ప్రచురితమయ్యాయి. పొరపాటుకు చింతిస్తున్నాం.

**-ఎడిటర్**



## నిత్యాన్నప్రసాదానికి కోటి విరాళం

తిరుమల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీ వేంకటేశ్వర నిత్యాన్నప్రసాద ట్రస్టుకు శనివారం కోటి రూపాయలు విరాళంగా అందింది. విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన ఆలయం వెలుపలకు వస్తున్న సమయంలో ఓ భక్తుడు రూ.కోటి విరాళానికి సంబంధించిన చెక్కును స్వామీజీ చేతుల మీదుగా టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో ధర్మారెడ్డికి అందజేశారు.

## త్రీడీ టెక్నాలజీతో శ్రీవారి ఆభరణాల చిత్రీకరణ

**▸▸ టెక్ మహీంద్ర సీఎండీ**



తిరుమల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): క్రియేటింగ్ త్రీడి ఇమేజ్‌తో తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆభరణాలను యథాతథంగా చిత్రీకరించి భక్తులు దర్శించుకునేందుకు వీలుగా ఎస్వీ మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచుతామని టెక్ మహీంద్ర సీఎండీ సి.పి.గుర్నాని తెలిపారు. శనివారం ఉదయం ప్రారంభ సమయంలో ఆయన కుటుంబ సమేతంగా శ్రీసేవలో పాల్గొన్నారు.

## మోదీది నియంత పాలన

**▸▸ ఎన్‌ఆర్‌సీకి మద్దతివ్వం**

**▸▸ సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా వెల్లడి**

**▸▸ సార్వత్రిక సమ్మెకు మద్దతివ్వాలని పిలుపు**

గుంటూరు(తూర్పు), డిసెంబరు 21: నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక అంబానీ వంటి పారిశ్రామిక వేత్తలకు మాత్రమే మంచి రోజుల వచ్చాయని, కార్మికులు, పేదలు మరింత దుర్భరస్థితిని ఎదుర్కొంటున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా విమర్శించారు. శనివారం గుంటూరులో జరిగిన సీపీఐ 94వ వార్షికోత్సవ సభలో రాజా మాట్లాడుతూ, పౌరసత్వ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఈశాన్య రాష్ట్రాలు, తమిళనాడు, మహరాష్ట్రలతో పాటు దేశవ్యాప్తంగా ప్రజలు ఆందోళన చేస్తున్నారని తెలిపారు. సంక్షోభంలో కూరుకుపోయిన ఆర్థిక వ్యవస్థను వదిలేసి, మోదీ ప్రభుత్వం కుట్ర పూరిత బిల్లులను తీసుకవస్తోందని ధ్వజమెత్తారు. మతాల వారీగా విడగొట్టే ఎన్ఆర్‌సీ బిల్లులను తాము ఒప్పుకోబోమని చెప్పారు. మోదీ విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా కర్షక, కార్మికులు జనవరి 8న చేసే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని రాజా పిలుపునిచ్చారు. కాగా, 12 మందిని చంపిన కేసులో ముద్దాయిగా ఉన్న వ్యక్తి దేశానికి హోంమంత్రిగా ఉంటే శాంతి భద్రతలు ఇలానే ఉంటాయని సీపీఐ నేత కె.నారాయణ నిప్పులు చెరిగారు.

## గొల్ల మండపం తొలగింపునకు బీజేపీ వ్యతిరేకం

**▸▸ భానుప్రకాష్‌రెడ్డి**

తిరుమల, డిసెంబరు 21: తిరుమలలో శ్రీవారి ఆలయం ముందున్న గొల్ల మండపం తొలగింపును బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని రాష్ట్ర కార్యదర్శి భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గొల్లమండపాన్ని తరలించేందుకు అంగీకరించబోమని చెప్పారు. అత్యాధునిక పరిజ్ఞానంతో గొల్లమండపాన్ని పరిరక్షించేలా ప్రభుత్వం, టీటీడీ ప్రయత్నం చేయాలని ఆయన కోరారు. గొల్లమండపాన్ని తొలగిస్తే జరగబోయే అనర్థాలకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని హెచ్చరించారు.

## తిరుమలలో ఆలయ సంప్రదాయాలకు తూట్లు

తిరుపతి (ఆటోనగర్), డిసెంబరు 21: తిరుమలలో శ్రీవారి ఆలయ మహద్వారం ద్వారా అనర్హులను అనుమతించి ఆలయ సంప్రదాయాలకు ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో ధర్మారెడ్డి తూట్లు పొడిచారని రాయలసీమ హక్కుల పోరాట సమితి కన్వీనర్ పి.నవీన్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. పీఠాధిపతులు శ్రీవారి దర్శనానికి వచ్చినపుడు ఆయనతో పాటు శిష్యులు మొత్తం ఐదుగురిని మహద్వారం నుంచి అనుమతించడం ఆనవాయితీ. అయితే శనివారం శారదాపీఠం స్వామీజీలు ఇద్దరితో పాటు వారి శిష్యబృందానికి, ఇద్దరు మీడియా ప్రతినిధులకు మహద్వార ప్రవేశం కల్పించడం ఎంతవరకు సమంజసమని నవీన్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు.

## దేవదాయ గ్రేడ్-2 ఈవో ఎన్నికలు ఏకగ్రీవం

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో నర్సింబాబు వర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. శనివారం విజయవాడలో నిర్వహించిన అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో సుమారు 800 మంది ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా నర్సింబాబు(గుంటూరు), జనరల్ సెక్రటరీగా వీర్రాజు(తూర్పుగోదావరి జిల్లా) ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దొరబాబు, ట్రెజరర్‌గా మోహన్ వీరారెడ్డితో పాటు 13మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులను ఎన్నుకున్నారు.

## సగానికి తగ్గిన రబీ సాగు

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రబీ పంటల సాగు సగానికి సగం తగ్గింది. రెండో పంటగా వరి మినహా ఇతర పంటల వేసేందుకు సమయం మించిపోయింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 52% రబీ పైర్లు మాత్రమే సాగులోకి వచ్చాయి. 25.84 లక్షల హెక్టార్ల రబీ సాగు లక్ష్యంలో సాధారణంగా 22.78 లక్షల హెక్టార్లలో పంటలు వేస్తుంటారు. కానీ గత మూడు నెలల్లో 11.90 లక్షల హెక్టార్లలోనే పంటలు వేసినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు చెప్తున్నాయి. ఇంతవరకు వరి నాట్లు 2.18లక్షల హెక్టార్లలోనే పడ్డాయి. జొన్న, సజ్జ, మొక్కజొన్న, ఇతర చిరు ధాన్యాలన్నీ కలిపి లక్షా 64వేల హెక్టార్లలోనే వేశారు. శనగ 95% సాగులోకి వచ్చింది. మినుము, పెసర 40% మించలేదు. నూనెగింజల సాగు 64వేల హెక్టార్లకే పరిమితమయ్యింది. ఉల్లి, మిర్చి 55% కూడా సాగులోకి రాలేదు.

## రాష్ట్రానికి ఈజిప్టు ఉల్లి

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): దేశంలో ఉల్లి నిల్వలు అడుగంటడంతో డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని కేంద్రం ఈజిప్టు ఉల్లిపాయలను దిగుమతి చేసుకుంది. ఇప్పటికే ముంబై పోర్టుకు వచ్చిన లోడుల్లో తొలి విడత 80మెట్రిక్ టన్నుల ఉల్లిని ఏపీకి కేటాయించారు. ఈ సరుకు శనివారం రాష్ట్రానికి చేరుకుంది. వాటిని రైతుబజార్లు, మార్కెట్ యార్డులకు తరలించి, సోమవారం నుంచి వినియోగ దారులకు సరఫరా చేయడానికి మార్కెటింగ్ శాఖ సన్నాహాలు చేస్తోంది. ఉల్లి ధరల పెరుగుదల నేపథ్యంలో రాష్ట్రంలో గత నెల 17 నుంచి కర్నూలు, తాడేపల్లిగూడెం, హైదరాబాద్, సోలాపూర్ తదితర ప్రాంతాల నుంచి సేకరించిన ఉల్లిని రాయితీపై మార్కెటింగ్ శాఖ పంపిణీ చేస్తోంది. ఇప్పటి వరకు 70 వేల మెట్రిక్ టన్నుల ఉల్లిని కిలో రూ.25చొప్పున పంపిణీ చేసినట్లు అధికారులు చెప్తున్నారు.

## యువతి స్నానం చేస్తుండగా వీడియో

**▸▸ యువకుడిపై ఫిర్యాదు తీసుకోవడంలో ఎస్ఐ నిర్లక్ష్యం**

**▸▸ ఆధారాలు మాయం చేశారని స్టేషన్ ముందు గ్రామస్తుల ధర్నా**

గోకవరం, డిసెంబరు 21: స్నానం చేస్తున్న యువతి వీడియోను చిత్రీకరించిన యువకుడిపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన బాధితురాలి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్ఐ తీరుపై శనివారం తూర్పుగోదావరి జిల్లా గోకవరం పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన యువతి శుక్రవారం స్నానం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన దిండి రామ్‌కుమార్(రాము) సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. ఇది గమనించిన యువతి అతన్ని పట్టుకునే ప్రయత్నంలో రాము పారిపోగా, సెల్‌ఫోన్ చిక్కింది. ఈ మేరకు కుటుంబసభ్యులతో కలిసి రాముపై ఫిర్యాదు చేసేందుకు ఆ యువతి శనివారం గోకవరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. ఉదయం సుమారు 11 గంటలకు స్టేషన్‌కు వెళ్లినప్పటికీ మధ్యాహ్నం 2గంటల వరకు ఆమె గోడు ఎవరూ వినిపించుకోలేదు. ఆ తరువాత ఎస్ఐ చెన్నారావు ఫిర్యాదును మొక్కుబడిగా స్వీకరించి నిందితుడు కనబడితే తమకు ఫోన్ చేయాలని యువతితో చెప్పారు. దీంతో ఎస్ఐ వ్యవహర తీరుతో మనస్తాపానికి గురైన బాధితురాలు గ్రామపెద్దల సహకారంతో విషయాన్ని ఉన్నతధికారుల దృష్టికి తీసుకెళ్లగా రాముపై కేసు నమోదుచేశారు. ఎస్ఐ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా మాజీ ఎంపీపీ జనపరెడ్డి సుబ్బారావు ఆధ్వర్యంలో స్టేషన్‌ముందు గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. బాధితురాలు ఎస్ఐకు అందజేసిన సెల్‌ఫోన్, ఆధారాలను మాయం చేయడమే కాకుండా, నిందితుడికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. నార్త్‌జోన్ డీఎస్పీ సత్యనారాయణరావు, సీఐ పవన్‌కుమార్‌రెడ్డి ఆందోళనకారులతో చర్చలు జరిపి బాధితురాలికి న్యాయం చేస్తామని, ఎస్ఐపై విచారణ జరుపుతామని హామీఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు.

## టీటీడీ నిర్ణయం సబబే

**▸▸ వైకుంఠద్వార దర్శనం 2రోజులే: స్వరూపానందేంద్ర**

తిరుమల, డిసెంబరు 21: 'నిత్యాభిషేకాల వల్ల ఉత్సవ మూర్తులు బాగా అరిగిపోతున్నాయి కాబట్టి అభిషేకాలు తగ్గించాలని టీటీడీ ఆగమ సలహామండలి నిర్ణయం తీసుకుంది. విగ్రహాల స్వరూపం కోల్పోకుండా కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. నేనైతే వాళ్ల నిర్ణయం కరెక్టనే చెబుతున్నా. ఈ ఏడాది ఉత్తరద్వార దర్శనం పదిరోజులు ఉండదు. రెండురోజులు మాత్రమే ఉంటుంది' అని విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర అన్నారు. పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రతో కలిసి శ్రీవారిని దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. కాగా, శనివారం ఉదయం 10గంటలకు ఆలయం వద్దకు చేరుకున్న స్వాములకు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో ధర్మారెడ్డి, ప్రధాన అర్చకులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. ఆలయంలోకి వెళ్లిన స్వాములు ధ్వజస్తంభాన్ని తాకుతూ వెళ్లి మూలవిరాట్టును దర్శించుకున్నారు. పీఠాధిపతులు దర్శనానికి వస్తున్న సమయంలో 10- 10.21గంటల వరకు క్యూలైన్‌ను నిలిపివేశారు. పీఠాధిపతితో ఐదుగురు శిష్యబృందానికి కూడా ప్రవేశానుమతి ఉండటంతో స్వరూపానందేంద్రతో పాటు ప్రముఖ చానల్ అధినేత, మరో చానల్ సీఈవో, ఓ దాత కూడా మహద్వారం నుంచి దర్శనానికి వెళ్లారు.

## అన్యమత ప్రచారాన్ని అడ్డుకోవాలి

**▸▸ జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రాములు**



తిరుమల, డిసెంబరు 21: తిరుమలలోనూ అన్యమత ప్రచారాలు జరుగుతున్నాయని, ఇకపై అలా జరగకుండా చూడాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రాములు సూచించారు. శనివారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో అన్యమత ప్రచారం అధికంగా ఉందని, దీనివల్ల దేశంలో మతసామరస్యం దెబ్బతినే పరిస్థితులు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తంచేశారు. అలాగే దళితులపై హత్యాచారాలు చాలా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవల తిరుపతిలో ఒక ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తున్న దళితుడిని హత్యచేశారని, ఇంతవరకు కేసు నమోదు చేయలేదని చెప్పారు. దళితుల భూములను ఆక్రమిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో అన్ని సమస్యలను పరిష్కరించాలని శ్రీవారిని కోరుకున్నట్టు తెలిపారు.

# మాతృభాషను రక్షించుకుందాం

### స్వాభిమానం పెంచుకుందాం

**▸▸ ప్రపంచ తెలుగు మహాసభల లక్ష్యం ఇదే**

**▸▸ ఆంగ్ల మాధ్యమంపై సభల్లో చర్చిస్తాం**

**▸▸ తెలుగువారిలో జాత్యాభిమానం తక్కువే**

**▸▸ 'ఆంధ్రజ్యోతి'తో మండలి బుద్ధప్రసాద్**



విజయవాడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): 'తమిళనాడు, కర్ణాటకల్లో అక్కడివారు తమ భాష పట్ల చూపే మమకారం మనం మన భాషపై చూపడం లేదు. తెలుగువారిలో జాత్యాభిమానం తక్కువే. ఆంధ్రులు ఒక విషయం గుర్తుపెట్టుకోవాలి. ఎప్పుడైతే భాష నశించిందో అప్పుడు జాతి కూడా నశిస్తుంది. తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క తెలుగువాడిపైనా ఉంది' అని మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్ వ్యాఖ్యానించారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో నాలుగో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలను విజయవాడలో నిర్వహించనున్న నేపథ్యంలో బుద్ధప్రసాద్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

### తొలి మూడు మహాసభల్లో...

తెలుగు భాష పరిరక్షణే లక్ష్యంగా 2007నుంచి ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహిస్తున్నాం. భారత స్వాతంత్ర్య స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని జాతీయాభిమానాన్ని పెంపొందించడంలో రచయితల పాత్ర, తెలుగుభాషకు ప్రాచీన హోదా తీసుకురావడానికి చేయాల్సిన ప్రయత్నాల గురించి తొలి మహాసభల్లో చర్చించాం. 2011లో నిర్వహించిన రెండో మహాసభల్లో అంతర్జాలం ద్వారా తెలుగును వ్యాప్తిచేసి ప్రపంచ భాషగా గుర్తింపు తీసుకురావడానికి ప్రయత్నించాం. ఈ దిశగా సత్ఫలితాలు కూడా సాధించాం. 2015లో మూడో మహాసభల్లో వేర్పాటు ఉద్యమాల ద్వారా వచ్చిన అభిప్రాయ భేదాలు సమసిపోయేలా చేయడంపై దృష్టి సారించాం. తెలుగు భాష.. తెలుగు వారు ఒకటే అని చాటిచెప్పడంలో ఈ సభలు విజయవంతమయ్యాయి.

### స్పందన అనూహ్యం

నాలుగో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలను నిర్వహిస్తున్నట్లు ఆరునెలల క్రితమే ప్రకటించాం. అప్పటినుంచి స్పందన అనూహ్యంగా ఉంది. రూ.500 ప్రతినిధి రుసుం కట్టి ఎవరి బస వారే ఏర్పాటు చేసుకుని సభల్లో పాల్గొనేందుకు దాదాపు 1,500మంది నమోదు చేసుకున్నారు. గతంలో ఎప్పుడూ ఈ స్థాయిలో స్పందన లేదు. విద్యాబోధనలో తెలుగు మాధ్యమాన్ని తొలగించి ఆంగ్లమాధ్యమం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఈ మహాసభలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తెలుగును ఏ విధంగా రక్షించుకోవాలి. భావితరానికి తెలుగు భాషను, సంస్కృతిని ఏవిధంగా అందించాలనే విషయంపై చర్చించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

### తెలుగు భాష వన్నెలీనాలంటే...

సాహిత్యపరంగా చూస్తే తెలుగు సంగీత ప్రాధాన్యం ఉన్న భాష. మన కవులు, వాగ్గేయకారులు తమ రచనల ద్వారా భాషకు మాధుర్యాన్ని తీసుకొచ్చారు. ఆ దిశగా మళ్లీ రచనలు రావాలి. మూస రచనలతో గుర్తింపు రాదు. రచయితలు కొత్త పంథాను తొక్కినప్పుడే వారికి, వారి సాహిత్యానికి గుర్తింపు వస్తుంది. నూతన సృజనలకే జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుంది. జ్ఞానపీఠ్ వంటి పురస్కారాలూ ఆ దృక్పథంతోనే ఇస్తారు. గతంలో పత్రికలు, ఆకాశవాణి వంటి మాధ్యమాలు తెలుగును వ్యాప్తి చేయడంలో కీలక పాత్ర పోషించాయి. ప్రస్తుతం తెలుగులో 60-70 ప్రసారమాధ్యమాలు ఉన్నాయి. అవి ఆంగ్లమో, ఆంధ్రమో తెలియని సంకర భాషను వ్యాపింపజేస్తున్నాయి. నేటి పత్రికల్లో ఇంగ్లీషు హెడ్డింగులే దర్శనమిస్తున్నాయి. కొత్తగా పద సృష్టి జరగడంలేదు. ఈ అంశాలన్నింటిపైనా సమగ్ర చర్చ జరిగి.. భాషా పరిరక్షణ, భాషా పరివ్యాప్తి జరిగేలా ఈ సభలు దోహదపడాలన్నదే మా ఆకాంక్ష. 'మాతృభాషను రక్షించుకుందాం.. స్వాభిమానం పెంచుకుందాం' అన్నది ఈ మహాసభల లక్ష్యం. తెలుగువాడిగా పుట్టినందుకు గర్వపడే విధంగా మనం తయారుకావాలి. అప్పయ్య దీక్షితులు చెప్పినట్లు.. ఆంధ్రుడిగా పుట్టడం.. ఆంధ్రభాష మాట్లాడటం ఎన్నో జన్మల తపోఫలంగా భావించాలి.

## డిప్యూటీ సీఎం సభలో బీసీ మహిళా నేతకు చేదు అనుభవం

**▸▸ అనుమతి లేదంటూ వేదిక నుంచి దించేసిన పోలీసులు**



పోలీసులతో విజయలక్ష్మి వాగ్వాదం

బొబ్బిలి డిసెంబరు 21: విజయనగరం జిల్లా రజక సంఘం అధ్యక్షురాలు, బీసీ సంఘం నేత ఎలిగాపు విజయలక్ష్మికి శనివారం చేదు అనుభవం ఎదురైంది. బొబ్బిలి మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన వైఎస్సార్ నేతన్న నేస్తం ఆవిష్కరణలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణికి.. సభ ముగిసిన తరువాత తమ సంఘం తరపున వినతి పత్రం అందజేసేందుకు విజయలక్ష్మి వేదికపైకి వెళ్లారు. వినతిపత్రం అందజేస్తున్న సమయంలో పోలీసులు ఆమెను బలవంతంగా కిందకు దించేశారు. జిల్లా బీసీ నాయకురాలినైన తనపై అకారణంగా దౌర్జన్యం చేస్తారా? అంటూ ఆమె పోలీసులను ప్రశ్నించారు. ఇంతలో సీఐ .కేశవరావు అక్కడికి చేరుకొని అనుమతి లేకుండా వేదికపైకి వెళ్లరాదని చెప్పడంతో విజయలక్ష్మి కన్నీటి పర్యంతమై అక్కడ నుంచి వెళ్లిపోయారు. బీసీలకు అందులోనూ మహిళకు ఇచ్చే గౌరవం ఇదేనా? అని ఆమె వాపోయారు. అనంతరం ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఆయన సోదరుడు వేణుగోపాలనాయుడు నచ్చచెప్పడంతో పుష్పశ్రీవాణిని శాలువాతో సత్కరించి తమ సంఘం తరపున విజయలక్ష్మి వినతిపత్రం అందజేశారు.



ఆర్బిట్‌ను విడుదల చేస్తున్న ఎస్కో ప్రతినిధులు

## మార్కెట్లోకి ఎస్కో ఆర్బిట్

విజయవాడ, డిసెంబరు 21: జాక్వార్ గ్రూప్, కాస్మో డ్యూరబుల్స్ ఆధ్వర్యంలో విజయవాడలో ఎస్కో డీలర్స్ మీట్ జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలనుంచి సుమారు 50మంది డీలర్లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాస్మో డ్యూరబుల్స్ ఎండీ హరినాథ్ బాబు, హరిప్రసాద్, జాక్వార్ గ్రూప్ సంస్థ నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ బ్రాంచ్ హెడ్ సీతారామ్, ఆంధ్రప్రదేశ్ హెడ్ సాయికృష్ణ, ఎస్కో సూరిబాబు, జాక్వార్ వంశీకృష్ణ పాల్గొన్నారు. ఎస్కో బ్రాండ్ నుంచి "ఆర్బిట్" అనే కొత్త ప్రొడక్ట్ (ఫాసెట్ శానిటరీ)ను లాంచ్ చేశారు. గత 30 ఏళ్లగా తాము డీలర్లుగా ఉన్నామని కాస్మో డ్యూరబుల్స్ ఎండీ హరినాథ్‌బాబు తెలిపారు.

## సచివాలయాలకు ప్రత్యేకశాఖ

**▸▸ దాని పర్యవేక్షణలోనే సిబ్బంది, వలంటీర్లు**

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాలకు ప్రత్యేకశాఖను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. 'నవరత్నాలు' అమలు చేసేందుకు ప్రభుత్వం రెండన్నర లక్షల వలంటీర్లను, గ్రామ/వార్డు సచివాలయాలను ఏర్పాటుచేసి ఒకటిన్నర లక్షలమంది ఉద్యోగులను నియమించిన ప్రభుత్వం... జనవరి నుంచి పూర్తిస్థాయిలో సేవలందించాలని ఆదేశాలిచ్చింది. అటు గ్రామ, ఇటు పట్టణాలకు సంబంధించి రెండు శాఖలతో సమన్వయం చేసుకోవడం ఇబ్బందిగా ఉండటంతో గ్రామ, వార్డు సచివాలయాలకు ప్రత్యేక శాఖను సృష్టించేందుకు కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే ఐఏఎస్ అధికారి కన్నబాబుకు ఈ బాధ్యతలు అప్పచెప్పారు. సచివాలయాల కార్యక్రమాలను ఆయన బృందమే నిర్వహిస్తోంది.

# టీచర్ల బదిలీపై కదలిక

**▸▸ సంక్రాంతి సెలవుల్లో కసరత్తు**

**▸▸ పనితీరు పాయింట్లు ఎత్తివేత**

**▸▸ సర్వీసు పాయింట్లే ప్రాతిపదిక**

**▸▸ వెబ్‌కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు**

**▸▸ విద్యాశాఖ నుంచి జీఏడీకి ఫైలు**



అమరావతి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీలపై కదలిక వచ్చింది. సంక్రాంతి సెలవుల సమయంలో బదిలీలు చేపట్టే దిశగా కసరత్తు జరుగుతోంది. ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను సిద్ధంచేసిన పాఠశాల విద్యా కమిషనర్ తాజాగా ప్రతిపాదిత ఫైలును ప్రభుత్వానికి పంపించారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి పరిశీలన అనంతరం దాన్ని రెండు రోజుల క్రితం సాధారణ పరిపాలనశాఖ(జీఏడీ)కు పంపించారు. అక్కడి నుంచి ఫైలు తొలుత న్యాయశాఖకు తర్వాత ఆర్థికశాఖకు వెళుతుంది. స్వల్ప మార్పులతో పాత మార్గదర్శకాలనే అనుసరించాలని విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ఉపాధ్యాయ సంఘాల నుంచి వ్యతిరేకత రావడంతో గతంలో ప్రవేశపెట్టిన పెర్ఫార్మెన్స్ పాయింట్లను ఎత్తివేయాలని, సర్వీస్ పాయింట్ల ప్రాతిపదికగా బదిలీలు చేపట్టాలని సంకల్పించింది. ఉపాధ్యాయుని మొత్తం సర్వీసు, ఒక పాఠశాలలో పూర్తిచేసిన సర్వీసును బట్టి పాయింట్లు కేటాయించి.. వాటి ప్రాతిపదికగా ప్రాధాన్యతలు కల్పిస్తారు. ఒక ప్రాంతంలో కనీసం రెండేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారు బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక పాఠశాలలో గరిష్ఠంగా 8 ఏళ్ల సర్వీసున్న ఉపాధ్యాయులు, ఐదు సంవత్సరాల సర్వీసున్న ప్రధానోపాధ్యాయులను తప్పనిసరిగా బదిలీ చేస్తారు. జనవరి 10 నుంచి 20 వరకు పాఠశాలలకు సంక్రాంతి సెలవులు. ఆ సమయంలో ఉపాధ్యాయులు కూడా ఖాళీగానే ఉంటారు కాబట్టి.. వెబ్‌కౌన్సెలింగ్ ద్వారా బదిలీల ప్రక్రియ చేపడితే సమయం ఆదా అవుతుందని, విద్యార్థులకు కూడా ఇబ్బంది ఉండదన్న అభిప్రాయంతో కసరత్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. సదరు ఫైలు జీఏడీ నుంచి న్యాయశాఖకు, అక్కడి నుంచి ఆర్థిక శాఖకు వెళ్లాలి. అక్కడ గ్రీన్‌సిగ్నల్ వస్తే ముఖ్యమంత్రి వద్దకు పంపాలి. ఇంతచేసినా అక్కడ సానుకూలంగా లేకుంటే కథ వెనక్కే. ఉపాధ్యాయ బదిలీలకు సీఎం సానుకూలంగా లేరని విశ్వసనీయ సమాచారం. ఈ నేపథ్యంలో బదిలీలపై ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొంది.

## 'బయో' అటెండెన్స్ తప్పనిసరి

(మొదటి పేజీ తరువాయి)

విభాగం కింద వచ్చే శాఖాధిపతుల కార్యాలయాలు, చట్ట బద్ధ సంస్థలు, వర్సిటీలు, ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల అంతర్గత, బహిర్గత పాలనకు ఈ-ఆఫీసు విధానాన్ని అమలు చేయాలి. ఇందుకోసం అన్ని వర్సిటీలు నోడల్ అధికారులను నియమించుకోవాలి. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ శనివారం ఆదేశాలు జారీచేసింది. ఈ విద్యా సంవత్సరం నుంచి పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో అక్రమాలు, విద్యా సంస్థల్లో బోగస్ అడ్మిషన్ల నియంత్రణకు చెక్ చెప్పాలని గతంలో ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా బయోమెట్రిక్ హాజరు విధానాన్ని తెచ్చింది. కానీ, అది అమలుకు నోచలేదు. ఈ-ఆఫీసు విధానాన్ని కూడా పాక్షికంగానే నిర్వహిస్తున్నారు. ఫలితంగా పలు లోపాలు చోటుచేసుకుంటున్నట్టు విద్యా శాఖ దృష్టికి వచ్చింది. విద్యార్థులు తరగతులకు వచ్చినా, రాకున్నా పలు కళాశాలలు పరీక్షలకు పంపిస్తున్నాయి. ఫలితంగా వారందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తోంది. విద్యను వ్యాపారంగా మార్చి లబ్ధి పొందాలనుకుంటోన్న కాలేజీల యాజమాన్యాలు చేసే అక్రమాల్లో అటెండెన్స్ విధానం ముఖ్యమైనదిగా చెప్పవచ్చు. ముఖ్యంగా బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్ అడ్మిషన్లలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటువంటి కాలేజీల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు రోజూ కాలేజీకి రావాల్సిన అవసరంలేదు. ఈ మేరకు ముందే విద్యార్థులతో కాలేజీలు ఒప్పందం కుదుర్చుకుంటున్నాయి. ఇందుకోసం విద్యార్థులకు కొంత డబ్బు చెల్లిస్తున్నాయి. వారు రోజూ వస్తున్నట్టు అటెండెన్స్ రిజిస్టర్లలో చూపిస్తున్నాయి. ప్రభుత్వం నుంచి వీరికి వచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను కాలేజీ యాజమాన్యాలే తీసుకుంటున్నాయి. సరైన అధ్యాపకులను నియమించకుండా బోధనలో నాణ్యతాప్రమాణాలను దిగజారుస్తున్నాయి. వీటికి చెక్ పెట్టడానికి బయోమెట్రిక్ అటెండెన్స్ తోడ్పడుతోందని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే తాజా ఆదేశాలు జారీ చేసింది.

# హతవిధీ.. ఏదీ తిథి!?

**▸▸ టీటీడీ డైరీలో పంచాంగం వివరాలు మిస్**

**▸▸ శ్రీవారి చిత్రాలు, శ్లోకాలు కూడా మాయం**

**▸▸ చౌకబారుగా ముద్రణ.. అయినా కొరతే!**

**▸▸ అసంతృప్తితో వెనుదిరుగుతున్న భక్తులు**

తిరుపతి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి పేరుతో టీటీడీ ముద్రించే క్యాలెండర్లు, డైరీలకు విపరీతమైన డిమాండ్ ఉంది. అందుకు తగ్గట్టే ఏటా వీటి పరిమాణాన్ని పెంచుతోంది. అయితే ఈ ఏడాది డైరీల సంఖ్యతో పాటు నాణ్యతనూ అమాంతం తగ్గించేశారు. దీనికి తోడు డైరీ లోపలి పేజీల నుంచి అత్యంత కీలకమైన పంచాంగం వివరాలు తొలగించారు. మార్కెట్‌లో లభించే ఇతర డైరీలతో పోలిస్తే టీటీడీ డైరీలో ఇదే ప్రత్యేకత. శుభ ఘడియలు, గోవిందనామ కీర్తనలు ఉంటాయని ఎక్కువ మంది వీటిని ఇష్టపడుతుంటారు. తిథులు, నక్షత్రాలు, యమగండం, శుభలగ్నం, రాహుకాలం వంటి విషయాలు ఏరోజుకారోజు పేజీ పైభాగంలో స్ప ష్టంగా ఉంటాయి. పేజీ చివరన గోవింద నామాలు, భగవద్గీత సూక్తు లు ఉంటాయి. అయితే ఈ ఏడాది డైరీలో నాణ్యతతో పాటు, పేజీల్లో తిథులూ లేకపోవడంపై భ క్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. డిసెంబరు మొదటివారం నుంచి క్యాలెండర్లు అందుబాటులో ఉంటాయని, రెండోవారం నుంచి డైరీలు అందుబాటులోకి తెస్తామని నవంబరు 29న టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ప్రకటించారు. రూ.130 విలువగల పెద్ద డైరీలు 6లక్షలు, రూ.100 విలువగల చిన్న డైరీలు 1.50లక్షలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. అయితే, రూ.100 డైరీల కోసం నిత్యం వందలాది మంది టీటీడీ సమాచార కేంద్రాలు, కల్యాణ మండపాలకు వచ్చి నిరాశతో వెనుతిరుగుతున్నారు. స్వామివారి క్యాలెండర్లు, డైరీలకు ఉన్న డిమాండును దృ ష్టిలో ఉంచుకుని ఏటా బ్రహ్మోత్సవాల సమయంలోనే ఆవిష్కరించి అందుబాటులో ఉంచేవారు. అయితే ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు ముగిసి రెండు నెలలు దాటినా డైరీలు అందుబాటులోకి తీసుకురాలేకపోతున్నారు. గతేడాది 9లక్షల డైరీలు ముద్రించగా, ఈ ఏడాది 6లక్షలు మాత్రమే ముద్రించాలని తీర్మానించారు. అవికూడా ఇంతవరకు పూర్తి స్థాయిలో ముద్రణకు నోచుకోనందునే ఈ పరిస్థితి ఏర్పడిందని తెలుస్తోంది.



తిథులు ఉన్న 2019 డైరీ

తిథులు లేని 2020 డైరీ

### నిరుటితో పోలిస్తే తేడాలెన్నో..

- గతంలో ఒక తారీఖుకు ఒక పేజీ మొత్తం కేటాయించేవారు. ఈసారి ఒక పేజీలో రెండు తారీఖులు ఇరికించారు.
- ప్రతి నెల చివరి పేజీలో శ్రీవారి మల్టీకలర్ ఫొటోలు ఉండేవి. ఇప్పుడు ఆ చిత్రాల ఊసేలేదు.
- ఆనందనిలయ సమేత శ్రీవారి ముఖచిత్రం ఆయిల్ ప్రింట్‌తో ఆకట్టుకునేలా ఉండేది. ఈసారి సాధారణ ప్రింటింగ్‌తో సాదాగా కనిపిస్తోంది.
- డైరీలోని ప్రతి పేజీ గతంలో దృఢంగా ఉండేది. ఈసారి గట్టిగా తిప్పితే చిరిగిపోయేలా ఉంది.
- రెండు, మూడు పక్కపక్క పేజీల్లో పద్మావతి, శ్రీనివాసమూర్తుల చిత్రాలు ఒకే కొలతలో ఆకర్షణీయంగా కనిపించేవి. ఈసారి వాటిని వంకర టింకరగా ముద్రించారు.
- ప్రతి పేజీలో ఆరోజు తిథి, వార, నక్షత్రాలు ఉండేవి. ప్రస్తుతం ఎలాంటి పంచాగ వివరాలు లేకుండా ముద్రించారు. పేజీ కింద భాగంలో ఒక శ్రీవారి శ్లోకం ఉండేది. ఇప్పటి డైరీ చూసేవారికి శోకం తప్ప.. ఎక్కడా శ్లోకాలు కనిపించట్లేదు.


భారత ప్రభుత్వము
అణుశక్తి శాఖ
న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్
ECIL పోస్ట్, హైదరాబాద్-500 062.

లింగ సమతుల్యతను ప్రతిబింబించేలా వర్క్‌ఫోర్స్ ను కలిగి ఉండాలనే ప్రభుత్వ విధానం వలన మహిళా అభ్యర్థులు దరఖాస్తుకు ప్రోత్సహించబడుతున్నారు

ప్రకటన నం. NFC / 02 / 2019

| క్ర.సం. | ఉద్యోగం పేరు | ఖాళీల సంఖ్య |
|---|---|---|
| న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్, రావత్‌భట, కోట, రాజస్థాన్‌లో ఆవశ్యకత | | |
| 01. | స్టైపెండియరీ ట్రైనీ కేటగిరి-I | 39 |
| 02. | స్టైపెండియరీ ట్రైనీ కేటగిరి-II | 184 |
| 03. | అప్పర్ డివిజన్ క్లర్క్ | 12 |
| 04. | వర్క్ అసిస్టెంట్ 'A' / హాస్పిటల్ వర్క్ అసిస్టెంట్ 'A' | 20 |
| జిర్కోనియం కాంప్లెక్స్, పజయకాయల్, ట్యుటికోరిన్ జిల్లా, తమిళనాడులో ఆవశ్యకత | | |
| 05. | స్టైపెండియరీ ట్రైనీ క్యాటగిరి-I | 06 |
| 06. | స్టైపెండియరీ ట్రైనీ క్యాటగిరి-II | 06 |
| కల్పక్కం, తమిళనాడు వద్ద PRP, బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (అణుశక్తి శాఖ యూనిట్)లో ఆవశ్యకత | | |
| 07. | స్టైపెండియరీ ట్రైనీ కేటగిరి-II | 06 |

దరఖాస్తు స్వీకరణకు చివరి తేది:10-01-2020. సవివర ప్రకటన మరియు ఇతర వివరాలకు అభ్యర్థులు NFC వెబ్‌సైట్ www.nfc.gov.in లేదా www.nfcrecruitment.aptonline.in ను చూడవల్సిందిగా కోరబడుతున్నారు.

“ రాష్ట్రానికి మూడు రాజధానులు ఉంటాయంటున్న జగన్మోహన్‌రెడ్డి... అధికారిక రాజధాని ఏది అన్నది మాత్రం చెప్పలేదు. అమరావతి, విశాఖలలో ఏది అధికారిక రాజధాని అవుతుందో తెలియదు. ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టడం ఇష్టం లేదన్న పెద్దమనిషి ఇప్పుడు ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా మధ్య చిచ్చుపెట్టబోతున్నారు. హైకోర్టును కర్నూలులో నిర్మిస్తామంటూనే.. అమరావతి, విశాఖలలో బెంచ్‌లు ఏర్పాటుచేస్తామంటున్నారు. ప్రధాన న్యాయమూర్తి ఎక్కడి నుంచి విధులు నిర్వహిస్తారో తెలియదు. ఆయన ఎక్కడ ఉంటే అదే ప్రధాన బెంచ్ అవుతుంది. తన నిర్ణయం వల్ల రాజకీయ ప్రయోజనం నెరవేరుతుందని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆశిస్తూ ఉండవచ్చు గానీ ఆచరణలో ఎలా ఉంటుందో తెలియదు.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

కొత్త పలుకు

■ ఆర్కే RK



# కులంపై కక్ష... ప్రజలకు శిక్ష!

చరిత్రలో ఒక జాతి సామూహిక ఆత్మహత్యకు ఈ తరం సాక్షీభూతంగా నిలవబోతోందా? ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలను చూస్తుంటే అవుననే అనిపిస్తోంది! ఈ అభిప్రాయం తీవ్రమైనదిగా అనిపించవచ్చును గానీ, రాష్ట్ర విభజన జరిగిన ఐదున్నరేళ్ల తర్వాత రాజధాని వ్యవహారం వివాదాస్పదం కావడాన్ని ఇంకేమి అనాలి? ఏ రాష్ట్రానికైనా దాని అస్తిత్వానికి రాజధాని చిహ్నంగా ఉంటుంది. రాజధానిగా అమరావతిని ప్రకటించడాన్ని నిండు శాసనసభ సాక్షిగా స్వాగతించిన ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు తద్విరుద్ధమైన నిర్ణయం తీసుకోబోతున్నారు. “మాట తప్పను.. మడమ తిప్పను” అని ఘనంగా చెప్పుకొనే జగన్మోహన్‌రెడ్డికి అధికారంలోకి రాగానే నాలుక మడత పడింది, మడమ బెణికింది. అధికార వికేంద్రీకరణ, అభివృద్ధి వికేంద్రీకరణ అన్న పదాలను కలగాపులగం చేసి ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారు. అభివృద్ధికి నిధులు లేవని చెప్పుకొంటున్న జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా మూడు రాజధానులను ప్రతిపాదిస్తోంది. ఒక సామాజికవర్గంపై కోపంతో, ప్రతిపక్ష నేత చంద్రబాబుపై కసితో రాష్ట్రానికి భవిష్యత్ లేకుండా చేస్తున్నారా? అన్న భావన ఏర్పడుతోంది. ‘అత్త మీద కోపం దుత్త మీద’ అన్నట్టుగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ప్రాంతాల

> **అమరావతిని చంపేయడానికి అక్కడ కమ్మ సామాజికవర్గం వారికి కూడా భూములు ఉండటం కారణమైతే ప్రభుత్వం అదే విషయం ప్రకటించాలి. అదే నిజమైతే నష్టపరిహారం చెల్లించి వారిని అమరావతి నుంచి తరిమేయండి. కులం మార్చుకోవడం సాధ్యం కాదు కనుక.. మత మార్పిడి చేయించండి. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు కారణమైతే “బాబూ! 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నావు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా, పదేళ్లకుపైగా ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నావుగా? ఇక చాలు రాజకీయాల నుంచి తప్పుకో” అని చెప్పండి. అప్పుడు ఆయనను తప్పుకోవాలని ప్రజలే ఒత్తిడి తెస్తారేమో చూద్దాం.** ”

మధ్య చిచ్చుపెట్టకూడదన్న ఉద్దేశంతో అమరావతిని రాజధానిగా అంగీకరిస్తున్నాననీ, అమరావతికి కనీసం 30 వేల ఎకరాలు ఉండాలనీ ప్రతిపక్ష నేతగా జగన్మోహన్‌రెడ్డి నాడు వాదించగా, ఇప్పుడు ఆయన మంత్రులు “అంతెందుకు? 300 ఎకరాలు చాలులే..” అంటుండటాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ప్రస్తుత ప్రభుత్వ ప్రతిపాదనల వల్ల ప్రాంతాల మధ్య చిచ్చు రగిలింది. స్పష్టమైన రాజకీయ లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మూడు రాజధానులను ప్రతిపాదించినప్పటికీ, దాని పర్యవసానాలపై అనేక సందేహాలు కలుగుతున్నాయి. రాయలసీమకు అన్యాయం చేశారని గత ప్రభుత్వాన్ని నిందించినవారు కూడా ఇప్పుడు మళ్లీ అన్యాయం చేస్తున్నారు. గత ప్రభుత్వం రైతులను ఒప్పించి 33 వేల ఎకరాలను సమీకరించగా, ఇప్పుడు ఆ రైతులు అకారణంగా రోడ్డునపడాల్సిన పరిస్థితి కల్పించారు. అమరావతి పట్ల సీమవాసుల్లో వ్యతిరేకత వ్యాపింపజేయడం వల్ల రాజధానికి భూములిచ్చిన రైతులు ఒంటరివారయ్యారు. అమరావతిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని నిందిస్తున్న ప్రభుత్వం ఏడు నెలలైనా ఆ విషయం రుజువు చేయలేకపోతున్నది. ఇప్పుడు విశాఖపట్టణంలో వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ నాయకులు ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారని తెలుగుదేశం నాయకులు ఆరోపిస్తున్నారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ పేరిట అమరావతిని జీవచ్ఛవంలా చేయడానికి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూనుకోగా, విశాఖలో ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి! నిన్న అమరావతి, నేడు విశాఖ... రేపు ఏ నగరం తెర మీదకు వస్తుందో తెలియదు. పిల్లి తన పిల్లలను మార్చినట్టు రాజధానులను మార్చుకుంటూ పోయే అధికారం ప్రభుత్వాలకు ఉంటుందా? భవిష్యత్తులో జగన్ స్థానంలో మరొకరు ముఖ్యమంత్రి అయి విశాఖ రాజధాని అయితే రాయలసీమవాసులకు దూరాభారం అవుతుందన్న వాదనతో మరోచోటుని రాజధానిగా ప్రకటించరని గ్యారంటీ ఏమిటి? తెలంగాణ ఉద్యమ సమయంలో మేం లేకపోతే మీకు పాలించడమే చేతకాదు.. కరెంటు లేక చీకట్లో మగ్గిపోతారని సీమాంధ్ర పాలకులు తెలంగాణవారిని అవహేళన చేశారు. ఇవ్వాళ తెలంగాణ సవ్యంగానే ఉంది. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో కరెంటు కోతలను ప్రజలు మర్చిపోయారు. ఆంధ్రప్రదేశ్ మాత్రమే ఆగమైపోయింది. జగన్మోహన్‌రెడ్డి పాలనలో కరెంటు కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సీమాంధ్ర ప్రజలకు ఇది అవమానం కాదా? ఆంధ్రప్రదేశ్‌లో మేధావుల మెదళ్లకు బూజు పట్టిందా? అని తెలంగాణ మేధావులు అభిప్రాయపడుతున్నారు. కుల ద్వేషాలు, వ్యక్తిగత కక్షలతో రాష్ట్రం పరిస్థితి అగమ్యగోచరంగా మారుతున్నా నోరు విప్పడానికి సంకోచిస్తున్న మేధావులు కూడా రాజకీయ నాయకుల వలె రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేస్తున్నారు. 13 జిల్లాలకు మధ్యలో ఉంటుందన్న కారణంగా అమరావతిని రాజధానిగా ప్రకటిస్తే, ఆ విషయాన్ని మరుగునపరిచి కమ్మ సామాజికవర్గం కోసమే చంద్రబాబు అమరావతిని ఎంపిక చేశారని ప్రచారం చేస్తున్నా ఒక్కరు కూడా నోరు విప్పడం లేదు. జగన్మోహన్‌రెడ్డికి తెలుసో లేదో తెలియదు గానీ విశాఖలో కూడా కమ్మ సామాజికవర్గానికి చెందినవారున్నారు. ఈ విషయం తెలిస్తే రాజధానిగా మరో ప్రాంతాన్ని ప్రతిపాదిస్తారేమో తెలియదు. గడచిన కొంతకాలంగా మంత్రులు, నిపుణులు అంటూ ప్రభుత్వం ఏర్పాటుచేసిన జీఎన్ రావు కమిటీ చెబుతున్నదాన్ని బట్టి రాజధానిపై ఎవరికీ సరైన అవగాహన లేదన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. జీఎన్ రావు కమిటీ నివేదికలోని అంశాలు పరస్పర విరుద్ధంగా ఉండటం విశేషం! ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటుచేస్తే చాలు అభివృద్ధి జరుగుతుందని రావు కమిటీ కూడా అభిప్రాయపడటం, అందుకు అనుగుణంగా సిఫారసులు చేయడం బాధ్యతారాహిత్యం. ముఖ్యమంత్రి కోరుకున్నట్టుగా నివేదిక ఇవ్వడానికి నిపుణులు అవసరమా? సంకుచిత మనస్తత్వానికి కుటిల రాజకీయాలు తోడైతే ఏమి జరగాలో అదే జరుగుతోంది. ఇప్పుడు విశాఖలో రాజధాని పేరిట కొన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేసినంత మాత్రాన అభివృద్ధి జరిగిపోదని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఎవరు చెప్పాలి? హైదరాబాద్‌నే తీసుకుందాం. హైదరాబాద్‌లో సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాలు, హైకోర్టు మొదలైనవి మొదటి నుంచీ ఉన్నాయి. అయినా, ఆధునిక అభివృద్ధి వేగం పుంజుకోవడానికి చాలా కాలం పట్టింది. ఎన్‌టీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత హైదరాబాద్ స్వరూపం మారడం మొదలైంది. సీమాంధ్రులు హైదరాబాద్‌లో పరిశ్రమలు, వ్యాపారాలు నెలకొల్పిన తర్వాత అభివృద్ధి ఆనవాళ్లు కనిపించాయి. చంద్రబాబు, రాజశేఖర్‌రెడ్డి హయాంలో హైదరాబాద్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. సైబరాబాద్ పేరిట కొత్త నగరం అభివృద్ధి చెందింది. ఇవ్వాళ హైదరాబాద్ మహా నగరంగా అభివృద్ధి చెందిందంటే అందుకు ఎన్‌టీఆర్, చంద్రబాబునాయుడు, రాజశేఖర్‌రెడ్డిలు చేసిన కృషి కారణం కాదని ఎవరనగలరు? తెలంగాణ ఏర్పాటు తర్వాత కేసీఆర్ ప్రభుత్వం కూడా అదే ఒరవడిలో పయనిస్తూ హైదరాబాద్‌ను మరింత అభివృద్ధి చేస్తోంది. వేల ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నందున హైదరాబాద్‌లో పెట్టుబడులను ఆకర్షించగలిగారు. ఈ కారణంగానే అమరావతి కోసం దాదాపు 40 వేల ఎకరాలను చంద్రబాబు నాయుడు ముందుచూపుతో సిద్ధం చేశారు. ఈ విషయం అర్థంచేసుకోవడానికి నిరాకరిస్తున్నవారు నిందలు వేస్తున్నారు. తమ పార్టీ కార్యాలయానికి నాలుగు ఎకరాలు కావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వైసీపీ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి దరఖాస్తు చేసుకోగా.. రాజధానికి 300 ఎకరాలు చాలు.. మిగతా భూమిని రైతులకు తిరిగి ఇచ్చేస్తామంటున్న మంత్రులను ఏమనాలి? అమరావతిని జీవచ్ఛవంలా మార్చి, అభివృద్ధి చేసిన ప్లాట్లను రైతులకు ఇస్తామని మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి. అమరావతిని అద్భుతంగా నిర్మిస్తానని చంద్రబాబు చెప్పిన మాటలను నమ్మి రైతులు తమ భూములు ఇచ్చారు. అమరావతి అభివృద్ధి చెందితే తమ ప్లాట్లకు ధర పెరుగుతుందని రైతులు ఆశించారు. ఇప్పుడు తిరిగి సాధారణ గ్రామాలుగా మారబోతున్న అమరావతి ప్రాంతంలో ప్లాట్లు ఇస్తే మాత్రం వాటిని ఏమి చేసుకుంటారు? నిన్న చంద్రబాబు, ఇవ్వాళ జగన్మోహన్‌రెడ్డి, రేపు మరొకరు ముఖ్యమంత్రిగా ఉండవచ్చు. ప్రభుత్వం మాత్రం శాశ్వతం. ఒక ప్రభుత్వం ఇచ్చిన హామీని మరొక ప్రభుత్వం తుంగలో తొక్కితే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై పెట్టుబడిదారులకు విశ్వాసం కుదురుతుందా? రాజధాని రైతులతో ఇంత పరిహాసం అవసరమా? ఆయా ప్రాంతాలకు ఉండే విశిష్టతను బట్టి అభివృద్ధి నమూనాను ఎంచుకోవాలి. ఈ నేపథ్యంలోనే నాడు చంద్రబాబు, రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో విశాఖపట్టణంలో ఐటీ పరిశ్రమలతోపాటు టూరిజం వంటి రంగాల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఇదే నమూనాను ఫాలో అయ్యారు. విశాఖలో ఐటీ తదితర రంగాలను ప్రోత్సహించడం కోసం భోగాపురం ఎయిర్‌పోర్టును కూడా నిర్మించతలపెట్టారు. తిరుపతి, శ్రీసిటీ, అనంతపురంలో తయారీ రంగాన్ని ప్రోత్సహించారు. కర్నూలులో సోలార్ విద్యుత్, విత్తన ఉత్పత్తి రంగాలను ప్రోత్సహించారు. అయినా రాయలసీమ ప్రజలు తమకు అన్యాయం జరిగిందని భావించారు. అది వేరే విషయం!

## గందరగోళంతో అభివృద్ధి ఎలా?

ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్టణం మాత్రమే అభివృద్ధి చెందిందనీ, రాయలసీమ జిల్లాలతోపాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో పట్టణీకరణ అసలు జరగలేదనీ పేర్కొన్న జీఎన్ రావు కమిటీ తన సిఫారసులలో ఈ జిల్లాలకు చేసిన న్యాయం ఏమీ లేదు. కర్నూలులో హైకోర్టును, ఇతర కోర్టులను ఏర్పాటు చేయాలని సూచించి చేతులు దులుపుకొంది. ఇంతోటి దానికే కర్నూలు ప్రజలు సంతృప్తి చెందారు గానీ, హైకోర్టు ఏర్పాటు వల్ల ప్రజలకు ఒరిగేది ఏమీ ఉండదు. హైకోర్టు వల్ల స్థానికులకు ఒక్కరికి కూడా ఉద్యోగం లభించదు. మహా అయితే రెండు, మూడు జిరాక్స్ సెంటర్లు, టీ కొట్లు వస్తాయి. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్నందున న్యాయవాదులు, న్యాయమూర్తులు కూడా కర్నూలులో నివసించక పోవచ్చు. అదే జరిగితే అద్దె ఇళ్లకు కూడా గిరాకీ ఉండదు. దీని బదులు ఒక పరిశ్రమనో, సంస్థనో ఏర్పాటుచేస్తే స్థానికులకు వందలు, వేల సంఖ్యలో ఉపాధి లభిస్తుంది. హైకోర్టు వల్ల కర్నూలు ప్రజలు సాధించుకున్నది ఏమిటి? రాయలసీమకు జరిగిన న్యాయం ఎక్కడ? అధికార వికేంద్రీకరణలో భాగంగా శాఖాధిపతుల కార్యాలయాలను అక్కడక్కడా ఏర్పాటు చేయాలన్న జీఎన్ రావు కమిటీ సిఫారసు కూడా అసంబద్ధంగానే ఉంది. శాఖాధిపతుల కార్యాలయాలను ఎక్కడెక్కడో ఏర్పాటుచేయడం వల్ల ఇతర జిల్లాల వారికి అసౌకర్యం కలగడం తప్ప అధికార వికేంద్రీకరణ జరగదు. అధికార యంత్రాంగాన్ని ప్రజలకు చేరువ చేయడం కోసం ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మండల వ్యవస్థను తీసుకువచ్చారు. ఇప్పుడు తెలంగాణ సీఎం కేసీఆర్ జిల్లాల సంఖ్యను పెంచారు. ఇలాంటి చర్యల వల్ల అధికార వికేంద్రీకరణ జరుగుతుంది గానీ, జీఎన్ రావు కమిటీ సిఫారసుల వల్ల కాదు. విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేయాలని రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబు తలపోయగా.. ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డి పరిపాలనా రాజధానిగా చేయాలనుకుంటున్నారు. నిజానికి విశాఖవాసులు తమకు రాజధాని కావాలని కోరలేదని జీఎన్ రావు కమిటీనే తన నివేదికలో పేర్కొన్నది. అయినా రాజకీయ ప్రయోజనాల కోసం జగన్మోహన్‌రెడ్డి ఈ ప్రతిపాదనను తెర మీదకు తెచ్చారు. సచివాలయం ఏర్పాటుచేసి.. అసెంబ్లీ వేసవి కాల సమావేశాలను నిర్వహించడం వల్ల విశాఖపట్టణం అభివృద్ధి చెందుతుందా? అమరావతిలో సచివాలయం, శాసనసభ, శాఖాధిపతుల కార్యాలయాలతోపాటు రాజ్‌భవన్ కూడా ఉన్నప్పటికీ విజయవాడ గానీ, గుంటూరు గానీ ఏమి అభివృద్ధి చెందాయి? ప్రైవేట్ పెట్టుబడులు రానంతవరకు ఏ నగరం కూడా అభివృద్ధి చెందదు. గత ప్రభుత్వ నిర్ణయాలను తిరగదోడుతూ పోవడం వల్ల పెట్టుబడిదారులలో విశ్వాసం సన్నగిల్లుతోంది. ఇప్పటికే పెట్టుబడిదారులంతా ఆంధ్రప్రదేశ్‌కు దూరం అంటున్నారు. రాష్ట్రం ఏర్పడిన ఐదున్నరేళ్ల తర్వాత రాజధాని ఏర్పాటును వివాదం చేయడంతోపాటు పోలవరం ప్రాజెక్టుకు అతీగతి లేకుండా పోయినా అడిగేవారు లేరు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా నినాదం గాలిలో కలిసిపోయింది. అమరావతిని ఇక గత చరిత్ర అనుకునేలా చేశారు. రాష్ట్రంలో ఇంత గందరగోళం జరుగుతున్నా.. రాష్ట్ర ప్రజలు తమకు జరుగుతున్న నష్టాన్ని గుర్తించలేకపోతున్నారు. ప్రభుత్వ తాజా ప్రతిపాదనల వల్ల తమకేమి లాభం వస్తుందా? అని వెతుక్కుంటున్నారు. పాలకుల కుటిల రాజకీయాన్ని అర్థంచేసుకోలేకపోతున్నారు. విశాఖలో సచివాలయం, అసెంబ్లీ, ముఖ్యమంత్రి కార్యాలయం ఉంటే.. అమరావతిలో కూర్చుని గవర్నర్ ఏమి చేస్తారో తెలియదు! మంత్రుల నివాసాలు కూడా అమరావతిలోనే ఉండాలని జీఎన్ రావు కమిటీ సిఫారసు చేయడం హాస్యాస్పదంగా ఉంది. ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీస్, సచివాలయం విశాఖలో ఉంటే.. మంత్రులు అమరావతిలో నివసించి ఏమి చేస్తారో సదరు నిపుణులే చెప్పాలి. ప్రస్తుతానికి ఈ ఏర్పాట్లు చేసినా కాలక్రమంలో మొత్తం అన్ని వ్యవస్థలనూ విశాఖకు తరలించే ఆలోచనలో ముఖ్యమంత్రి ఉన్నారని చెబుతున్నారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల ప్రజలలో వ్యతిరేకత వచ్చే అవకాశం లేకపోలేదు. కాలక్రమంలో రాయలసీమవాసులు కూడా తమకు ఎదురయ్యే ఇబ్బందులను గుర్తిస్తారు. ఇదే విషయాన్ని ఒకరిద్దరు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి వద్ద ప్రస్తావించగా, “మీరేం ఆందోళన చెందకండి, మన ఓటర్లు మనకు ఉంటారు. వికేంద్రీకరణ ప్రతిపాదన వల్ల ఇబ్బంది పడేవాళ్లు మన ఓటర్లు కాదు” అని జగన్మోహన్‌రెడ్డి చెప్పారని ఒక సీనియర్ ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. స్పష్టమైన రాజకీయ లక్ష్యంతో తీసుకోబోతున్న ఈ నిర్ణయం వల్ల ప్రతిపక్షాలు ఇరకాటంలో పడతాయని కూడా ముఖ్యమంత్రి అంచనా వేశారు. ఇప్పుడు జరుగుతున్నది కూడా అదే! విశాఖను రాజధానిగా అభివృద్ధి చేయవద్దని చెప్పలేని స్థితిలో ప్రతిపక్షాలు ఉన్నాయి. వ్యతిరేకిస్తే ఉత్తరాంధ్రవాసులకు ఆగ్రహం వస్తుందన్న భయం ఉంటుంది కదా? కర్నూలులో హైకోర్టు ఏర్పాటును స్వాగతిస్తున్నామని చెప్పడానికి కూడా ఇదే కారణం! అయితే రాష్ట్రానికి మూడు రాజధానులు ఉంటాయంటున్న జగన్మోహన్‌రెడ్డి... అధికారిక రాజధాని ఏది అన్నది మాత్రం చెప్పలేదు. అమరావతి, విశాఖలలో ఏది అధికారిక రాజధాని అవుతుందో తెలియదు. ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడం ఇష్టం లేదన్న పెద్దమనిషి ఇప్పుడు ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా మధ్య చిచ్చుపెట్టబోతున్నారు. హైకోర్టును కర్నూలులో నిర్మిస్తామంటూనే.. అమరావతి, విశాఖలలో బెంచ్‌లు ఏర్పాటుచేస్తామంటున్నారు. ప్రధాన న్యాయమూర్తి ఎక్కడి నుంచి విధులు నిర్వహిస్తారో తెలియదు. ఆయన ఎక్కడ ఉంటే అదే ప్రధాన బెంచ్ అవుతుంది. తన నిర్ణయం వల్ల రాజకీయ ప్రయోజనం నెరవేరుతుందని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆశిస్తూ ఉండవచ్చు గానీ ఆచరణలో ఎలా ఉంటుందో తెలియదు. ఎన్నికలలో ప్రజల తీర్పునకు అనేక కారణాలు ఉంటాయి. విజయవాడ– గుంటూరు మధ్య అమరావతి పేరిట రాజధానిని ఏర్పాటుచేసి చంద్రబాబు బావుకున్నది ఏముంది? కృష్ణా, గుంటూరు జిల్లాలలో కూడా తెలుగుదేశం పార్టీ ఘోరంగా ఓడిపోయింది. గతంలో సైబరాబాద్‌ను అభివృద్ధి చేసిన చంద్రబాబుకు అక్కడా చేదు అనుభవమే మిగిలింది. ఏది ఏమైనా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తరుచుగా చెప్పే మాట ఇప్పుడు గుర్తుకువస్తోంది. ‘నవ్వేటోడి ముందు జారిపడవద్దు’ అని కేసీఆర్ అంటుంటారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఈ మాటలను గుర్తుచేసుకోవడం మంచిది. చేయని పాపానికి రాజధాని రైతులు శిక్ష అనుభవిస్తున్నారు. మంత్రుల ప్రకటనలు పుండు మీద కారం చల్లినట్టుగా ఉంటున్నాయి. కడుపు మండిన రైతులు న్యాయస్థానం గడప తొక్కడం తప్పదు. న్యాయస్థానం ఎలా స్పందిస్తుందో చూడాలి. వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి అమరావతిలో నిర్మించిన భవనాలను గాలికి వదిలేసే హక్కు ఏ ప్రభుత్వానికైనా ఎక్కడిది? సమస్య రాజధాని రైతులది మాత్రమే కాదు.. రాష్ట్ర ప్రజలందరిదీ! పాలకులు మారినప్పుడల్లా రాజధానులను ఇలా మార్చుకుంటూ పోతే నష్టపోయేది రాష్ట్ర ప్రజలే! ఇవ్వాళ రాజధాని రైతులకు పట్టిన గతే భవిష్యత్తులో విశాఖవాసులకు పట్టదన్న గ్యారంటీ లేదు కదా? రాజధాని అనేది రాష్ట్ర ప్రజలకు గర్వకారణంగా ఉండాలి. ‘ఉట్టి కెగరలేనమ్మ స్వర్గానికి ఎగురుతా’ అన్నట్టుగా ఒక రాజధానిని నిర్మించలేనివారు మూడు రాజధానులను నిర్మించగలరా? ఉద్యోగుల జీతాలకే డబ్బు వెతుక్కుంటున్న ప్రభుత్వానికి ఇలాంటి అనిశ్చిత పరిస్థితులలో అప్పు కూడా పుట్టదు. తెల్లవాడి పుణ్యమా అని మూడు రాజధానులు ఏర్పడి ఆర్థికంగా సతమతమవుతున్న దక్షిణాఫ్రికాను ఆదర్శంగా తీసుకోవడంలోనే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దార్శనికత ఏ స్థాయిదో తెలుస్తోంది! అమరావతిని చంపేయడానికి అక్కడ కమ్మ సామాజికవర్గం వారికి కూడా భూములు ఉండటం కారణమైతే ప్రభుత్వం అదే విషయం ప్రకటించాలి. అదే నిజమైతే నష్టపరిహారం చెల్లించి వారిని అమరావతి నుంచి తరిమేయండి. కులం మార్చుకోవడం సాధ్యం కాదు కనుక.. మత మార్పిడి చేయించండి. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు కారణమైతే “బాబూ! 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నావు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా, పదేళ్లకుపైగా ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నావుగా? ఇక చాలు రాజకీయాల నుంచి తప్పుకో” అని చెప్పండి. అప్పుడు ఆయనను తప్పుకోవాలని ప్రజలే ఒత్తిడి తెస్తారేమో చూద్దాం. అంతేగానీ.. రాష్ట్ర భవిష్యత్, ప్రజల ప్రయోజనాలతో ఆడుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వాలకు మంచిది కాదు. రాష్ట్రం పట్ల బాధ్యత ఉన్న మేధావులు, విజ్ఞులు ఎవరైనా ఉంటే నోరు తెరిచి తప్పొప్పులు చెప్పాలి. జగన్మోహన్‌రెడ్డి స్థానంలో రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండివుంటే ఇటువంటి పరిస్థితి ఉత్పన్నమయ్యేది కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇది జగన్మోహన్‌రెడ్డికి శోభనివ్వదు. ఆంధ్రప్రదేశ్‌కు ఇక భవిష్యత్ లేదు అనే అభిప్రాయం ఇతర ప్రాంతాలవారిలో ఏర్పడితే అందుకు జగన్మోహన్‌రెడ్డి మాత్రమే కారణం అవుతారు! ■




> “ చరిత్రలో ఒక జాతి సామూహిక ఆత్మహత్యకు ఈ తరం సాక్షీభూతంగా నిలవబోతోందా? ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలను చూస్తుంటే అవుననే అనిపిస్తోంది! అభివృద్ధికి నిధులు లేవని చెప్పుకొంటున్న జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా మూడు రాజధానులను ప్రతిపాదిస్తోంది. ఒక సామాజికవర్గంపై కోపంతో, ప్రతిపక్ష నేత చంద్రబాబుపై కసితో రాష్ట్రానికి భవిష్యత్ లేకుండా చేస్తున్నారా? అన్న భావన ఏర్పడుతోంది. గత ప్రభుత్వం రైతులను ఒప్పించి 33 వేల ఎకరాలను సమీకరించగా, ఇప్పుడు ఆ రైతులు అకారణంగా రోడ్డునపడాల్సిన పరిస్థితి కల్పించారు. అమరావతి పట్ల సీమవాసుల్లో వ్యతిరేకత వ్యాపింపజేయడం వల్ల రాజధానికి భూములిచ్చిన రైతులు ఒంటరివారయ్యారు. నిన్న అమరావతి, నేడు విశాఖ... రేపు ఏ నగరం తెర మీదకు వస్తుందో తెలియదు. పిల్లి తన పిల్లలను మార్చినట్టు రాజధానులను మార్చుకుంటూ పోయే అధికారం ప్రభుత్వాలకు ఉంటుందా? ”

> “ **గడచిన కొంతకాలంగా మంత్రులు, నిపుణులు అంటూ ప్రభుత్వం ఏర్పాటుచేసిన జీఎన్ రావు కమిటీ చెబుతున్నదాన్ని బట్టి రాజధానిపై ఎవరికీ సరైన అవగాహన లేదన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. జీఎన్ రావు కమిటీ నివేదికలోని అంశాలు పరస్పర విరుద్ధంగా ఉండటం విశేషం! ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటుచేస్తే చాలు అభివృద్ధి జరుగుతుందని రావు కమిటీ కూడా అభిప్రాయపడటం, అందుకు అనుగుణంగా సిఫారసులు చేయడం బాధ్యతారాహిత్యం. ముఖ్యమంత్రి కోరుకున్నట్టుగా నివేదిక ఇవ్వడానికి నిపుణులు అవసరమా? సంకుచిత మనస్తత్వానికి కుటిల రాజకీయాలు తోడైతే ఏమి జరగాలో అదే జరుగుతోంది.**

# ప్రగతిశీల ప్రకాశకుడు

పన్నెండేళ్ళ క్రితం(2007) వాషింగ్టన్‌లో జరిగిన తానా సమావేశానికి ఒక తెలుగు ప్రచురణకర్తని ప్రత్యేక అతిథిగా ఆహ్వానించారు. కానీ ఆయనకు అమెరికన్ కాన్సలేట్ వారు విజిటర్ వీసా నిరాకరించారు. అప్పుడు ఆయనకు అమెరికా వీసా ఇచ్చితీరవలసిందేనని కాన్సల్ జనరల్‌కు ఆరుగురు అమెరికన్ సెనేటర్లు, ఇద్దరు కాంగ్రెస్ సభ్యులు ఉత్తరాలు వ్రాశారు. అలా ఆ ప్రచురణకర్త తరఫు ఉత్తరాలు వ్రాసినవారిలో అప్పుడు అమెరికా అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్న బరాక్ ఒబామా, హిల్లరీ క్లింటన్ కూడా ఉన్నారు. విజిటర్ వీసా కోసం ఇంతమంది నుంచి ఈ రకమైన ఒత్తిడి రావటం ఏ కాన్సల్ జనరలూ ఎప్పుడూ చూసి ఉండడు. మళ్ళీ ఆ ప్రచురణకర్త అమెరికన్ కాన్సలేట్‌కు వెళ్ళేసరికి ఆయన కోసం వీసా సిద్ధంగా ఉంది. అంతటి గౌరవం దక్కించుకున్న ఆ తెలుగు ప్రచురణకర్త ‘నవోదయ’ రామమోహనరావు.

కొన్నేళ్ళ క్రితంవరకూ, దాదాపు ఒక అర్థ శతాబ్దంపాటు, విజయవాడ ఏలూరు రోడ్డు తెలుగు ప్రచురణకర్తల కేంద్రంగా ఉండేది. అక్కడ ఉన్న అనేక షాపుల మధ్య తెల్లటి సైన్‌బోర్డు పై నవోదయ పబ్లిషర్స్ అంటూ ఎర్రటి బాపు అక్షరాలతో ఒక పుస్తకాల షాపు ఆకర్షణీయంగా ఉండేది. ఆ బోర్డు మధ్యలో ఒక వృత్తంలో నీలంరంగు పుస్తకాన్ని చదువుతున్న ఒక పెద్ద కళ్ళ బాపు బొమ్మాయితో నవోదయ లోగో చాలా అందంగా ఉండేది. ఆ షాపులో కౌంటర్ దగ్గర అందంగా, హుందాగా, నవ్వుమొహంతో ఒకాయన కూర్చుని ఉండేవారు. పక్కన మోడాలమీద కూర్చున్న రచయితలు సాహితీప్రియులతో ఆయన కబుర్లు చెబుతూ ఉండేవారు. ఆయన పేరు రామమోహనరావు. కమ్యూనిస్టు కుటుంబం నుంచి వచ్చిన రామమోహనరావు, హైస్కూలు చదువు పూర్తయ్యాక విశాలాంధ్ర ప్రచురణలలో, యాభై రూపాయల జీతానికి పనిచేయటం మొదలుపెట్టారు. 1960లో ఆయన బావగారు ఆదిలాబాద్ వెళ్ళిపోతూ ఆయన స్థాపించిన నవోదయ పబ్లిషర్స్ రామమోహనరావుగారికి అప్పచెప్పారు. అప్పట్నుంచీ పుస్తక విక్రయం, ప్రచురణ ఆయన జీవికా, జీవితమూ అయ్యాయి. ఆ సంస్థ పేరు ఆయన ఇంటిపేరైంది.

తెలుగు పుస్తకప్రచురణ రంగంలో నవోదయ సంస్థకూ, రామమోహనరావుగారికీ ఒక విశిష్టస్థానం ఉంది. తాము ప్రచురించే పుస్తకాల ప్రమాణాలపై ఆయనకు కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలు ఉండేవి. పుస్తకం ఆకర్షణీయంగా ఉండాలి: అందమైన ముఖచిత్రం, మంచి కాగితం, పెద్ద మార్జిన్లు, చక్కటి అక్షరాలు ఉండాలి. అచ్చుతప్పులు ఉండకుండా ఆయనే ప్రత్యేక శ్రద్ధతో చూసుకునేవారు. సత్యం శంకరమంచి అమరావతి కథలను నవోదయ ప్రచురించిన తీరు దీనికి ఉదాహరణ. ముళ్ళపూడి వెంకటరమణతో సుదీర్ఘమైన పీఠిక రాయించటమే కాకుండా, ప్రతి కథకూ బాపు బొమ్మలు కూర్చి ప్రచురించటంతో పుస్తకం విలువ ఎంత పెరిగిందో సాహితీప్రియులకు బాగా తెలుసు. పుస్తకాలను అందంగా ప్రచురించటమే కాక, పుస్తకాల ఎన్నికలో కూడా రామమోహనరావుగారు మంచి అభిరుచి చూపించేవారు. ముళ్ళపూడి వెంకటరమణ, నండూరి రామమోహనరావు, కొడవటిగంటి కుటుంబరావు, గోపీచంద్ వంటి ప్రసిద్ధ తెలుగు రచయితల పుస్తకాలను నవోదయ ప్రచురించేది. కొకు ఐశ్వర్యం, నండూరి రామమోహనరావు విశ్వరూపం, శ్రీరంగం నారాయణబాబు రుధిరజ్యోతి, నార్ల వెంకటేశ్వరరావు సీతజోస్యం, జరుక్‌శాస్త్రి పేరడీలు, శ్రీరమణ మిథునం, నామిని సినబ్బ కథలు నవోదయ ప్రచురణలే. నవోదయ సంస్థలో తమ పుస్తకం ప్రచురింపబడటాన్ని కొత్త రచయితలు ప్రతిష్ఠాత్మకంగా భావించే వారు.



పుస్తక ప్రచురణలోనే కాదు, పుస్తక విక్రయ సంస్థగానూ, నవోదయకు ఒక ప్రత్యేక స్థానం ఉండేది. అక్కడ కొనుక్కొన్న పుస్తకాలు పెట్టియిచ్చే పేపర్‌బ్యాగుల వెనక బాపు కార్టూన్లు ఉండేవి. షాపులో అమ్మే నోటుపుస్తకాలు కూడా అందంగా నాణ్యంగా ఉండేవి. నవోదయ నాణ్యతకు మారుపేరుగా ఉండేది. విజయవాడ షాపు విజయవంతమైన తర్వాత గుంటూరులో ఒక శాఖ ఏర్పాటు చేశారు. 1980లలో మద్రాసులోకూడా ఒక శాఖ ఏర్పాటు చేశారు కానీ అది ఎక్కువకాలం నడవలేదు. రామమోహనరావు గారికి బాపు రమణలు ఆప్త మిత్రులు. నవోదయ ప్రచురించిన మొదటి పుస్తకం, గొల్లపూడి మారుతీరావుగారి ‘చీకట్లో చీలికలు’కు బాపు ముఖచిత్రం గీసింది మొదలు, నవోదయ పుస్తకమంటే బాపు ముఖచిత్రం ఉండాల్సిందే. ఆ తరువాత విజయవాడలో మిగతా ప్రకాశకులందరూ తమ పుస్తకాలకు బాపు ముఖచిత్రాలు కావాలంటే రామమోహనరావుగారి దగ్గరకే వచ్చేవారు. బాపుగారికి విజయవాడలో అనధికారిక ఏజెంటునయ్యానని ఆయన ఒకసారి అన్నారు. గిరీశం లెక్చర్లు పుస్తకాన్ని ప్రచురించిన దగ్గరనుంచి ముళ్ళపూడి వెంకటరమణ గారి పుస్తకాలన్నీ కూడా నవోదయ ద్వారానే ప్రచురితమయ్యేవి. బాపు మొదటి కార్టూన్ల పుస్తకం, కొంటెబొమ్మల బాపు కూడా నవోదయే ప్రచురించింది. బాపు రమణలే కాకుండా వర్తమాన రచయితలు చాలామంది రామమోహనరావు గారికి మిత్రులే. విజయవాడలో చాలా మంది రచయితలకు, సాహితీప్రియులకు నవోదయ కేంద్రస్థానంగా ఉండేది. సాయంకాలమయ్యేప్పటికి స్థానిక రచయితలు చాలామంది అక్కడ చేరేవారు. రామమోహనరావుగారికి విజయవాడలో మిగతా పుస్తక ప్రచురణకర్తలతో మంచి సంబంధాలుండేవి. విజయవాడ పుస్తకవిక్రేతల సంఘం ఒక బలమైన సంస్థగా తయారుకావడంలో ఆయనది చాలా నిర్మాణాత్మకమైన పాత్ర. విజయవాడ పుస్తక ప్రదర్శన దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక పుస్తకప్రదర్శనలలో ఒకటిగా ఎదగడంలో ఆయనది ప్రముఖ పాత్రే. నేషనల్ బుక్ ట్రస్ట్ వారి జాతీయ పుస్తక ప్రదర్శనలు స్ఫూర్తిగా విజయవాడ పుస్తక ప్రదర్శన ప్రారంభమయ్యిందని ఆయన చెప్పారు.

గుంటూరులో మెడిసిన్ చదువుతున్నప్పుడు, మూడో సంవత్సరంనుంచి అరండల్‌పేట ఐదో లేన్లో ఉన్న నవోదయ పుస్తకాల షాపు నా సాయంత్రపు అడ్డా. రామమోహనరావుగారితో నా వ్యక్తిగత పరిచయం మొదలయ్యింది మాత్రం 1995లో. చికాగోలో తానా మహాసభలు జరుపుతున్నప్పుడు, అప్పటి వరకూ పుస్తకంగా రాని ముళ్ళపూడి వెంకట రమణ గారి రచనలన్నిటినీ తానా తరపున ముద్రించటానికి సహాయం అడుగుతూ నేను ఆయనకు ఉత్తరం రాశాను. తన ఆమోదాన్ని తెలియచేస్తూ, బాపు బొమ్మ, రమణ రచన మొట్టమొదటగా ప్రచురించబడి అప్పటికి 50 ఏళ్ళవుతుందని, తానా సభలలో ఆ విషయం గుర్తిస్తే బాగుంటుందని సూచించారు. అలా ఆ తానా సమావేశాల్లో బాపురమణల స్వర్ణోత్సవం ఒక ముఖ్యాంశమైంది. ఆ సందర్భంగా ‘బొమ్మబొరుసు’ అనే పుస్తకాన్ని తానా సహకారంతో నవోదయ ప్రచురించింది. ఆ సభలలో బాపు చిత్రప్రదర్శన ఏర్పాటు చేయటానికి, సావనీర్ ప్రచురణకీ కూడా రామమోహనరావు గారు చాలా సహకరించారు. అప్పటినుంచీ, మా మధ్య రెండు దశాబ్దాల వయసు తేడా ఉన్నప్పటికీ, ఆయన నాకు సన్నిహిత మిత్రులయ్యారు. 2004లో నేను మిత్రులతో కలసి అమెరికాలో తెలుగునాడి పత్రికను ప్రారంభించినప్పుడు ఆయన మా సలహామండలిలో ఉండి చాలా సహాయం చేశారు. 2004 ఏప్రిల్ నుంచి ప్రతివారం ఆ వారంలో వచ్చిన తెలుగు పత్రికలన్నిటినీ నాకు ఎయిర్‌మెయిల్ ద్వారా పంపేవారు. పత్రికలతో పాటు సాహిత్య విషయాలకు చెందిన పేపర్‌కటింగ్స్ కూడా పంపేవారు. నవోదయ పుస్తకాల షాపు మూసేశాక కూడా, కొన్ని నెలలక్రితం ఆయన ఆరోగ్యం క్షీణించేవరకూ అలా పత్రికలు పంపుతూనే ఉన్నారు. తెలుగులో వచ్చిన కొత్త పుస్తకాలను నాకోసం దాచి ఉంచి, వీలు చూసుకుని అమెరికా పంపించేవారు. నేను దూరాన ఉన్నప్పటికీ పాతికేళ్ళుగా వర్తమాన తెలుగుసాహిత్యంతో పరిచయాన్ని కొనసాగించగలగటం సాధ్యం చేసిన రామమోహనరావుగారికి ఎన్ని కృతజ్ఞతలు చెప్పినా చాలదు. మా తానా ప్రచురణల ఏర్పాటు వెనుక కూడా ఆయన ప్రోత్సాహం ఉంది.

> **పుస్తకాలను అందంగా ప్రచురించటమే కాక, పుస్తకాల ఎన్నికలో కూడా రామమోహనరావుగారు మంచి అభిరుచి చూపించేవారు. ముళ్ళపూడి వెంకటరమణ, నండూరి రామమోహనరావు, కొడవటిగంటి కుటుంబరావు, గోపీచంద్ వంటి ప్రసిద్ధ తెలుగు రచయితల పుస్తకాలను నవోదయ ప్రచురించేది. కొకు ఐశ్వర్యం, నండూరి రామమోహనరావు విశ్వరూపం, శ్రీరంగం నారాయణబాబు రుధిరజ్యోతి, నార్ల వెంకటేశ్వరరావు సీతజోస్యం, జరుక్‌శాస్త్రి పేరడీలు, శ్రీరమణ మిథునం, నామిని సినబ్బ కథలు నవోదయ ప్రచురణలే.**

పుస్తకాలను ప్రేమించేవారిని ఆయన ప్రేమించేవారు, ప్రోత్సహించేవారు. ఏ లాభాపేక్షా లేకుండా పుస్తకాభిమానులకు తన సహకారాన్ని అందించేవారు. జర్మనీలో ఉండే మిత్రుడు పరుచూరి శ్రీనివాస్‌కు అవసరమైన పుస్తకాలను సమీకరించటం, డిట్రాయిట్ తెలుగు సాహితీ సమితికి అవసరమైన పుస్తకాలు ఏటేటా అందించడం, సియాటిల్ నుంచి కొడవళ్ళ హనుమంతరావు తమ స్వగ్రామంలో తెలుగు గ్రంథాలయం ఏర్పాటు చేయడానికి సహకరించటం నాకు తెలిసిన విషయాలలో కొన్ని. తెలుగు పాఠకుల అభిరుచులలో వచ్చిన మార్పు, ఇంగ్లీషు మీడియం చదువులు, గ్రంథాలయాల నిర్వహణలో ప్రభుత్వం ఉదాసీనత తెలుగు పుస్తక రంగాన్ని బాగా దెబ్బతీశాయి. నాలుగేళ్ళ క్రితం నవోదయ సంస్థ పుస్తకవిక్రయాలనుంచి తప్పుకోవటంతో ఏలూరురోడ్డు బోసిపోయింది; విజయవాడ సాహితీ ప్రియులు రోజూ కలుసుకునే తావు పోయింది. పుస్తకవిక్రయాలు ఆపివేసినా, ప్రచురణలను ఆపకూడదని అనుకొన్నారు కానీ, కొన్ని వ్యక్తిగత విషాదాలు, అనారోగ్యం కారణంగా ప్రచురణలనూ ఆపివేయక తప్పలేదు.

చిన్నప్పటినుంచీ పెంచుకొన్న కమ్యూనిస్టు అభిమానం, హేతువాదమూ ఆయనను చివరిదాకా అంటిపెట్టుకునే ఉన్నాయి. 2007లో చికాగో వచ్చినప్పుడు ఆయనను మేడే కి స్ఫూర్తి అయిన హేమార్కెట్ అలజడుల స్మారకచిహ్నం వద్దకు తీసుకువెళ్ళినప్పుడు, డబ్బయేళ్ళ వయసులో కూడా ఆయన చిన్నపిల్లాడిలా ఆనందపడటం, పిడికిలి బిగించి చేయెత్తి రెడ్ శాల్యూట్ చేయటం ఇప్పటికీ నా కళ్ళ ముందు కదులాడుతూ ఉంటుంది. మరణానంతరం ఆయన శరీరాన్ని ఆయన కోరిక ప్రకారం స్థానిక వైద్య కళాశాలకు అందచేయటం ఆయన సన్నిహితులనెవరినీ ఆశ్చర్యపరచలేదు. 2019 డిశంబరు 15న, ఆయన ఆప్తమిత్రుడు బాపు పుట్టినరోజు నాడు, రామమోహనరావుగారు మరణించటం యాదృచ్ఛికమే అయినా విశేషమే అనిపిస్తుంది. నవోదయ రామమోహనరావుగారి మరణంతో తెలుగు ప్రచురణా రంగంలో ఒక తరం ముగిసినట్లే. అభిరుచి, నాణ్యతలకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యత, కొత్తతరం ప్రచురణకర్తలు కొనసాగిస్తారని కోరుకుందాం.

■ డా. జంపాల చౌదరి
మండలైన్, ఇల్లినాయిస్, యు.ఎస్.ఏ.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
ఆదివారం • 22 డిసెంబర్ 2019
navya@andhrajyothy.com



కథానాయికగా **హన్సిక** ప్రేక్షకులకు తెలుసు!
మరి, ఓ అమ్మాయిగా ఎంతమందికి తెలుసు?
ఖాళీగా ఉన్నప్పుడు... కోపం వచ్చినప్పుడు...
ఒత్తిడి ఎదురైనప్పుడు... సెట్‌లో చిరాకు పడ్డప్పుడు...
హన్సిక ఏం చేస్తారు? ఆమె అభిరుచులేంటి?
'మీరు చెబితే వినాలని ఉంది. మీ మాటల్లో తెలుసుకోవాలని ఉంది' అని అడిగితే... 'నవ్య'తో మనసు విప్పి మాట్లాడారు. సినిమాలు, షికార్లతో పాటు హన్సిక చెప్పిన మరెన్నో విషయాలు 'నవ్య' పాఠకులకు ప్రత్యేకం!!

# ప్రామిస్... నా పారితోషికం ఎంతో నాకే తెలియదు!

**న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌కు ఎక్కడకు వెళుతున్నారు?**

ఇంకా ఏమీ ప్లాన్ చేయలేదు. వృత్తిపరమైన పనులు, షూటింగులతో సరిపోతోంది. తమిళంలో రెండు చిత్రాలు చేస్తున్నా. అలాగే, ఓ వెబ్ సిరీస్ కూడా! వీటి మధ్యలో మమ్మా (అమ్మ మోనా మొత్వానీ) సెలవులు ఇస్తే ప్లాన్ చేయాలి. ఆల్రెడీ అమ్మను అడిగా... 'నో! డేట్స్ ఖాళీగా లేవు. ఏం ప్లాన్స్ కుదరవు' అని చెప్పింది. కుదిరితే... క్రిస్మస్‌కు రెండు రోజులు ఎక్కడికైనా వెళతా.

**మొన్నామధ్య టర్కీ వెళ్లి వచ్చారు కదా!**

అవును. ప్రతి ఏడాది తప్పకుండా ఒక్కసారైనా మమ్మా (అమ్మ)తో ఒక్క ట్రిప్ వేస్తా. ఇట్స్ ఫ్యామిలీ ట్రిప్! అమ్మ, అన్నయ్య ప్రశాంత్, నేను... అంతే! మమ్మాకు నచ్చిన ప్రదేశానికి వెళతాం. ఎందుకంటే... షూటింగుల కోసమని నేను ఎక్కువగా ట్రావెల్ చేస్తుంటాను. కానీ, అమ్మ అలా కాదు. అందుకని, ఛాయిస్ తనకే ఇస్తా. ఈసారి టర్కీ వెళదామని అడిగింది. అక్కడ ఇస్తాంబుల్ సహా ఎన్నో అందమైన ప్రదేశాలు చూశాం. మేం వెళ్లిన సమయంలో అక్కడ చలి ఎక్కువగా ఉంది. బట్, ఇట్ వాజ్ నైస్ ట్రిప్!



**ఆ ట్రిప్‌లో మట్టితో ఏవో పాత్రలు తయారు చేసినట్టున్నారు?**

(నవ్వుతూ...) యస్! నేను ఎప్పుడో ఒకప్పుడు పాటరీ (కుమ్మరి పని... మట్టితో పాత్రలు తయారు చేయడం) చేయాలని అనుకునేదాన్ని. టర్కీలోని కాప్పడోసియా పాటరీకి చాలా ఫేమస్. ఇస్తాంబుల్ నుంచి అక్కడికి వెళ్లినప్పుడు ఓ చోట మట్టితో పాత్ర తయారు చేశా. అదొక అనుభవం. మంచి జ్ఞాపకం.

**మీరు చేసిన మట్టి పాత్రను ఏం చేశారు?**

నేనే తెచ్చుకున్నా. ఇప్పుడు దానికి పెయింటింగ్ వేశా.

**ఇంతకుముందు కలిసినప్పుడు పెయింటింగ్ వేయడం ఇష్టమని చెప్పారు. కంటిన్యూ చేస్తున్నారా?**

ఐ లైక్ పెయింటింగ్! అదే నా స్ట్రెస్ బస్టర్. నాకు రంగులంటే ఇష్టం. ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం పెయింటింగ్ వేస్తుంటా.



తల్లి, సోదరుడితో...

**మీ పెయింటింగ్స్‌తో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి, వేలం ద్వారా వచ్చిన డబ్బుతో చారిటీ చేస్తానని చెప్పారు!**

నిజం చెప్పాలంటే... ఈ ఏడాది ఎగ్జిబిషన్ ఏర్పాటు చేద్దామనుకున్నా. కానీ, సినిమాలతో బిజీగా ఉండడంతో కుదరలేదు. వచ్చే ఏడాది ఏర్పాటు చేయాలి. ఇప్పుడు నా దగ్గర 12 నుండి 15 పెయింటింగ్స్ ఉన్నాయి. వాటిని వేలంలో అమ్మగా వచ్చిన డబ్బుతో నా (దత్తత తీసుకున్న) పిల్లలకు ఉపయోగపడే పని చేయాలనుకుంటున్నా. ప్రస్తుతం ముంబయ్‌లో నేను కొత్తగా కొన్న ఇంటిలో పెయింటింగ్స్ పెట్టాను. ఇంటికి వచ్చిన వాళ్లు చూస్తారని! అందువల్ల, నా పెయింటింగ్స్ గురించి అందరికీ తెలుస్తుంది కదా! వేలం వేసినప్పుడు డబ్బులు వస్తాయి.

## ప్రతి ఏడాదీ న్యూయార్క్ వెళతా!

ప్రపంచంలో చాలా ప్రదేశాలు తిరిగా. అయితే... న్యూయార్క్ నాకిష్టమైన ప్రదేశం. అక్కడికి ప్రతి ఏడాదీ వెళతా. న్యూయార్క్ తర్వాత లండన్ ఎక్కువ వెళతా.

**మీ కొత్తింటి గురించి చెప్తారా?**

కొత్తింటికి మారి ఏడాదిన్నర అవుతోంది. పాత ఇల్లు కంటే పెద్దది. అందులో, ఓ పెద్ద హోమ్ థియేటర్ కట్టించుకున్నా. ఇటలీ నుంచి తెప్పించిన షాండ్లియర్, ఇతర వస్తువులతో ఇంటిని డిజైన్ చేశాం. నా రూమ్ మొత్తం వైట్ కలర్‌లో ఉంటుంది. ఇంటిలో దేవుడి గదిని మాత్రం నేను డిజైన్ చేశా. దేవుడి గదిలో గోడపై బాబా(గురునానక్)జీ పెయింటింగ్ వేశా.

**ఇన్‌స్టాగ్రామ్‌లో మీ స్టోరీస్ చూస్తుంటాం! మీ అమ్మగారిని ఎప్పుడూ విసిగిస్తుంటారు. ఆట పట్టిస్తుంటారు. ఏడిపిస్తుంటారు?**

(నవ్వుతూ...) షి ఈజ్ మై బిగ్గెస్ట్ టెడ్డీబేర్ (తనే నా టెడ్డీబేర్.. బొమ్మ). అమ్మకు ఐస్‌క్రీమ్స్ తినడం అంటే చాలా ఇష్టం. తనకు ఐస్‌క్రీమ్స్ తినిపించడం అంటే నాకిష్టం. అదే సమయంలో తనను సరదాగా ఆట పట్టిస్తుంటా. అమ్మే నా ఎంటర్‌టైన్‌మెంట్.

**సినిమాలకు వస్తే... నటిగా మీ ప్రయాణం ప్రారంభించి పన్నెండేళ్లు అవుతోంది. మిమ్మల్ని నడిపించే శక్తి ఎవరు?**

మా అమ్మ. తను లేకపోతే నేను లేను. అమ్మతో పాటు అభిమానులు, దర్శక-నిర్మాతలు నాకెంతో మద్దతుగా నిలిచారు. హిట్స్ ఇవ్వడం కాదు... హిట్స్‌ను కంటిన్యూ చేయడం పెద్ద విషయం. స్టార్ కావడం సులభమే. స్టార్‌డమ్‌ను కొనసాగించడం కష్టం.

**స్టార్‌డమ్ వల్ల ఒత్తిడి ఎదుర్కొన్న సందర్భాలున్నాయా?**

లేవు. ఎప్పుడూ లైమ్‌లైట్‌లో ఉండడం నాకిష్టం. నా గురించి, నా నటన గురించి ప్రేక్షకులు మాట్లాడుకోవడం నాకిష్టం.

**చిన్న వయసులో నటిగా వచ్చారు. షూటింగుల కోసం ఇంటికి దూరంగా ఉండాల్సి వస్తుంది. ఎప్పుడైనా ఇంటి మీద బెంగ పెట్టుకున్నారా?**

నాతో పాటు ఎప్పుడూ ఐదారుగురు స్టాఫ్ ఉంటారు. మేమంతా కబుర్లు చెప్పుకొంటాం. కొన్నిసార్లు నాతో పాటు అమ్మ షూటింగులకు వస్తుంది. ఇంటి మీద బెంగ పెట్టుకొన్న సందర్భాలు లేవు. అన్నిటికంటే ముఖ్యంగా నటించడం నాకిష్టం. అందువల్ల, షూటింగులకు వెళ్లినప్పుడు ఇతరత్రా విషయాలు నా మనసులోకి రావు. మన పనిని మనం ఎంజాయ్ చేస్తున్నప్పుడు ఇంటిపై బెంగ, విసుగు వంటివి రావు.

**కమర్షియల్ సినిమాలు చేశారు. కామెడీ, హారర్, ఉమన్ సెంట్రిక్ ఫిల్మ్స్ చేశారు. మీకు ఓ అవకాశం వచ్చినప్పుడు కథ, మీ పాత్ర వరకూ మాత్రమే చూసుకుంటారా? కథానాయకుడు, దర్శకుడు, నిర్మాత వంటివి చూసి అంగీకరిస్తారా?**

నా దృష్టిలో కథే హీరో, హీరోయిన్! ఆ కథలో నాకు ఐదు సన్నివేశాలున్నాయా? ఇరవై ఉన్నాయా? నాకు రెండు పాటలేనా? వంటివి చూడను. కథ బావుందా? లేదా? అని చూస్తా. సినిమా అనేది సమష్టి కృషి. అందరూ కష్టపడతారు. అయితే... కథ బావుంటే సినిమాకు మంచి పేరు వస్తుంది. ప్రేక్షకుడికి నచ్చుతుంది.



**సినిమా హిట్టయితే హీరోకి ఎక్కువ పేరొస్తుంది. హీరో రెమ్యూనరేషన్ ఎక్కువ! హీరోలతో పాటు తమకూ సమానంగా పారితోషికం ఇవ్వాలని కొందరు హీరోయిన్లు బాహాటంగా తమ అసంతృప్తిని వెలిబుచ్చారు. మీరేమంటారు?**

సీరియస్‌గా నేనెప్పుడూ ఈ విషయాల గురించి ఆలోచించలేదు. ఆర్థికపరమైన విషయాలను నేను పట్టించుకోను కూడా! నిజాయతీగా చెప్పాలంటే... ఈరోజుకూ నా రెమ్యూనరేషన్ ఎంతో నాకు తెలియదు. ఎవరు నమ్మినా... నమ్మకున్నా... నిజం ఇదే. ఏ సినిమాకు ఎంత తీసుకుంటున్నానో నిజంగా నాకు తెలియదు. నేను కేవలం నటిస్తానంతే! ఎందుకంటే... నటించడం నాకిష్టం.

**మరి, మీ రెమ్యూనరేషన్ గురించి ఎవరు మాట్లాడతారు?**

అమ్మ! ఆర్థిక పరమైన విషయాలన్నీ తనే చూసుకుంటుంది. నటన, దత్తత తీసుకున్న పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోవడమే నా పని. జీవితాన్ని ఎంజాయ్ చేస్తూ... సంతోషంగా ఉండడం నాకిష్టం. ఈరోజుల్లో ఫోన్ ఛార్జింగ్ అయిపోతుందనీ, ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయామనీ, ఫ్లైట్ డిలే అయ్యిందనీ, ఇంకా ఏదో ఏదో అయ్యిందని చాలామంది ఇరిటేట్ అవుతారు. కోపం తెచ్చుకుంటారు. ఒత్తిడికి లోనవుతారు. వీటి వల్ల జరిగేది జరగక మానదు కదా! అందుకని, ప్రశాంతంగా ఉండడం మంచిది.

**నేను ఇప్పటివరకూ దత్తత తీసుకున్న పిల్లలు 31 మంది. వీలు కుదిరినప్పుడు వాళ్లతో మాట్లాడుతుంటా. కనీసం నెలకు ఒకసారైనా కలుస్తా. పిల్లలకు, నాకు దీపావళి పెద్ద పెండగ. అందరం కలిసి సెలబ్రేట్ చేసుకుంటాం. క్రిస్మస్, న్యూ ఇయర్ వస్తే... గ్రీటింగ్ కార్డ్స్ రెడీ చేసి ఇస్తారు. పిల్లలందరూ పెద్ద వాళ్లు అవుతున్నారు. ఇప్పుడు నా ఫోకస్ అంతా వాళ్లు జీవితాల్లో సెటిల్ కావడమే. అందరికీ ఉద్యోగాలు రావాలి. అదే ముఖ్యం!**



ఖాళీగా ఉన్నప్పుడు కిచెన్‌లోకి వెళ్లి గరిటె తిప్పుతా. రెగ్యులర్‌గా కాదు... అప్పుడప్పుడూ అనుకోండి! ఈ శనివారం (నిన్న) వంట చేశా. పన్నీర్ కుల్చా, ఆలూ టిక్కా, పప్పు చేశా. మీరూ నా వంట చూడండి.



**మీకెప్పుడూ కోపం రాదా?**

రాదు. ఇటీవల 'తెనాలి రామకృష్ణ' ప్రమోషన్స్ కోసం హైదరాబాద్ వచ్చాను. అప్పుడు నా మేకప్ కిట్, కొన్ని డిజైనర్ డ్రస్సులు ఉన్న బ్యాగులు నాతో రాలేదు. ఫ్లైట్‌లో మిస్ అయ్యి, లగేజ్ రావడం ఆలస్యమైంది. మీడియాకు ఇంటర్వ్యూలు ఇవ్వడానికి అనుకున్న సమయానికి వెళ్లలేకపోయా. లగేజ్ నాతో రాకపోవడంతో ముందురోజు రాత్రి కాసేపు ఒత్తిడికి లోనయ్యా. కొంత సమయం తర్వాత... నేనేం చేయగలను? లగేజ్ వెంటనే రావడానికి మరో ఫ్లైట్ లేదు. రేపు ఉదయం వస్తుందని తెలుసు. స్ట్రెస్ తీసుకోవడంలో అర్థం లేదనుకొని హాయిగా నిద్రపోయా.

**విపరీతమైన సందర్భాల్లో, స్ట్రెస్‌ను ఎలా ఎదుర్కొంటారు?**

ఫోన్ పక్కన పడేస్తా. పెయింటింగ్ వేస్తా. నిజం చెప్పాలంటే... స్ట్రెస్‌లో ఉన్నప్పుడు ఇంకా బాగా పెయింటింగ్ వేస్తా. ఏడెనిమిది గంటలు తిండి, నిద్ర లేకుండా పెయింటింగ్ వేసిన సందర్భాలున్నాయి. ఆ టైమ్‌లో ఇంట్లో ఎవరూ నన్ను డిస్ట్రబ్ చేయరు.

**షూటింగులో అటువంటి పరిస్థితి ఎదురైతే...?**

వీలైతే నిద్రపోతా (నవ్వులు)! లేదా మౌనంగా కూర్చుంటాను. అంతకు మించి ఏం చేయగలను? సెట్‌లో చాలా మంది ఉంటారు. అందిరికీ నా పరిస్థితి వివరించలేను కదా!

**యాభైకు పైగా సినిమాల్లో నటించారు. మీకు బాగా ఛాలెంజ్ విసిరిన పాత్ర?**

ప్రస్తుతం తమిళంలో 'పార్ట్‌నర్' అని ఒక సినిమా చేస్తున్నా. మొదట కథ వినప్పుడు అందులోని పాత్రలో సులభంగా నటించవచ్చని అనుకున్నా. కానీ, అంత సులభం కాదని చేస్తుంటే అర్థమవుతోంది. 'పార్ట్‌నర్'కు సంతకం చేసేటప్పుడు... ఇప్పుడు చేస్తున్న సినిమాలు కొంచెం డిఫికల్ట్‌గా ఉన్నాయి. మధ్యలో సరదాగా ఓ పాత్ర చేద్దామనుకున్నా. కానీ, అదే పెద్ద ఛాలెంజ్ విసిరింది. ఓ కొత్త దర్శకుడు చేస్తున్నాడు.

**చివరగా... వ్యక్తిగత జీవితంలో కొత్త కబుర్లు ఏమైనా ఉన్నాయా?**

నో! ఏమీ లేవు. నాకు నేను చాలా సంతోషంగా ఉన్నాను. నటనతో బిజీగా ఉన్నాను. మిగతా విషయాలకు టైమ్ లేదు. హ్యాపీ టు బి సింగిల్. ఏదైనా ఉంటే నేను చెబుతా. ప్రస్తుతానికి సినిమాల మీదే ఫోకస్.

• సత్య పులగం

---

# తేజశ్శాలీ! లేచి రావమ్మా!

### ఏడో పాశురం

కీశు కీశెన్రు ఎంగుమ్ ఆనైచ్చాత్తమ్ కలన్దు
పేశిన పేచ్చరవమ్ కేట్టిలైయో? పేయ్ ప్పెణ్ణే!
కాశుమ్ పిఱప్పుమ్ కలకలప్పక్కై పేర్ త్తు
వాశ నఱుమ్‌కుళల్ ఆయిచ్చియర్ మత్తినాల్
ఓశై పడుత్త తయిర్ అరవమ్ కేట్టిలైయో;
నాయగప్పెణ్ పిళ్ళాయ్! నారాయణన్ మూర్త్తి
కేశవనై ప్పాడవుమ్ నీ కేట్టే కిడత్తియో?
తేశముడైయాయ్! తిఱ ఏల్ ఓర్ ఎమ్బావాయ్

**భావం:** దక్షిణాదిన పుట్టినింటివారు, మెట్టినింటివారు పెండ్లి కుమార్తెకు రెండు తాళి బొట్లు ఇవ్వడం సాంప్రదాయం. తమిళంలో వాటిని 'అచ్చుత్తాళి', 'అమ్మైత్తాళి' అంటారు. అవి



**తిరుప్పావై**

ఒరుసుకున్నప్పుడు వచ్చే ధ్వనిని పక్షుల కిలకిలారావాలతో పోల్చింది గోదాదేవి. "గోపికా! భరద్వాజ పక్షులు కీచుకీచుమంటున్నాయి. నీ ఎదపై ఉన్న తాళిబొట్లు ఒరుసుకొని ధ్వని చేస్తున్నాయి. ఈ ధ్వనులేవీ నీకు వినిపించడం లేదా? మా అందరికీ నాయకమణి లాంటి దానివి కదా! లేచిరా! పెరుగు చిలుకుతున్న గోపకాంతల గాజుల ధ్వని వింటూ కూడా పరున్నావా? మేము కేశవుణ్ణి కీర్తిస్తూ ఉంటే వింటూ కూడా పరున్నవా? తేజశ్శాలీ! తెల్లవారింది మేలుకో! తలుపు తెరిచి బయటకు రా! మమ్మల్ని ముందుండి నడిపించు!" అని పిలుస్తోంది ఆండాళ్.

• ఎ. సీతారామారావు

## ముత్యాల ముగ్గు



21 చుక్కలు
మధ్య చుక్క
11 వచ్చే వరకు

పి. బాలమ్మ
మార్కాపూర్



19 చుక్కలు
7 వరుసలు
7 వరకు
సరి చుక్కలు

సి. రాజ్యలక్ష్మి
ఏఎస్‌రావు నగర్, హైదరాబాద్

మీ ముత్యాల ముగ్గుతో పాటు మీ ఫొటో, పోస్టల్ అడ్రస్, ఫోన్ నంబర్ కూడా వివరంగా రాయండి.

మా చిరునామా... నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500033. Email: navya@andhrajyothy.com


TIGER COMPANY PRODUCTION
టి. అంజయ్య సమర్పించు
జనవరి 1న విడుదల
రామ్ గోపాల్ వర్మ
బ్యూటిఫుల్
ట్రిబ్యూట్ టు రంగీలా
దర్శకత్వం అగస్త్య మంజు
నిర్మాతలు - టి. నరేష్ కుమార్, టి. శ్రీధర్
ఆడియో విడుదల
డిసెంబర్ 23 సా॥ 7:30 లకు
ITC కోహినూర్


MYTHRI MOVIE MAKERS
CLAP ENTERTAINMENT
మత్తు వదలరా
RELEASING THIS CHRISTMAS
DECEMBER 25TH
RITESH RANA
CHIRANJEEVI (CHERRY), HEMALATHA
MUSIC KAALA BHAIRAVA
DOP SURESH SARANGAM
ART A.S. PRAKASH
EDITOR KARTHIKA SRINIVAS
RAGHUNATH.K
P.T.GIRIDHAR RAO
SHANKAR
THOMAS JAY
TEJA R


LEGENDARY
MASS HIT
హ్యాపీ మూవీస్
BALAKRISHNA
రూలర్
POLICE


BEST FILM IN TOWN
SURESH PRODUCTIONS PVT. LTD.
people MEDIA FACTORY
10TH DAY
VENKY మామ
K.S. RAVINDRA (BOBBY)
D.SURESH BABU T.G.VISHWA PRASAD
THAMAN S VIVEK KUCHIBHOTLA PRASAD MURELLA
PRAWIN PUDI BRAHMA KADALI RAM LAXMAN RAVI VARMA A. VIJAY
SRIKANTH VISSA K.CHAKRAVARTHY JANARDHAN MAHARSHI
RADHA POOSALA NIKHIL KODURU G.RAMESH REDDY
KOLLI SUJITH KUMAR RAMA BALAJI.D T.NAGU
వెంకి మామ


viacom 18 STUDIOS
Parallel Minds
FAMILY ENTERTAINER
BLOCKBUSTER HIT
KARTHI JYOTIKA SATHYARAJ
దొంగ
A JEETHU JOSEPH FILM


DHARMA PRODUCTIONS
ZEE STUDIOS
GOOD NEWWZ
THE BIGGEST GOOF-UP OF THE YEAR!
THIS CHRISTMAS 27TH DEC
ADVANCE BOOKING OPENS TODAY


పడి పడి నవ్వుతుండగా, ప్రతి థియేటర్ లో పండగే...
UV creations
ALLU ARAVIND PRESENTS
GA2 PICTURES
ప్రతిరోజూ పండగే
MARUTHI BUNNY VAS THAMAN S
JAIKUMAR SAMPATH SKN RAVEENDAR
KOTAGIRI VENKATESWARA RAO SATYA G VENKAT BABU
A THAMAN MUSICAL


'DIL' RAJU PRESENTS
SRI VENKATESWARA CREATIONS
A 'DIL' RAJU PRODUCTION
DECEMBER 25TH RELEASE
U r my heart Beat
ఇద్దరి లోకం ఒకటే
SHIRISH MICKEY J MEYER G R KRISHNA
HARSHITH REDDY - BEKKEM VENUGOPAL (GOPI) SAMEER REDDY ABBURI RAVI
TAMMI RAJU BANDI RATNA KUMAR RAMANA VANKA STUNT SIVA
G ANUHYA REDDY BHANU VIJAY
ADITYA MUSIC
U/A


PUSHKAR FILMS
JAN 1ST 2020
GRAND RELEASE
STARRING RAKSHITH SHETTY
A PUSHKAR FILMS PRODUCTION
PARAMVAH STUDIOS
ASN
రక్షిత్ శెట్టి
అతడే శ్రీమన్నారాయణ
TELUGU-KANNADA-HINDI-TAMIL-MALAYALAM
DIRECTED BY SACHIN
PRODUCED BY PUSHKARA MALLIKARJUNAIAH
DISTRIBUTED BY : SRI VENKATESHWARA FILMS
SRI VENKATESWARA FILMS
a 'Dil' Raju release



## నన్ను చంపేస్తామని బెదిరిస్తున్నారు

**రక్షణ కల్పించండి ● ఢిల్లీ పోలీసులకు గంభీర్ వినతి**

**న్యూఢిల్లీ:** తనను చంపుతానంటూ బెదిరింపులు వస్తున్నాయని.. దాంతో తనకు, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని ఎంపీ, మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ పోలీసులను ఆశ్రయించాడు. ఓ అంతర్జాతీయ నెంబర్ నుంచి రెండురోజుల కిందట తనకు బెదిరింపు కాల్ వచ్చిందని షహదారా జిల్లా డీసీపీకి రాసిన లేఖలో పేర్కొన్నాడు. తనను, తన కుటుంబాన్ని చంపేస్తానని ఆ కాల్‌చేసిన వ్యక్తి హెచ్చరించాడన్నాడు. ఈమేరకు ఆ నెంబర్‌ను పోలీసులకు తెలియజేస్తూ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని గంభీర్ కోరాడు. క్రికెట్‌నుంచి రిటైరైన అనంతరం బీజేపీలో చేరిన గౌతమ్.. ఈస్ట్‌ఢిల్లీ నుంచి లోక్‌సభకు ఎన్నికైన సంగతి తెలిసిందే. పౌరసత్వ చట్ట సవరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు పెల్లుబుకుతుండగా.. గంభీర్ ఆ చట్టానికి పూర్తిగా మద్దతు ప్రకటించాడు.

# ఎవరిదో ఆఖరి పంచ్!

మధ్యాహ్నం 1.30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో..

**భారత పర్యటనలో వెస్టిండీస్ అంచనాలకు మించే రాణిస్తోంది. టీ20 సిరీస్‌తో పాటు తాజా వన్డే సిరీస్‌లోనూ టీమిండియాను ఆఖరి మ్యాచ్ వరకు వేచిచూసేలా చేయడం వారి పోరాటాన్ని తెలుపుతుంది. కానీ విశాఖ మ్యాచ్ తరహాలోనే నిర్ణాయక వన్డేలోనూ కరీబియన్లపై ముప్పేట దాడితో ఉక్కిరి బిక్కిరి చేయాలనుకుంటోంది కోహ్లీసేన. అదే జరిగితే విండీస్‌పై భారత్ రికార్డు స్థాయిలో వరుసగా పదో ద్వైపాక్షిక సిరీస్‌ను వశం చేసుకోవడంతో పాటు ఈ ఏడాదికి విజయంతో ముగింపు పలికినట్టవుతుంది. మరోవైపు తొలి వన్డేలో చూపిన ఆల్‌రౌండ్ షోను పునరావృతం చేస్తూ 2002 తర్వాత ఇక్కడ సిరీస్ నెగ్గాలనే ఆలోచనలో పర్యాటక జట్టు ఉంది.**



హెట్‌మయెర్, పొలార్డ్



## వెస్టిండీస్‌తో చివరి వన్డే నేడు

## వరుసగా పదో సిరీస్ రికార్డుపై భారత్ దృష్టి

**కటక్:** స్వదేశంలో ఈఏడాది భారత జట్టు రెండు వన్డే సిరీస్‌లు ఆడగా.. రెండింటిలోనూ ఫలితం కోసం ఆఖరి మ్యాచ్ వరకు ఆగాల్సి వచ్చింది. ఈ ఏడాది మార్చిలో ఆసీస్‌తో ఆడిన ఐదు వన్డేల సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లు గెలిచినా ఆ తర్వాత వరుసగా మూడింటిని ఓడింది. తాజాగా విండీస్‌తో ప్రస్తుతం 1-1తో సమంగా ఉన్న భారత్ ఆదివారం జరిగే ఆఖరి మ్యాచ్‌ను ఎట్టి పరిస్థితిల్లోనూ గెలవాలనుకుంటోంది. ఎందుకంటే గత 15 ఏళ్లుగా స్వదేశంలో వరుసగా రెండు వన్డే సిరీస్‌లను భారత్ ఓడిపోలేదు. మరోవైపు ఆఖరాటలో పైచేయి సాధిస్తూ భారత టూర్‌ను సంతృప్తికరంగా ముగించాలనే భావనలో పొలార్డ్ సేన ఉంది.

### 'టాప్' ఫామ్‌లో భారత్

చెన్నైలో ఓటమి తర్వాత భారత జట్టు విరుచుకుపడిన తీరు విండీస్‌ను బెంబేలెత్తించింది. టాపార్డర్‌లో రోహిత్ శర్మ, రాహుల్‌ల శతకాలతో జట్టు స్కోరు దాదాపు 400 వరకు వచ్చింది. వీరిద్దరి మధ్యే 227 పరుగుల భాగస్వామ్యం సమకూరింది. ఇక 159 పరుగులతో రోహిత్ చెలరేగిన తీరును విండీస్ బౌలర్లు అంత సులువుగా మర్చిపోరు. ఈ మ్యాచ్‌లోనూ వారి ఫోకస్ అతడిపైనే ఉంటుంది. రాహుల్ కూడా ఓపెనర్‌గా తాను ఎక్కువ కాలం కొనసాగడానికే వచ్చాననే సంకేతాలు పంపినట్టయింది. కెప్టెన్ కోహ్లీ ఈ సిరీస్‌లో ఇంకా బ్యాట్ ఝుళిపించలేదు. ఈ మ్యాచ్‌లో ఆ లోటు తీరితే భారత్‌కు మరోసారి భారీ స్కోరు ఖాయమే. మిడిలార్డర్‌లో శ్రేయాస్ అయ్యర్ వరుస అర్ధసెంచరీలతో మేనేజ్‌మెంట్‌ను ఖుషీ చేస్తున్నాడు. పంత్ కూడా తనపై ఒత్తిడిని తగ్గించుకుంటూ ట్రాక్‌లోకి వచ్చాడు. నేటి కీలక మ్యాచ్‌లోనూ జట్టు వీరి నుంచి అలాంటి ఇన్నింగ్సే ఆశిస్తోంది.



సైనీ

### సైనీకి చోటు!

బౌలింగ్ విభాగంలో హ్యాట్రిక్ హీరో కుల్దీప్ యాదవ్ తన స్పిన్ పవర్ చూపాలనుకుంటున్నాడు. ఇక పేసర్ షమి కూడా మూడు వికెట్లతో ఒత్తిడి పెంచాడు. మరోవైపు జట్టు ముగ్గురు పేసర్లు లేక ముగ్గురు స్పిన్నర్లతో ఆడుతుందా? లేదా? అనే దానిపై శార్దూల్, సైనీల చోటు ఆధారపడి ఉంటుంది. ఒకవేళ ఇద్దరు సీమర్లకే ఓకే చెబితే సైనీ అరంగేట్రం చేసే చాన్స్ ఉంటుంది. అయితే జడేజా మాత్రం ధారాళంగా పరుగులిస్తున్నాడు. బౌలింగ్‌లో వైవిధ్యం లేకపోవడంతో విండీస్ లెఫ్ట్ హ్యాండర్స్ జడ్డూను సులువుగా ఎదుర్కొంటున్నారు. ఇక జట్టులోని ఫీల్డింగ్ ప్రమాణాలు కూడా దారుణంగా పడిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది.

### హిట్టింగ్‌నే నమ్ముకున్నారు..

సిరీస్ ఆరంభ మ్యాచ్‌లో విండీస్ అన్ని విభాగాల్లోనూ రాణించింది. కానీ విశాఖ తీరాన ఒక్కసారిగా డీలాపడింది. హెట్‌మయెర్ రనౌట్ కావడం కూడా ఆ జట్టు ఛేదనను దెబ్బతీసింది. ఓపెనర్ షాయ్ హోప్, లూయిస్, పూరన్, పొలార్డ్‌లతో బ్యాటింగ్ విభాగం భారత్‌కు దీటుగానే కనిపిస్తోంది. ఇక ఐపీఎల్ వేలంలో మిలియనీర్‌గా మారిన పేసర్ కాట్రెల్ రెట్టించిన ఉత్సాహంతో భారత టాపార్డర్ పని పట్టాలనుకుంటున్నాడు. రెండో వన్డేలో లెఫ్టామ్ స్పిన్నర్ పియెర్ పరుగులు ఎక్కువగా ఇవ్వడంతో లెగ్ స్పిన్నర్ హేడెన్ వాల్ష్‌ను ఆడించే అవకాశం ఉంది. ఆల్‌రౌండర్ హోల్డర్ కూడా ప్రభావం చూపడం లేదు.

### కటక్ దారికొస్తుందా..!

ప్రపంచంలోని ఏ వేదికపైనా పరుగుల వరద పారించే కెప్టెన్ విరాట్ కోహ్లీ కటక్‌లోని బారాబతి స్టేడియం మాత్రం ఆ అవకాశం ఇవ్వడం లేదు. ఎందుకంటే ఇక్కడ కోహ్లీ మూడు వన్డేలు, ఓ టీ20 ఆడితే కేవలం 11 సగటుతో 34 పరుగులు మాత్రమే చేశాడు. భారత్‌లో కనీసం మూడు మ్యాచ్‌లు ఆడిన ఏ స్టేడియంలోనూ అతడు ఇంత తక్కువ పరుగులు సాధించలేదు. అందుకే ఈసారి తన స్థాయి ఆటను చూపాల్సిందే అన్నట్టుగా నెట్స్‌లో ఏరియల్, గ్రౌండ్ స్ట్రోక్స్‌తో కఠోర సాధన చేశాడు. అలాగే ఈ సిరీస్‌లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో 4 పరుగులే చేయడంతో నిర్ణాయకమైన ఈ మ్యాచ్‌తోనైనా కోహ్లీ పరుగుల దాహం తీర్చుకోవాలనుకుంటున్నాడు.

### పిచ్, వాతావరణం

**బా**రాబతి పిచ్ కూడా బ్యాట్స్‌మెన్‌కు స్వర్గధామంగా మారనుంది. మూడేళ్ల క్రితం ఇక్కడ జరిగిన చివరి వన్డేలో ధోనీ, యువరాజ్ శతకాలతో భారత్ 381 పరుగులు చేయగా ఇంగ్లండ్ కేవలం 15 పరుగులతోనే ఓడింది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ వేగంగా స్పందించే అవకాశంతో పాటు మంచు ప్రభావం కూడా కీలకంగా మారుతుంది. వర్షం నుంచి ఎలాంటి ఆటంకం లేదు.

### జట్లు (అంచనా)

**భారత్:** రోహిత్, రాహుల్, కోహ్లీ, అయ్యర్, పంత్, జాదవ్, జడేజా, కుల్దీప్, షమి, సైనీ, చాహల్/ఠాకూర్.
**విండీస్:** లూయిస్, హోప్, హెట్‌మయెర్, చేజ్, పూరన్, పొలార్డ్ (కెప్టెన్), హోల్డర్, పాల్, జోసెఫ్, పియెర్, కాట్రెల్.

2005 తర్వాత భారత జట్టు స్వదేశంలో వరుసగా రెండు వన్డే సిరీస్‌లు ఓడిపోలేదు.

కటక్ స్టేడియంలో భారత్ ఆడిన 16 మ్యాచ్‌ల్లో 12 గెలిచింది. ఇక విండీస్ ఆడిన మూడు వన్డేలూ ఓడింది.

## 'ట్రయల్స్'కు నిఖత్ ఎంపిక

**కానీ, బౌట్ మేరీతో కాదు..**



**న్యూఢిల్లీ:** ఉత్కంఠ వీడింది. తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీ ట్రయల్స్‌కు ఎంపికైంది. ఈ మేరకు భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ ఐ) సెలెక్షన్ కమిటీ శనివారం ప్రకటించింది. రెండురోజుల ఈ ట్రయల్స్ ఈనెల 26, 27న ఇక్కడి ఇందిరాగాంధీ స్టేడియంలో జరగనున్నాయి. మహిళల 51 కిలోల విభాగానికి సంబంధించిన ట్రయల్స్‌కు మూడు స్థానాలు.. మేరీకోమ్, జ్యోతి గులియా, రీతూ గ్రేవల్‌కు ఇంతకుముందే ఖరారైన సంగతి తెలిసిందే. కానీ..నాలుగోస్థానంపై ఉత్కంఠ ఏర్పడింది. ఇక ట్రయల్స్‌లో మేరీకోమ్‌కు టాప్ ర్యాంక్ ఇవ్వగా.. నిఖత్‌కు రెండో ర్యాంక్ కేటాయించారు. జ్యోతి, రీతూలకు మూడు, నాలుగు ర్యాంకులు ఇచ్చారు. ట్రయల్స్‌లో 1,4 ర్యాంకర్లు (మేరీ-రీతూ), 2,3 ర్యాంకర్లు (నిఖత్-జ్యోతి) తలపడతారని బీఎఫ్ఐ ప్రకటించింది. రెండుబౌట్ల విజేతలు ఫైనల్ ట్రయల్‌లో ఢీకొంటారని తెలిపింది. ఫైనల్లో గెలుపొందిన బాక్సర్‌ను చైనాలో జరిగే ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీకి పంపుతామని పేర్కొంది. కాగా.. ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీ కోసం తనకు, మేరీకోమ్‌కు మధ్య ట్రయల్స్ నిర్వహించాలని ఎంతోకాలంగా నిఖత్ డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే..ట్రయల్స్ నిర్వహణకు బీఎఫ్ఐ ఎట్టకేలకు సుముఖత వ్యక్తంజేసినా, ర్యాంకుల పేరిట నిఖత్‌తో మేరీకోమ్ తలపడకుండా చర్యలు తీసుకోవడం గమనార్హం. కాగా.. పురుషుల 57 కిలోల విభాగం ట్రయల్స్‌లో తెలంగాణకు చెందిన హుస్సాముద్దీన్.. సచిన్‌తో తలపడనున్నాడు.

## జెరెమి రికార్డుల మోత



**దోహా:** భారత్‌కు చెందిన జెరెమి లాల్‌రినున్గ ఖతార్ ఇంటర్నేషనల్ కప్ వెయిట్‌లిఫ్టింగ్‌లో రికార్డుల మోత మోగించాడు. యూత్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అయిన 17 ఏళ్ల జెరెమి.. ఖతార్ టోర్నీ పురుషుల 67 కిలోల విభాగంలో మూడు ప్రపంచ రికార్డులు సహా మొత్తం 27 రికార్డులు బద్దలుగొట్టడం విశేషం. స్నాచ్‌లో 140 కి., క్లీన్ అండ్ జెర్క్‌లో 166 కిలోలతో మొత్తం 306 కిలోల బరువెత్తిన జెరెమి రజత పతకం దక్కించుకున్నాడు. ఈనేపథ్యంలో అతడు స్నాచ్, క్లీన్ అండ్ జెర్క్, టోటల్‌లో తన పేరిటే ఉన్న యూత్ వరల్డ్, ఆసియన్ రికార్డును తిరగ రాశాడు. ఇక.. టోటల్‌లో తన పేరిట ఉన్న మొత్తం 27 జాతీయ, అంతర్జాతీయ రికార్డులను లాల్‌రినున్గ అధిగమించడం గమనార్హం. మూడు యూత్ వరల్డ్, మూడు యూత్ ఆసియన్, ఆరు కామన్వెల్త్ రికార్డులతో మొత్తం 12 అంతర్జాతీయ రికార్డులను తుడిచి పెట్టాడు. అలాగే ఐదు యూత్ నేషనల్, ఐదు జూనియర్ నేషనల్ మరో ఐదు సీనియర్ నేషనల్‌తో మొత్తం 15 రికార్డులను జెరెమి బద్దలుగొట్టాడు.



## 'టిష్యూ పేపర్ల'తో బ్యాటింగ్ చేశా

**న్యూఢిల్లీ:** ఐదు వన్డే వరల్డ్ కప్‌లు ఆడిన దిగ్గజ బ్యాట్స్‌మన్ సచిన్ టెండూల్కర్ తన పేరిట ఎన్నో రికార్డులు నమోదు చేశాడు. మరీముఖ్యంగా సౌతాఫ్రికాలో జరిగిన మెగా టోర్నీ (2003)లో అతడి ఫామ్ ఆకాశాన్నంటింది. ఆ వరల్డ్‌కప్ 11 మ్యాచ్‌ల్లో సచిన్ రికార్డుస్థాయిలో 674 రన్స్ చేశాడు. దాయాది పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో కండరాలు పట్టేసినా, ఆ నొప్పిని పంటి బిగవున అదిమిపట్టి 98 రన్స్ చేసి భారత్‌ను విజయతీరాలకు చేర్చాడు. చాలామందికి ఈ మ్యాచ్‌లో సచిన్ కండరాల నొప్పి గురించి మాత్రమే తెలుసు. కానీ తదుపరి శ్రీలంకతో సూపర్ సిక్స్ దశ మ్యాచ్‌లో టెండూల్కర్ తీవ్ర ఆరోగ్య సమస్య ఎదుర్కొన్న విషయం ఎవరికీ తెలీదు. ఆ సమస్యేంటో సచినే వెల్లడించాడు. 'నా కెరీర్‌లో తొలిసారి పాక్‌తో మ్యాచ్‌లో రన్నర్ సాయం తీసుకున్నా. కానీ ఆ మ్యాచ్ తర్వాత డయేరియా బారినపడ్డా. 500 కేజీల బరువు మోస్తున్న వ్యక్తి ఎలాగైతే నిలుచోలేడో ఆ విధంగా తయారైంది నా పరిస్థితి. పాక్‌తో పోరులో బాగా అలసిపోవడంతో తదుపరి శ్రీలంకతో మ్యాచ్‌కు కోలుకొనేందుకు అధిక మొత్తంలో ద్రవపదార్థాలు తీసుకున్నా. దీంతో నీళ్ల విరోచనాలు మొదలయ్యాయి. అయినా లంకతో మ్యాచ్‌లో ఆడాలనే నిర్ణయించుకున్నా. టిష్యూ పేపర్లు పెట్టుకొని బ్యాటింగ్ చేశా' అని టెండూల్కర్ వివరించాడు. అంత విపత్కర పరిస్థితుల్లో ఉండి కూడా సచిన్ ఆ మ్యాచ్‌లో 97 రన్స్ చేయడం విశేషం. 'జట్టును ఆదుకోవాల్సిన సందర్భాల్లో ఒక్కోసారి అలాంటి సవాళ్లు ఎదురవుతాయి. ఆ పరిస్థితుల్లో మనం బ్యాటింగ్ చేయగలిగే పరిస్థితుల్లో ఉన్నామా లేదా అని ఆలోచించకుండా బరిలోకి దిగాల్సి ఉంటుంది. నేనూ అలానే చేశా' అని సచిన్ మరో ప్రశ్నకు బదులిచ్చాడు.

## ఐఎస్ఎల్‌కు 'పౌర' సెగ

**వ్యతిరేక బ్యానర్లతో విద్యార్థుల నిరసన**




**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి):** దేశాన్ని అతలాకుతలం చేస్తున్న పౌరసత్వ చట్టం, ఎన్ఆర్సీ వ్యతిరేక ఆందోళనలు ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)నూ తాకాయి. శనివారం గచ్చిబౌలి స్టేడియంలో హైదరాబాద్ ఎఫ్‌సీ-అట్లెటికో డి కోల్‌కతా జట్ల మధ్య జరిగిన ఫుట్‌బాల్ మ్యాచ్‌లో.. ఈ చట్టానికి వ్యతిరేకంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) విద్యార్థులు బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. అయితే తాము విస్తృతంగా తనిఖీలు చేసి అభిమానులను స్టేడియంలోకి పంపినా.. బ్యానర్లతో నిరసన వ్యక్తంజేయడంపై పోలీసులు కంగుతిన్నారు. పోలీసులు తనిఖీలుంటాయని తెలిసిన హెచ్‌సీయూ విద్యార్థులు చాలా తెలివిగా వ్యవహరించారు. 'నో ఎన్ఆర్సీ, నో క్యాబ్' అని నినాదాలు రాసివున్న లుంగీలను ధరించి స్టేడియంలోకి ప్రవేశించారు. స్టేడియంలోకి వచ్చాక నినాదాలు రాసి ఉన్న ఆ లుంగీ బ్యానర్లను మ్యాచ్ ఆసాంతం ప్రదర్శించారు. అలాగే 'నో ఎన్ఆర్సీ, నో క్యాబ్' అని తెల్లకాగితాలపై రాసిన ప్లకార్డులనూ ప్రదర్శించడం గమనార్హం.

### అట్లెటికోతో హైదరాబాద్ మ్యాచ్ డ్రా

ఫార్వర్డ్ బోబో డబుల్ ధమాకాతో గెలుపు అంచున నిలబెట్టినా.. గోల్ కీపర్ కమల్‌జిత్ తప్పిదంతో గెలవాల్సిన మ్యాచ్‌ను హైదరాబాద్ డ్రాగా ముగించింది. రాయ్ కృష్ణ లేటు గోల్‌తో కోల్‌కతాను గట్టెక్కించాడు. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ ఎఫ్‌సీ, అట్లెటికో డి కోల్‌కతా మధ్య మ్యాచ్ 2-2తో డ్రాగా ముగిసింది. హైదరాబాద్ తరఫున బోబో (39వ, 85వ) రెండు గోల్స్ చేయగా.. కోల్‌కతా స్ట్రయికర్ రాయ్ కృష్ణ (15వ, 90వ) గోల్స్ సాధించాడు.

## అబిద్, మసూద్ సెంచరీలు

**పట్టు బిగించిన పాకిస్థాన్ ● శ్రీలంకతో రెండో టెస్ట్**



అబిద్ అలీ (174)

**కరాచీ:** ఓపెనర్లు షాన్ మసూద్ (135), అబిద్ అలీ (174) సెంచరీలతో అదరగొట్టారు. దాంతో శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్ట్‌లో పాకిస్థాన్ పట్టు బిగించింది. మూడోరోజు ఆట ముగిసే సరికి పాక్ రెండో ఇన్నింగ్స్‌లో కేవలం రెండు వికెట్లకు 395 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 80 పరుగుల ఆధిక్యాన్ని సమర్పించుకున్న పాక్..ఆ లోటును పూడ్చుకొంది. అంతేకాదు మొత్తం 315 రన్స్ ఆధిక్యం సాధించగా జట్టుకు ఇంకా 8 వికెట్లు చేతిలో ఉన్నాయి. ఓవర్‌నైట్ స్కోరు 57/0తో ఆతిథ్య జట్టు శనివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించగా మసూద్, అబిద్ మొదటి వికెట్‌కు 278 రన్స్ జోడించి పటిష్ఠ స్థితిలో నిలిపారు. తొలి ఇన్నింగ్స్‌లో పాక్ 191 పరుగులు చేయగా.. లంక 271 రన్స్ చేసింది.

**అలీ మరో రికార్డు:** 32 ఏళ్ల లేటు వయసులో టెస్టుల్లో అడుగుపెట్టిన అబిద్ అలీ మరో రికార్డు సృష్టించాడు. ఆడిన తొలి వన్డే, టెస్టులో సెంచరీలు సాధించిన క్రికెటర్‌గా ఇప్పటికే రికార్డు నెలకొల్పిన అలీ.. ఆడిన మొదటి రెండు టెస్టుల్లో శతకాలు బాదిన తొలి పాకిస్థాన్ బ్యాట్స్‌మన్‌గా ఘనత వహించాడు. ఇక ఓవరాల్‌గా తొమ్మిదో బ్యాట్స్‌మన్ అయ్యాడు. శ్రీలంకతో రావల్పిండిలో డ్రా అయిన మొదటి టెస్టులో అరంగేట్రం చేసిన అబిద్ సెంచరీ (109) చేసిన సంగతి తెలిసిందే. గత మార్చిలో దుబాయ్‌లో ఆస్ట్రేలియాపై తన తొలి వన్డేలోనే అబిద్ (112) సెంచరీతో రికార్డుల కెక్కాడు.

## అది.. నీ ప్రతిభకు కొలమానం కాదు

**యూసుఫ్‌కు ఇర్ఫాన్ ఓదార్పు**



**న్యూఢిల్లీ:** ఈసారి ఐపీఎల్ వేలంతో తనను ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేయకపోవడంతో బాధలో ఉన్న టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యూసుఫ్ పఠాన్‌ను అతడి తమ్ముడు ఇర్ఫాన్ పఠాన్ ఊరడించే ప్రయత్నం చేశాడు. 'ఈ చిన్న కుదుపు నీ ప్రతిభకు కొలమానం కాదు. కెరీర్‌లో నువ్వు అద్భుత ప్రతిభ చూపావు. రియల్ మ్యాచ్ విన్నర్‌వు. ఎప్పుడూ నిన్ను ప్రేమించే తమ్ముడు' అని ఇర్ఫాన్ ట్వీట్ చేశాడు. ఈసారి రూ. కోటి ప్రాథమిక ధరతో వేలంలో నిలిచిన యూసుఫ్‌ను ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేయలేదు.



## చైర్మన్ ఉండగా ఇన్‌చార్జి చైర్మన్ ఎలా?

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు.. వివరణ ఇవ్వాలని ఆదేశం
- ఏపీపీఎస్సీ ఇన్‌చార్జి నియామక ఉత్తర్వు అమలు నిలిపివేత

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ)కి చైర్మన్‌ను ఉండగా ఇన్‌చార్జి చైర్మన్‌ను కమిషన్ కార్యదర్శి ఎలా నియమిస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. దీనిపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఇన్‌చార్జి చైర్మన్‌గా జింకా రంగ జనార్దన్‌ను నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వుల అమలును తాత్కాలికంగా నిలిపివేసింది. తదుపరి విచారణను ఈ నెల 24వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి ఎం.సత్యనారాయణ మూర్తి మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. తాను బాధ్యతలు నిర్వర్తించకుండా ఇన్‌చార్జి చైర్మన్‌ను నియమించారంటూ ఏపీపీఎస్సీ చైర్మన్ పి.ఉదయభాస్కర్ హైకోర్టును ఆశ్రయించగా, శనివారం దీనిపై విచారణ జరిగింది.

## అవ్వాతాతలను మోసగిస్తోన్న సర్కార్

- సీఎం జగన్ మొదటి సంతకానికే తూట్లు: కాంగ్రెస్

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం తర్వాత వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన తొలి సంతకానికే తూట్లు పడ్డాయని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ విమర్శించింది. ఈ ఏడాది జూన్ ఒకటో తేదీ నుంచి పింఛను వయసు 65 నుంచి 60 ఏళ్లకు తగ్గిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని, ఈమేరకు 60 ఏళ్ల వయస్సున్న వారందరికీ కొత్తగా పింఛన్లు అందజేయాలని తెలిపింది. కొత్తగా పింఛన్లు మంజూరు చేయక పోవడంవల్ల ఒక్కో అవ్వా తాతకు జూన్ నుంచి ఇప్పటివరకూ రూ.13500 నష్టం వాటిల్లిందని కాంగ్రెస్ పేర్కొంది.

## కొత్త రూల్స్‌తో పాతకు కోత

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబాల కన్నా తెల్లరేషన్‌కార్డులే ఎక్కువగా ఉన్నాయ ని రాష్ట్ర ప్రభుత్వానికి అనుమానం వచ్చింది. వాటిని గుర్తించి , తొలగించాలని నిర్ణయించింది. కచ్చితత్వంలో ఈ ఏరివేతను చేపట్టాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు వెళ్లాయి. ఈ నేపథ్యంలోనే 'నవశకం' పేరిట గ్రామాలు, పట్టణాలు అని లేకుండా సర్వత్రా జల్లెడ పట్టే పని మొదలయింది. వలంటీర్లు, సచివాలయాల ఉద్యోగుల హడావుడి కొన్నిప్రాంతాల్లో రేషన్‌పథకం అర్హుల్లోనూ భయం పెంచుతోంది. ఈ కసరత్తు అనర్హుల వరకే పరిమితం అయితే ఇబ్బంది ఉండదు. కానీ, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాల్లో అర్హులుంటే వారికి ఇప్పటిదాకా రేషన్ అందింది. ఇకపై ఆ కుటుంబాలకు రేషన్ ఆపేస్తారు. అలా ఒక లక్షకుపైగానే కార్డులకు కోతపడనుంది. రేషన్‌కార్డు లబ్ధిదారుల్లో 85% నుంచి 90% వరకు ప్ర తినెలా రేషన్ తీసుకుంటుండేవారు. ప్రతినెలా 20 లక్షల మం ది రేషన్ తీసుకోవడం లేదు. వారెందుకు తీసుకోవడం లేదని టీడీపీ ప్రభుత్వంలోనే కసరత్తు జరిగింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక నెలలో సీఎఫ్ఎంఎస్ ద్వారా జీతాలు తీ సుకుంటున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని గుర్తించి వా రి కుటుంబాలకు రేషన్ ఆపేస్తే సుమారు 1.40 లక్షల మంది తేలారు. వాటితో పాటు మరికొన్ని మార్గదర్శకాలను సాకుగా చూపి తెల్లకార్డులు తొలగించడంతో కొన్ని గ్రామాల్లో నిరసన లు వెల్లువెత్తుతున్నాయి. కొత్త మార్గదర్శకాల ప్రకారం బి య్యం కార్డు పొందాలంటే వార్షికాదాయం కుటుంబానికి గ్రా మాల్లో నెలకు రూ.10 వేలకు, పట్టణాలకు రూ.12 వేలు మిం చరాదు. సొంత కారున్నా, నెలవారీ విద్యుత్ చార్జీలు 300 యూనిట్ల కంటే ఎక్కువ వచ్చినా, ఆయా కుటుంబాల్లో ప్ర భుత్వ ఉద్యోగాలు, ప్రభుత్వ పెన్షన్ పొందుతున్నా అనర్హులే. కొందరు వలంటీర్లు ప్రత్యర్థి పార్టీల కుటుంబాలను టార్గెట్ చే స్తూ, వారి కార్డుల తొలగింపునకు సిఫారసు చేస్తున్నారని కొం దరు పేదలు వాపోతున్నారు. వైసీపీకి చెందిన వారే వలంటీ ర్లు కావడంతో గ్రామాల్లో టీడీపీకి చెందిన వారిని టార్గెట్ చేసి తొలగిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అధికార పార్టీకి చెందినవారి విషయంలో అనర్హులున్నా పట్టనట్టే ఉంటున్నారు.

# వేల కోట్లు వృథా!

## 'మూడు'లో అమరావతి పాత్ర నామమాత్రం

- ఇప్పటికే 6వేల కోట్ల ప్రాజెక్టులు పూర్తి
- వివిధ దశల్లో 10వేల కోట్ల పనులు
- మరెన్నో విలువైన ప్రతిపాదనలు
- వాటన్నింటికీ కాలం చెల్లినట్లే!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

మూడు రాజధానుల ముచ్చటతో 'అమరావతి' భవిష్యత్తుపై తీవ్ర అయోమయం నెలకొంది. దీని ప్రత్యక్ష ప్రభావం అందరికంటే ముందు పడేది భూములిచ్చిన రైతులు, అక్కడ ప్లాట్లు కొన్న వారిపైనే! ఇక... అమరావతిని పూర్తిస్థాయి రాజధానిగా కాకుండా సంవత్సరంలో 20 రోజులకు మించి జరగని శీతాకాల, వర్షాకాల అసెంబ్లీ సమావేశాలకు, హైకోర్టు ధర్మాసనానికి, సీఎం క్యాంప్ కార్యాలయానికి మాత్రమే పరిమితం చేస్తే పరిస్థితి ఏమిటి? వేల కోట్ల రూపాయలతో చేపట్టిన నిర్మాణాలు, ప్రాజెక్టులన్నీ వృథాయేనా? ఆ ఖర్చు బూడిదలో పోసిన పన్నీరేనా? ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రం అనుసరించాల్సిన విధానం ఇదేనా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. రాజధానిని అమరావతి నుంచి తరలిస్తే ఇప్పటి వరకూ అక్కడ చేపట్టిన పలు ప్రాజెక్టులపై వెచ్చించిన సుమారు రూ.6,000 కోట్ల ప్రజాధనం నిరర్థకమైనట్లే. ఇవికాక, ఇప్పటికే కాంట్రాక్టులు ఖరారైన మరో రూ.10,000 కోట్ల విలువైన ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. సుమారు రూ.26,000 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టేందుకు సిద్ధంగా ఉన్న ప్రాజెక్టుల పరిస్థితి పూర్తిగా అగమ్యగోచరమే. ఆయా పనుల కోసం వందలాది నిపుణులు, అధికారులు, వేలాది కార్మికుల మేధస్సు, శ్రమ వృథా కానుంది.

### ఎన్నెన్నో నిర్మాణాలు...

అమరావతిలోని 'మధ్యంతర ప్రభుత్వ సముదాయం'లో భాగంగా వెలగపూడిలో సచివాలయం, శాసనసభ, మండలి భవనాలను నిర్మించారు. జ్యుడీషియల్ కాంప్లెక్స్‌లో హైకోర్టును ఏర్పాటు చేశారు. అఖిల భారత సర్వీసు (ఏఐఎస్) అధికారులతోపాటు గెజిటెడ్ అధికారులు, ఎన్జీవోలు, 4వ తరగతి ఉద్యోగులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం సుమారు 4వేల ఫ్లాట్లతో కూడిన 53 భారీ టవర్ల నిర్మాణం చేపట్టారు. వీటి నిర్మాణం 60 నుంచి 70 శాతం పూర్తయ్యాయి. ప్రస్తుతం ఉన్న అసెంబ్లీని శాసనసభ శీతాకాల సమావేశాలకు మాత్రం వాడుకునే అవకాశముంది. ఇక... హైకోర్టులో ధర్మాసనాన్ని ఏర్పాటు చేయవచ్చు. వీటిని పక్కనపెడితే... మిగిలిన నిర్మాణాలు, అభివృద్ధి పరిచిన రోడ్లు, మౌలిక సదుపాయాలకోసం వెచ్చించిన సొమ్ము వృథా అవుతుంది.

### ఇవీ.. ప్రాజెక్టుల వివరాలు..

అమరావతి నిర్మాణానికి తెలుగుదేశం ప్రభుత్వం తొలిదశలో మొత్తం రూ.42,070 కోట్ల అంచనా వ్యయంతో 62 ప్రధాన ప్రాజెక్టులను తలపెట్టింది. వీటిలో వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయ సముదాయం (రూ.1028 కోట్లు), రహదారులు- వరద నియంత్రణ- స్టార్మ్‌వాటర్ డ్రెయిన్లు- ఇతర మౌలిక వసతులు (రూ.17,272 కోట్లు), ప్రభుత్వ గృహ సముదాయం (రూ.8828 కోట్లు), ఎల్పీఎస్ జోన్ల అభివృద్ధి (రూ.14,942 కోట్లు) వంటివి ఉన్నాయి. వీటికి సంబంధించి ఇప్పటి వరకు మొత్తం రూ.5674 కోట్ల విలువైన పనులు పూర్తవగా, మరో సుమారు రూ.10,000 కోట్ల ప్రాజెక్టులు వివిధ దశల్లో, మిగిలినవి పరిశీలన దశలో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులకు కావలసిన నిధుల్లో హడ్కో- వివిధ బ్యాంకులతో కూడిన కన్సార్టియం ద్వారా పొందిన రుణాలు, అమరావతి బాండ్లు, కేంద్ర సహాయం, అమరావతిలో పలు సంస్థలకు జరిపిన భూమి విక్రయాల ద్వారా సుమారు రూ.7,400 కోట్ల వరకూ సమకూరాయి. ప్రపంచ బ్యాంకు, ఏఐఐబీ వంటి ద్రవ్య సంస్థలు వేల కోట్ల రూపాయలను తక్కువ వడ్డీతో రుణంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి. కొత్త ప్రభుత్వ వైఖరి అమరావతికి వ్యతిరేకంగా ఉండటంతో ఆయా సంస్థలు వెనక్కి తగ్గాయి.

## జగన్ నిర్ణయాలతో రాష్ట్రానికి తీవ్ర నష్టం

- ఆయన పాలనలో అభివృద్ధి కలే
- బాబుపై కక్షతో ప్రజల్ని శిక్షిస్తారా?
- రాజు మారినప్పుడల్లా రాజధాని మార్చా?
- జీఎన్ రావుకు వైసీపీ తప్ప పార్టీలు కనిపించవా?: కన్నా



అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎప్పుడుంటాడో ఎప్పుడు పోతాడో తెలియని జగన్ నిర్ణయాల వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. నియంతృత్వ పోకడలతో ఇష్టారాజ్యంగా వైసీపీ అధినేత తీసుకొంటున్న నిర్ణయాలు ఏపీ పాలిట శాపాలుగా పరిణమిస్తున్నాయని మండిపడ్డారు. విజయవాడలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఏ ఇతర పార్టీని సంప్రదించకుండా వైసీపీ అభిప్రాయాన్ని మాత్రమే తీసుకున్న జీఎన్ రావు కమిటీ నివేదికను అమలు చేసే ముందు భూములిచ్చిన అమరావతి ప్రాంత రైతులకు, నిధులిచ్చిన కేంద్రానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రాంతీయ పార్టీల వల్ల కులం, కుటుంబం, అరాచకం తప్ప మరొకటి ఉండదని తాము చెబుతున్నది జగన్ పాలనలో మరోసారి రుజువైందన్నారు. ప్రభుత్వాన్ని నమ్మి రాజధాని నిర్మాణం కోసం రైతులు భూములిస్తే వాళ్లను రోడ్డుకీడ్చడం ఏంటని నిలదీశారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని బీజేపీ డిమాండ్ చేస్తోంటే, పాలనను వికేంద్రీకరిస్తూ విశాఖలో సీఎం, విజయవాడలో మంత్రులు ఉండటం వింతగా ఉందన్నారు. 'సీఎం మూడు రాజధానులంటారు. మంత్రులు ముప్పై అంటారు. రాజు మారినప్పుడల్లా రాజధాని మారుస్తారా? ఇదేమన్నా రాచరికమా?' అని నిలదీశారు. రాజధానికి భూములిచ్చిన రైతులను కానీ, రాష్ట్రంలో ఏ ఇతర రాజకీయ పార్టీని కానీ సంప్రదించకుండా జగన్ సొంత అజెండా అమలుకు అనుగుణంగా జీఎన్ రావు కమిటీ ఎలా నివేదిక ఇస్తుందని నిలదీశారు. 'ఇదేమన్నా రాచరికం అనుకుంటున్నారా? అలా వ్యవహరించిన చంద్రబాబు పోయారు. నువ్వు ఎప్పుడుంటావో, ఎప్పుడు పోతావో తెలీదు. రాష్ట్రాన్ని ఎందుకు భ్రష్టు పట్టిస్తావ్? రాజధాని ప్రాంతంలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకో! ఆర్నెల్లయినా వాళ్లపై యాక్షన్ లేదు. పోలవరంలో రూ.3,200కోట్లు అవినీతి జరిగిందని చెప్పి మూడు నెలలైంది. ఇప్పటికీ బాధ్యులెవరో తేలలేదు. మీ సొంత అజెండా అమలు కోసం కబుర్లు చెబితే ఎవరు వింటారు?' అని జగన్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. 'నిన్ను నమ్మి రాష్ట్ర ప్రజలు 151 స్థానాలు అప్పగిస్తే ఆరు నెలల్లో ఒక్క అభివృద్ధి అయినా చేశావా? కనీసం ప్రణాళిక సిద్ధం చేశావా? కులాలను విడదీసి ఓట్ల రాజకీయం కోసం ప్రభుత్వ సొమ్మును పంచడం తప్ప' అని నిలదీశారు. జగన్ నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి కలగానే ఉంటుందన్నారు. చంద్రబాబుపై కోపం, కక్షతో రాష్ట్ర ప్రజలను ఇబ్బంది పెట్టడం తగదని హితవు పలికారు. రాజధాని మార్పు విషయంలో కేంద్రం జోక్యం చేసుకుంటుందా? అని ప్రశ్నించగా రాష్ట్ర ప్రభుత్వం చేసే పిచ్చిపనుల్లో కేంద్రం ఎందుకు జోక్యం చేసుకుంటుందని ఎదురు ప్రశ్నించారు. ఈ నిర్ణయాలకు ముఖ్యమంత్రే బాధ్యత వహించాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అజయ్‌కుమార్ రెడ్డి బీజేపీలో చేరారు.

## అసైన్డ్ భూములకు ప్లాట్ల కేటాయింపు రద్దు

### కలెక్టరేట్‌కు ప్రభుత్వ ఉత్తర్వులు

- జాబితా సిద్ధం చేస్తున్న సీఆర్‌డీఏ
- మండిపడుతున్న రాజధాని రైతులు
- ఎలా ఇచ్చామో అలాగే ఇవ్వాలని డిమాండ్



గుంటూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి కోసం తమ అసైన్డ్ భూములను ఇచ్చిన వారికి బదులుగా నివాస, వాణిజ్య ప్లాట్లను గత ప్రభుత్వంలోనే కేటాయించారు. అయితే, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం అసైన్డ్ భూములను తిరిగి అప్పగించాలని నిర్ణయించింది. దీంతో తమ అసైన్డ్ భూములను సీఆర్‌డీఏకి ఇచ్చి నివాస, వాణిజ్య ప్లాట్లు పొందిన వారి జాబితాను ఏపీసీఆర్‌డీఏ, గుంటూరు రెవెన్యూ వర్గాలు సిద్ధం చేస్తున్నాయి. ఏపీ అసైన్‌మెంట్ చట్టానికి విరుద్ధంగా గత ప్రభుత్వం వ్యవహరించిందని పేర్కొంటూ ప్రస్తుత ప్రభుత్వం ప్లాట్ల కేటాయింపులను రద్దు చేసింది. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన అధికారులు రాజధాని గ్రామాల్లో అసైన్డ్ భూమి ఎంత ఉంది? ఎంతమంది సీఆర్‌డీఏకి ఇచ్చారు? ఎందరు రిటర్నబుల్ ప్లాట్లు పొందారు? ఇంకా ఇవ్వని వారెవరు? అన్న వివరాలను సిద్ధం చేస్తున్నారు. కొద్ది రోజుల్లోనే వీటిని కొలిక్కి తీసుకొచ్చి ప్లాట్ల కేటాయింపులను రద్దు చేయనున్నారు. దీంతో అసైన్డ్ భూములు యథాతథ స్థితికి చేరుకుంటాయని అధికారవర్గాలు చెబుతున్నాయి. కాగా, ఇటీవల అసెంబ్లీలో అమరావతిపై చర్చలో భాగంగా అసైన్డ్ భూముల విషయంలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని ప్రభుత్వం ఆరోపించింది. ఈ నేపథ్యంలోనే ఆయా ప్లాట్ల కేటాయింపులను రద్దు చేసింది. తదుపరి చర్యలు తీసుకోవాలని సీఆర్‌డీఏ కమిషనర్, గుంటూరు జిల్లా కలెక్టర్‌ని ఆదేశించింది. దీంతో అధికారులు కసరత్తు ప్రారంభించారు. త్వరలోనే ప్లాట్ల కేటాయింపుల రద్దు ఉత్తర్వులు జారీ అవుతాయని సమాచారం. ఇదిలావుంటే ప్రభుత్వ నిర్ణయంపై రాజధానిలోని అసైన్డ్ భూముల రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము ఏరూపంలో భూములు ఇచ్చామో అలా ఇవ్వగలరా? అని ప్రశ్నిస్తున్నారు.

### ఎంతమంది ఇచ్చారంటే..

రాజధాని పరిధిలోని 30 గ్రామాల్లో 3,229.21 ఎకరాల అసైన్డ్ భూమిని సేకరించాలని గత ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2016 శివాయి జమాదార్లకు సంబంధించి ప్రత్యేక ఉత్తర్వులు వెలువడిన తర్వాత అసైన్డ్ భూములను పూలింగ్ కింద తీసుకున్నారు. మొత్తం 2,515.62 ఎకరాల భూమి సీఆర్‌డీఏకి స్వాధీనమైంది. అసైన్డ్ భూమి ఎక్కువగా నవులూరు-2లో 165.05 ఎకరాలు, కురగల్లులో 491.53 ఎకరాలు, నిడమర్రు-1లో 180.46 ఎకరాలు, రాయపూడి-1లో 445.46 ఎకరాలు, తుళ్లూరు-1లో 165.82 ఎకరాలు, మందడం-2లో 715.52 ఎకరాలుంది. ఈ భూమిని సీఆర్‌డీఏకి ఇచ్చి మెట్ట అయితే 500 గజాల నివాస, 50 గజాల వాణిజ్య ప్లాట్లు, జరీబు భూమి అయితే 500 గజాల నివాస, 100 గజాల వాణిజ్య ప్లాట్లు తీసుకున్నారు.

## మండలికి మంగళం!?

- వేలాడుతున్న రద్దు కత్తి.. అక్కడ టీడీపీకే మెజారిటీ
- సర్కారుకు ఇబ్బందికర పరిణామాలు
- రెండు బిల్లులు వీగిపోవడంపై గుస్సా
- రద్దు చేయాలనే బలమైన ఆలోచన

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

**'రాష్ట్రాల్లో శాసన మండళ్లను రద్దు చేసే అవకాశం ఉందా!?'... ఈ నెల 11న వైసీపీ ఎంపీ అవినాశ్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని అడిగిన ప్రశ్న ఇది!**

**ఉన్నట్టుండి 'మండలి' ప్రస్తావన ఎందుకు తెచ్చారో... అంటూ అప్పుడే సందేహాలు వెలువడ్డాయి!**

**'మీరు ఇలా బిల్లులను అడ్డుకుంటే మండలినే రద్దు చేస్తాం'... ఇటీవల టీడీపీ ఎమ్మెల్యేలకు రాష్ట్ర మంత్రులు చేసిన హెచ్చరిక ఇది!**

మండలి రద్దుపై మొదలైన సందేహాలు కాస్త బలపడ్డాయి! అవును... శాసన మండలిపై 'రద్దు' కత్తి వేలాడుతోందనే అనుమానాలు, ఊహాగానాలు జోరుగా చక్కర్లు కొడుతున్నాయి. ప్రస్తుతం మండలిలో తెలుగుదేశానికే ఆధిక్యం ఉంది. తెలుగుదేశంలో నియమితులైన షరీఫ్ మండలి అధ్యక్షుడుగా ఉన్నారు. ప్రస్తుతం శాసనస మండలిలో టీడీపీకి 28 మంది సభ్యులుండగా... వైసీపీ సభ్యులు తొమ్మిది మంది మాత్రమే ఉన్నారు. పీడీఎఫ్‌కు ఐదుగురు, బీజేపీ సభ్యులు ఇద్దరు, ఇండిపెండెంట్లు ముగ్గురు సభ్యులు ఉన్నారు. మండలిలో వైసీపీకి మెజారిటీ రావాలంటే 2021 దాకా ఆగాలి. ఇప్పుడు అసెంబ్లీలో అధికార పక్షం వ్యూహాలకు... మండలిలో టీడీపీ ప్రతివ్యూహాలు రచిస్తోంది. ఉదాహరణకు... ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించి శాసనసభలో ఆమోదించిన ఆంగ్ల మాధ్యమం బిల్లు, ఎస్సీ కమిషన్ ఏర్పాటు బిల్లులకు మండలిలో టీడీపీ సవరణలు ప్రతిపాదించింది. 'మాధ్యమాన్ని ఎంచుకున్న అవకాశం తల్లిదండ్రులు/విద్యార్థులకు ఉండాలని... ఎస్సీ కమిషన్ బిల్లులో వర్గీకరణనూ చేర్చాలని పట్టుపట్టింది. ఇంగ్లీషు మీడియం బిల్లులో సవరణలకు ఇతర పక్షాలూ మద్దతు పలికాయి. మండలిలో విపక్షానిదే పైచేయి కావడంతో సవరణలు భారీ ఆధిక్యంతో ఆమోదం లభించింది. దీంతో ఈ బిల్లులను అసెంబ్లీకి తిప్పి పంపాల్సి వచ్చింది. బడ్జెట్ సమావేశాల్లో తిరిగి ఈ బిల్లులను సభలో ఆమోదించాలి. ఆ తర్వాత మండలి వ్యతిరేకించినా... శాసనసభ నిర్ణయమే అమలవుతుంది. ఈ బిల్లులపై మండలిలో విపక్షాన్ని ఒప్పించేందుకు ప్రయత్నించిన మంత్రులు... 'మీరు వ్యతిరేకిస్తే మండలిని రద్దు చేస్తాం' అని కూడా హెచ్చరించినట్లుగా కూడా వార్తలు వచ్చాయి.

### ఆది నుంచే అసహనం...

ముఖ్యమంత్రిగా జగన్ ప్రమాణ స్వీకారం చేశాక తొలిసారిగా శాసన మండలిలోకి అడుగుపెట్టినప్పుడు... టీడీపీ సభ్యుల నుంచి ఎదురైన ప్రశ్నలతో అసహనానికి గురైనట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన వీలైనంత వరకూ శాసన మండలికి వెళ్లడం లేదని తెలుస్తోంది. ఇంగ్లీషు బిల్లు, ఎస్సీ కమిషన్ బిల్లులకు మండలి 'బ్రేక్' వేసే అవకాశముందని గ్రహించిన మంత్రులు ముందుగానే ఈ విషయాన్ని జగన్‌కు తెలియచేశారు. 'అదే జరిగితే మండలినే రద్దు చేసేద్దాం' అని జగన్ చెప్పినట్లు తెలుస్తోంది.

### టీడీపీ సీనియర్లకు దెబ్బ

మండలి చైర్మన్, డిప్యూటీ చైర్మన్ షరీఫ్, రెడ్డి సుబ్రమణ్యంతోపాటు యనమల రామకృష్ణుడు, వైవీబీ రాజేంద్ర ప్రసాద్, మాజీ ఉద్యోగ నేత అశోక్‌బాబు తదితర నేతలు మండలిలో టీడీపీ తరఫునే ఎన్నికయ్యారు. అన్నింటికీ మించి... చంద్రబాబు తనయుడు లోకేశ్ కూడా శాసన మండలి సభ్యుడే. మండలినే రద్దు చేస్తే... వీరందరి పదవులు 'గాయబ్' అవుతాయి. మిగిలిన వారి సంగతి ఎలా ఉన్నా... 'లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న శాసనమండలిని కొనసాగించడం ఎందుకు' అని వైసీపీలోనే కొందరు నేతలు ప్రశ్నిస్తున్నారు.

### ఆ ఇద్దరి వల్లే ఆచితూచి...

రద్దు చేస్తే టీడీపీతోపాటు వైసీపీ సభ్యులు కూడా పదవులు కోల్పోతారు. అందులోనూ... జగన్‌కు అత్యంత సన్నిహితులుగా భావిస్తున్న ఇద్దరు మంత్రులు పిల్లి సుభాష్ చంద్రబోస్, మోపిదేవి వెంకట రమణారావు మండలి నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 'రద్దు చేస్తే వీరూ పదవీచ్యుతులవుతారు' అనే ఒకే ఒక్క కారణంతో జగన్ ఈ విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో శాసన మండలిని రద్దు చేస్తూ ఎన్టీఆర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. అప్పట్లో టీడీపీ అధికారంలో ఉండగా... మండలిలో కాంగ్రెస్‌కు మెజారిటీ ఉండేది. ఒక నిర్ణయం అమలు విషయంలో ఎన్టీఆర్ అభిమతానికి భిన్నంగా కౌన్సిల్ పట్టుపట్టి ముందుకు వెళ్లింది. దీంతోపాటు మరిన్ని ఇబ్బందులూ రావడంతో.... ఎన్టీఆర్ మండలిని రద్దు చేసేశారు. దీనిని వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పునరుద్ధరించారు.




చేనేత కార్మికులకు చెక్ అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్

## చేనేతకు చేయూత

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. అనంతపురం జిల్లా ధర్మవరంలో తన పుట్టినరోజు సందర్భంగా చేనేతలకు వైఎస్సార్ నేతన్నల నేస్తం పథకాన్ని శనివారం ప్రారంభించారు. రాష్ట్రంలోని 81,783 చేనేత కుటుంబాలకు ఈ పథకం కింద రూ. 196.27 కోట్లు మంజూరు చేశారు. వేదికపైనుంచి ఆయన బటన్ నొక్కి వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం సొమ్ము అర్హుల ఖాతాల్లో పడేలా చేశారు. ఏడాదికి రూ. 24 వేలు చొప్పున ఐదేళ్లకు రూ. 1.20 లక్షలు ఒక్కో కుటుంబానికి అందుతాయన్న ఆయన, నేతన్నల నేస్తం సొమ్మును కార్మికుల పాత బకాయిల్లోకి జమ చేయవద్దని బ్యాంకు అధికారులను ఆదేశించారు. అలాగే, 2014 నుంచి 2019 మధ్యకాలంలో ఈ జిల్లాలో ఆత్మహత్యలు చేసుకున్న 57 చేనేత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. ఐదు లక్షల ప్రకారం ఆర్థికసాయం అందించారు. వీరిలో 51 కుటుంబాలు ధర్మవరంలోనే ఉన్నాయి. కొన్ని చేనేత కుటుంబాలను సందర్శించి మగ్గాల పరిస్థితిని జగన్ పరిశీలించారు. అనంతరం అక్కడ బహిరంగసభలో మాట్లాడారు. వైఎస్సార్ నేతన్నల నేస్తం పథకం అనంతపురం జిల్లాలో 27వేల కుటుంబాలకు వర్తించగా, ధర్మవరంలోనే 10,700 కుటుంబాలకు లబ్ధి చేకూర్చామన్నారు.

### ఆదుకొన్నది నేనే

"గత పాలకులు చేనేతల ఆత్మహత్యలను పట్టించుకోలేదు. ఆప్కోను పచ్చచొక్కాలవారు దోచుకున్నారు. ఆ దోపిడీపై విచారణ జరిపిస్తున్నాం. అది త్వరలోనే పూర్తవుతుంది. ఆప్కోను ప్రక్షాళన చేసి క్లీన్ చేస్తాను" అని స్పష్టం చేశారు. "ధర్మవరంలోని చేనేతల కష్టాలు నాకన్నా ఎక్కువ తెలిసిన వారు లేరు. పులివెందుల దగ్గర్లోనే ఉండడంతో వారి విషయాలన్నీ నాకు తెలుసు. వారికి ఎప్పుడేం జరిగినా వారి వద్దకు వచ్చి ధైర్యం చెప్పిన వ్యక్తినీ నేనే" అని వివరించారు. "బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు మేలు జరిగే విధంగా నవరత్నాలను అమలు చేస్తున్నాం. ఆరునెలల పాలనలో రైతులకు భరోసా ఇచ్చాం. ఆటో, ట్యాక్సీలు, క్యాబ్‌ల డ్రైవర్లకు ఆర్థిక చేయూతనిచ్చాం. అగ్రిగోల్డ్ బాధితులకు అండగా నిలిచాం. మత్స్యకార కుటుంబాలను ఆదుకొన్నాం. వృద్ధాప్య పెన్షన్లకోసం గతంలో రూ. 500 కోట్లు ఖర్చుచేసేవారు. ప్రస్తుతం ఆ మొత్తాన్ని రూ.1500 కోట్లకు పెంచాం. పరిశ్రమల్లో స్థానికులకు 75శాతం రిజర్వేషన్లు వర్తించేలా చట్టం చేశాం. గ్రామ సచివాలయాలు, గ్రామ వలంటీర్ల ద్వారా నాలుగు లక్షల ఉద్యోగాలిచ్చాం" అని జగన్ వివరించారు. సామాజిక విప్లవం దిశగా అడుగులు వేస్తున్నామని, తన ప్రభుత్వంలో ఐదుగురు డిప్యూటీ సీఎంలు ఉంటే, వారిలో నలుగురు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలే ఉన్నారని తెలిపారు. "మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు మేమే అమలు చేశాం. అన్ని ప్రాంతాలకూ సమంగా ఆర్థికన్యాయం జరిగేలా ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తాం" అని చెప్పారు. పాలనలో వివక్ష, అవినీతి ఉండకూడదని భావిస్తున్నామని, అందుకే ప్రాజెక్టుల్లో రివర్స్ టెండరింగ్ విధానాన్ని అమలు చేసి దర్యాప్తు సంస్థలతో అనుసంధానం చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మేకపాటి, బొత్స సత్యనారాయణ, ఎం. శంకరనారాయణతోపాటు కలెక్టర్ గంధం చంద్రుడు, జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

> **శ్రమ నుంచి ఊరట**
>
> "పథకం ద్వారా వచ్చే సొమ్ముతో నేను యంత్రాన్ని కొంటాను. మగ్గం వేసే సమయంలో దానివల్ల శారీరక శ్రమ కొంత తగ్గుతుంది. ఉత్పత్తీ పెరుగుతుంది"
>
> **కాంతమ్మ, వైఎస్సార్ నేతన్న నేస్తం లబ్ధిదారు, ధర్మవరం**



రక్తదానం చేస్తున్న డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రాపాక



పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న జగన్

## ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్నీ, సీఎంవో కార్యదర్శి ధనుంజయరెడ్డి సీఎంతో కేక్ కట్ చేయించారు. ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ సందేశం పంపారు. డీజీపీ గౌతం సవాంగ్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆళ్ల నాని, పేర్ని నాని, కొడాలి నాని, ఆదిమూలపు సురేశ్, విశ్వరూప్, సీఎం ప్రధాన సలహాదారు అజేయ కల్లాం, జీఏడీ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, సీఎం కార్యదర్శి సాల్మన్ ఆరోకియా రాజ్ తదితరులు ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతపురం జిల్లా పర్యటన కోసం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న సీఎంకు ఎంపీ బాలశౌరి, మంత్రి బొత్స విమానంలోనే కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.

### డిప్యూటీ సీఎం రక్తదానం

కురుపాం: ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా శనివారం విజయనగరంజిల్లా కురుపాం ఆసుపత్రిలో ఉప ముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఆమె కూడా రక్తదానం చేశారు.

### జగన్ కటౌట్‌పై పూల వర్షం

హిందూపురం: అనంతపురం జిల్లా హిందూపురంలో 60 అడుగుల జగన్ కటౌట్ ఏర్పాటు చేసి, దానిపై బెంగళూరు నుంచి తీసుకువచ్చిన హెలికాప్టర్‌తో పూల వర్షం కురిపించారు. వైసీపీ పార్లమెంట్ అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

### ట్విట్టర్‌లో కేటీఆర్ శుభాకాంక్షలు

సీఎం జగన్‌కు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ మంత్రి కె.తారకరామారావు శుభాకాంక్షలు తెలిపారు. జగన్‌తో ఉన్న ఫొటోను ట్వీట్ చేశారు.

### 'జగన్'కు జనసేన ఎమ్మెల్యే క్షీరాభిషేకం

మలికిపురం: ఎన్నికల్లో ఇచ్చిన హామీల కంటే.. ఇవ్వని హామీలను కూడా సీఎం జగన్ అమలు చేస్తున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. తూర్పు గోదావరి జిల్లా మోరి చేనేత సహకార సంఘం వద్ద 'వైఎస్ఆర్ నేతన్న నేస్తం' విడుదల సందర్భంగా జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

## అమరావతిని 'కేంద్ర ప్రాంతం' చేసేయండి

- దీనికోసం హిందూ సమాజం పోరాడుతుంది
- కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి
- ఢిల్లీ వెళ్లి మోదీని కలుస్తాం: కమలానంద భారతీ

తుళ్లూరు, డిసెంబరు 21: రాజధాని అమరావతిలోని 29 గ్రామాలను కేంద్రపాలిత ప్రాంతంగా చేసేయాలని, ప్రపంచంలోని హిందువులమంతా కలిసి అమరావతిని నిర్మించుకుంటామని కమలానంద భారతీ స్వామి స్పష్టం చేశారు. హిందూమతం ప్రకారం శాస్త్రోక్తంగా అక్కడ పూజలు చేయడం వల్లే ముఖ్యమంత్రి జగన్ అక్కడ అడుగు పెట్టడం లేదని వ్యాఖ్యానించారు. శనివారం తుళ్లూరులో భక్తులు, రాజధాని రైతుల సమావేశంలోనూ, టీవీ చానళ్లతోనూ ఆయన మాట్లాడారు. 'ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీని కలుస్తాం. ఈ 29 గ్రామాలను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించి, అమరావతిని నిర్మించాలి. దీని కోసం ప్రధాని కార్యాలయం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ఇందుకోసం హిందూ సమాజం పోరాడుతుంది. అయోధ్యను నిర్మించుకుంటున్నట్టే ప్రపంచంలోని హిందువులమంతా కలిసి అమరావతిని నిర్మించుకుంటాం' అన్నారు. అమరావతి రైతుల త్యాగాలను గుర్తించి, అభివృద్ధి చేసి ప్రజల హృదయాలలో శాశ్వతంగా నిలిచిపోతారా? చేయకుండా చరిత్రలో ఉండిపోతారా? అంటూ ఏపీ ముఖ్యమంత్రి జగన్‌ను సూటిగా ప్రశ్నించారు. రాజధానికి భూములిచ్చిన రైతులు అధైర్యపడాల్సిన పని లేదని, అంతా మంచి జరుగుతుందన్నారు. 'రాజధానిగా ప్రకటించినప్పుడు ఈ గ్రామాలలో తిరగాను. ఎంతో శక్తిమంతమైన ప్రదేశం అమరావతి. దీనిపై ఎవరు తప్పుడు ప్రచారం చేసినా, వేరేగా ఆలోచించినా ఫలితం అనుభవించాల్సి ఉంటుంది. జగన్ చేస్తున్న పరిపాలన ఏమిటో తెలుసు. ప్రజలకు రాజు అనేవాడు ఎప్పుడూ మంచి చేయాలి' అన్నారు. గ్రామ దేవతలు ఎంతో శక్తిమంతులని, వారిని పూజించి దైవ అనుగ్రహం పొందాలని రాజధాని రైతులకు కమలానంద సూచించారు.

# ఒక రాష్ట్రం.. 3 రాజధానులు

రాజధాని పడవ.. ఏ తీరానికో!



మందడంలో పడవలో కూర్చుని నిరసన తెలుపుతున్న మహిళలు, పిల్లలు





తుళ్లూరులో మోదీ చిత్రపటాలతో ఆందోళన చేస్తున్న మహిళలు, చిన్నారులు, రైతులు

## బచావో మోదీ..

మందడం ప్రధాన రహదారికి అడ్డుగా ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జనసేన అధినేత పవన్ కల్యాణ్, గౌతమబుద్ధుడి ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. 'మోదీజీ అమరావతి బచావో' అంటూ నినాదాలు చేశారు. తమ గోడు కేంద్ర పట్టించుకోవాలని ప్రాధేయపడ్డారు. రాజధాని మునిగిపోతుందంటూ మంత్రులు చేసిన ప్రకటన నేపథ్యంలో ఇక్కడి మహిళలు రోడ్డుపై పడవ ఎక్కి నిరసన తెలిపారు. మునిగిపోయే రాజధాని అంటూ తమను నిలువునా ముంచేశారని మండిపడ్డారు. 'దున్నపోతు పాలన మాకొద్దు' అంటూ మందడంలో రైతులు దున్నపోతుకు పాలు తీస్తున్నట్లు వినూత్నంగా నిరసన తెలియజేశారు.

## 27లోగా బీసీజీ నివేదిక!

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాజధానిని వికేంద్రీకరించాలని జీఎన్ రావు కమిటీ సిఫారసు చేసిన నేపథ్యంలో... బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్(బీసీజీ) నివేదికపై ఇప్పుడు అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఈ నెల 27న కేబినెట్ సమావేశం ఉంది. జీఎన్ రావు కమిటీపై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ లోపే బీసీజీ నివేదిక కూడా వస్తుందని సమాచారం. ఈ రెండింటిపైనా కేబినెట్‌లో చర్చించి రాజధానుల వికేంద్రీకరణపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశముందని అంటున్నారు. అమెరికాలోని బోస్టన్ ప్రధాన కేంద్రంగా పని చేసే బీసీజీ 1963 నుంచి ప్రపంచవ్యాప్తంగా మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ కంపెనీగా ప్రసిద్ధి చెందింది. 50 దేశాల్లో 90కిపైగా కార్యాలయాలు, సుమారు 14వేల మంది ఉద్యోగులను ఈ సంస్థ కలిగి ఉంది. రాజధాని నిర్మాణంపై సవివరమైన నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కొంతకాలం క్రితం బీసీజీని కోరింది. ఈ మేరకు తన అధ్యయనాన్ని చేపట్టిన బీసీజీ ఇప్పటికే కొన్ని కీలక సూచనలతో మధ్యంతర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించినట్లు సమాచారం. రాజధాని వికేంద్రీకరణ జరిగితే రైతులకు కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్ల విలువలు పడిపోకుండా ఉండేలా చర్యల గురించి సూచించినట్లు తెలుస్తోంది. విజయవాడను రాజధాని ప్రాంతంతో అనుసంధానించేందుకు కృష్ణానదిపై వివిధ ప్రదేశాల్లో కొత్త వంతెనలు నిర్మించాలని పేర్కొంది. రాజధాని భూములకు డిమాండ్ పడిపోకుండా ఉంటాయని పేర్కొన్నట్లు సమాచారం.

### కార్యనిర్వాహక రాజధాని భీమిలి

▸▸ త్వరలో 25 జిల్లాలు: విజయసాయి



విశాఖపట్నం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 13 జిల్లాల స్థానంలో 25 జిల్లాలు రానున్నాయని, ఆ దిశగా సీఎం జగన్ ఆలోచన చేస్తున్నారని వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి చెప్పారు. శనివారం విశాఖ నగరంలో నిర్వహించిన జగన్ పుట్టినరోజు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రాంతాల కు సమాన న్యాయం చేయాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకొచ్చారని అన్నారు. దీనివల్ల విశాఖకు కార్యనిర్వాహక రాజధాని వస్తుందని, భీమిలి నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తామని, భూముల కోసం సర్వే జరుగుతోందన్నారు.

### ఉమా సై అనలేదు: కృష్ణ ప్రసాద్



మైలవరం, డిసెంబరు 21: అమరావతిలోనే రాజధాని ఉండాలని బలంగా కోరుకునేవాళ్లలో తానూ ఒకడినని మైలవరం వైసీపీ ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. ఈ ప్రాంతవాసిగా రాజధాని తరలిపోవడం బాధగానే ఉందన్నారు. గతంలో రాజధాని తరలిపోతోందని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు చేసిన వ్యాఖ్యలను వసంత ఖండించారు. రాజధాని తరలిపోతే తన శాసనసభ్యత్వానికి రాజీనామా చేస్తానని, రాజధాని ఇక్కడే ఉంటే రాజకీయ జీవితం నుంచి ఉమ శాశ్వతంగా తప్పుకోవాలని వసంత సవాల్ విసిరారు. మూడు రాజధానుల ప్రకటనతో వసంత చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీనిపై శనివారం వసంత స్పందించారు. తన సవాల్‌ను ఉమ స్వీకరించలేదని, అలాంటప్పుడు తన రాజీనామాను డిమాండ్ చేసే హక్కు ఆయనకు లేదన్నారు.

### బాబుపై కక్షతోనే..!: సీపీఐ



గుంటూరు తూర్పు, డిసెంబరు 21: మాజీ సీఎం చంద్రబాబుపై కక్షతోనే రాజధానిని మారుస్తున్నట్టు కనిపిస్తోందని, ఇలాంటి నిర్ణయాలు అభివృద్ధికి ఎంతమాత్రమూ దోహదం చేయజాలవని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. శనివారం సీపీఐ 94వ వార్షికోత్సవం సందర్భంగా గుంటూరులో జరిగిన బహిరంగ సభలో పార్టీ సీనియర్ నేత, జాతీయ కార్యవర్గ సభ్యుడు కె.నారాయణ మాట్లాడుతూ, కేవలం ఒక వ్యక్తిపై కక్షతో అమరావతిని మార్చడం సరైన నిర్ణయం కాదన్నారు. చంద్రబాబు అమరావతిలో 33 వేల ఎకరాలు తీసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరలేపితే, జగన్ రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేసి మరిన్ని వ్యాపారాలకు తెరదీస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో టీడీపీ, వైసీపీల మధ్య మల్లయుద్ధం జరుగుతోందన్నారు. ఈ యుద్ధంలో ఉండమంటే తాను రిఫరీగా ఉంటానని వ్యంగస్త్రాలు సంధించారు. కాగా, అసెంబ్లీ ఒకచోట, సెక్రటేరియట్ ఇంకోచోట, హైకోర్టు మరోచోట అంటూ బుద్ధి, జ్ఞానం ఉన్న వాడు ఎవడూ ఇలాంటి ప్రకటన చేయడని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సీఎం జగన్‌పై ధ్వజమెత్తారు. నియంతలు పాలించిన దక్షిణాఫ్రికాను ఆదర్శంగా తీసుకుని సీఎం కూడా నియంత అనిపించుకున్నారని దుయ్యబట్టారు.

# నివేదికపై నిప్పులు

(మొదటి పేజీ తరువాయి)

పాలు తీస్తూ మరికొందరు సర్కారును సవాల్ చేశారు. అర్ధనగ్న ప్రదర్శనలు, రిలే దీక్షలు, రాస్తారోకోలు, మహాధర్నాల్లో మహిళలు, పిల్లలు భారీగా పాల్గొన్నారు. చాలామంది తల్లులు తమ బిడ్డలను ఎత్తుకొని ఆందోళనల్లో పాల్గొనడం కనిపించింది. 'ముందు రైతుతనం..ఆ తరువాతే పార్టీ అభిమానం' అన్నట్టు వైసీపీకి మద్దతు ఇచ్చే రైతులూ కలిసిరావడం ఆందోళనలను మరింత మండించింది. గ్రామ సచివాలయానికి వేసిన వైసీపీ జెండా రంగులను నలుపు చేసి వీరు 'జీఎన్ రావు డౌన్ డౌన్' అంటూ నినదించారు.

### ఊళ్లకు ఊళ్లే కదిలె..

నిరసనల పరంపరలో నాలుగో రోజు రైతుల పిలుపు మేరకు రాజధాని గ్రామాల దిగ్బంధనం కొనసాగింది. జీఎన్ రావు కమిటీ నివేదికకు నిరసనగా ఇచ్చిన ఈ పిలుపునకు ఊళ్లకు ఊళ్లే కదిలాయి. తాడికొండ అడ్డరోడ్డులో ఉదయం స్థానికులు రాస్తారోకో నిర్వహించారు. రాయపూడిలో సీడ్ యాక్సిస్ రోడ్డుపై అర్ధనగ్నంగా కొందరు బైఠాయించారు. తుళ్లూరు, పెదపరిమి, మందడం వద్ద రోడ్డుపైనే వంటావార్పు చేపట్టారు. మంగళగిరి మండలం కురగల్లులో రైతులు తమ కుటుంబసభ్యులతో రోడ్డుపై బైఠాయించారు. నీరుకొండ కొండవీటివాగు వంతెన వద్ద రైతులు ఉద్యమించారు. దీంతో ఈ మార్గంలో కిలోమీటర్ల మేర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వెలగపూడిలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. తుళ్లూరులో మహాధర్నా చేపట్టిన రైతులు.. సచివాలయానికి వెళ్లేమార్గంలో వాహనాలను రోడ్డుకు అడ్డంగా నిలిపి నిరసన తెలిపారు.

### జేఏసీగా పోరు ఉధృతం

ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసిన రాజధాని అమరావతిని జగన్ ఎలా మారుస్తారని మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు నిలదీశారు. రాయపూడి, తుళ్లూరు, వెలగపూడిలోని నిరసన శిబిరాలను ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడితో కలిసి ఆయన సందర్శించారు. రైతులకు మద్దతుగా దీక్షల్లో కూర్చున్నారు. కుక్కని చంపాలంటే పిచ్చికుక్క అని ముద్ర వేసినట్టుగా రాజధాని ముంపు అని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బర్త్ డే రైతులు రోడ్డుపై కన్నీరు పెడుతుంటే సీఎం విమానంలో కేక్ కట్ చేసుకున్నాడని బచ్చుల అర్జునుడు ధ్వజమెత్తారు. టీడీపీ నేతలు ధూళిపాళ్ల నరేంద్ర, తెనాలి శ్రావణ్ కుమార్ రైతుల దీక్షల్లో పాల్గొన్నారు. అంతా కలిసి జేఏసీగా ఏర్పడాలని, ప్రతి ఇంటి నుంచి ఒకరు చొప్పున జేఏసీలో భాగస్వామ్యమై పోరును ఉధృతం చేయాలని వారు రైతులకు దిశానిర్దేశం చేశారు. రాజధాని అమరావతి కోసం కేంద్రంతో మాట్లాడటంతో పాటు.. కోర్టులను ఆశ్రయించి రాజధానిని సాధించుకుందామన్నారు.

### లాయర్లూ కదిలారు.

రాజధానిపై ప్రభుత్వ నిర్ణయంతో ఆందోళనకు దిగిన రైతులకు న్యాయవాదులు మద్దతు తెలిపారు. రైతులను మోసం చేసినందుకు ప్రభుత్వంపైనా, జీఎన్‌రావు కమిటీపైనా పోలీసుస్టేషన్‌లో కేసు పెడుతున్నామని హైకోర్టు న్యాయవాది లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మరోవైపు తుళ్లూరులో రాజధాని రైతులకు జిల్లా న్యాయవాదులు మద్దతు పలికారు. రైతులకు సంఘీభావంగా 23, 24 తేదీల్లో విధులు బహిష్కరణకు నిర్ణయించినట్లు న్యాయవాదుల సంఘ నేతలు తెలిపారు.



### సార్లూ.. సహకరించండి

హైదరాబాదు నుంచి ఉద్యోగులు అమరావతికి పరిపాలనను ప్రారంభించాలని గతంలో అనుకున్నప్పుడు అన్ని విధాలుగా బాసటగా నిలిచామని రాజధాని రైతులు అన్నారు. ఇప్పుడు తమకు కష్టం వచ్చిందని.. అప్పటి మా సహకారాన్ని గుర్తుపెట్టుకొని మాకు అండగా నిలవాలని ఉద్యోగ వర్గాలను వారు కోరారు. "మొదటిసారిగా రాజధాని పర్యటనకు వచ్చినప్పుడు మేము వెంట ఉంటామని హామీ ఇచ్చాం. అదేవిధంగా ఇప్పటివరకు ఉన్నాం. ఇప్పుడు రాజధానిని మార్చే యత్నం ప్రభుత్వం చేస్తోంది. దీనిపై స్పందించండి. మా ప్రాణ సమానమైన భూములు ఇచ్చాం. అక్కడ మీకు అనువైన భవనాలు కట్టారు. నేడు మేము అయోమయ పరిస్థితిలో ఉన్నాం. మాకు బాసటగా నిలవండి" అంటూ రాజధాని రైతులు ప్రభుత్వ ఉద్యోగులను అభ్యర్థిస్తున్నారు.



మల్కాపురం గ్రామంలో వైసీపీ రంగులు వేసిన కార్యాలయానికి నల్ల రంగు పూస్తున్న ఆందోళనకారులు

### రంగు పడింది..

నమ్మి ఓట్లు వేశాం... పాదయాత్రలో మీరు చెప్పిన మాటలు విని మీకు అండగా నిలిచాం.. మీరు మా కడుపుపైన కొడుతున్నారు అంటూ వైసీపీ కార్యకర్తలు రాజధాని ప్రాంతంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 8.30 నిమిషాలకు వెలగపూడి రిలే నిరాహార దీక్షా శిబిరంలో అందరితోపాటు వారు కూర్చున్నారు. ఆవేశం పట్టలేక గ్రామ సచివాలయం వద్దకు వెళ్లారు. నిచ్చెనలు వేసి మరీ పైకి ఎక్కారు. 'మాకు అన్యాయం చేయాలనుకుంటున్న పార్టీ రంగులు మాకెందుకు' అంటూ నలుపురంగు పూయనారంభించారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన వచ్చి వారించబోయారు. అయినా, లెక్క చేయకుండా నలుపురంగు వేసేందుకు సిద్దపడ్డారు. ఈ దశలో పోలీసులు.. వారి చేతుల్లో ఉన్న రంగు డబ్బాలను లాక్కున్నారు. ఈ తోపులాటలో పోలీసులపై రంగు పడింది. ఈ విషయం 10.30 గంటలకల్లా మిగతా గ్రామాలకు పాకిపోయింది. తుళ్లూరులోనూ ఇదే విధంగా వైసీపీ కార్యకర్తలు గ్రామ సచివాలయంపై దాడిచేశారు. ఆ భవనానికి రంగులు పూయడం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని వారించారు. అయినా లెక్క చేయకుండా కొంత భాగం నలుపు రంగు పూయగా పోలీసులు బలవంతంగా వారి వద్ద రంగు డబ్బాలు లాక్కున్నారు. మందడంలో ఉదయం 11 గంటల సమయంలో మూకుమ్మడిగా వైసీపీ శ్రేణులు ఒక్కసారిగా గ్రామ సచివాలయం వైపు వెళ్లి రంగులు పూయడం ప్రారంభించారు. గ్రామ కార్యదర్శి అడ్డుకొన్నప్పటికీ లెక్క చేయలేదు. పోలీసులు వారిని అడ్డుకుని తరిమారు. ఈ మూడు ఘటనల్లోనూ పోలీసులు కేసు నమోదు చేశారు. 'వైసీపీకి ఎందుకు ఓటు వేశాం బాబూ' అంటూ మల్కాపురంలో మహిళలుగ్రామ సచివాలయం వద్ద చేరుకొన్నారు. అక్కడున్న సీఎం జగన్ బొమ్మకు రంగులు పూసి తీవ్ర స్థాయిలో నిరసనలు తెలిపారు.

## రాజధాని రక్షణకు.. జేఏసీ

▸▸ రాజధానిని తరలించడంపై సర్కార్‌కు 2రోజుల డెడ్‌లైన్

▸▸ లేదంటే ప్రత్యక్ష కార్యాచరణే.. క్రెడాయ్, ఐలా హెచ్చరిక

విజయవాడ సిటీ, డిసెంబరు 21: వికేంద్రీకరణ ముసుగులో రాష్ట్ర రాజధానిని అమరావతి నుంచి తరలించడాన్ని అమరావతి పరిరక్షణ సమితి పేరుతో ఆవిర్భవించిన జేఏసీ ఖండించింది. ఇంత జరుగుతున్నా రాజధాని ఎమ్మెల్యేలు నోరు మెదపకుండా చేతులు ముడుచుకు కూర్చోవడం దారుణమని జేఏసీ నాయకులు మండిపడ్డారు. రాజధానిని తరలించవద్దంటూ రాజధాని ప్రాంతంలోని కార్మికులు, వర్తక, వాణిజ్య, నిర్మాణ రంగానికి చెందిన సంస్థలు, ప్రజాసంఘాలు కలిసి సంయుక్తంగా అమరావతి పరిరక్షణ సమితి జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ)ని ఏర్పాటు చేశాయి. శనివారం విజయవాడలో జరిగిన ఈ కార్యక్రమంలో 'క్రెడాయ్' అధ్యక్షుడు శివారెడ్డి, 'ఐలా' అధ్యక్షుడు సుంకర దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అమరావతి నుంచి రాజధాని తరలింపును రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా వ్యతిరేకించాలని, లేదంటే భావితరాలు క్షమించవని వారు పేర్కొన్నారు. రాజధాని తరలింపు అనే అనాలోచిత నిర్ణయాన్ని తక్షణమే సీఎం జగన్ విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోని పక్షంలో కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు పిల్లి నరసింహారావు, వెంకటసుబ్బారావు, క్రెడాయ్ నగర అధ్యక్ష,కార్యదర్శులు ఆర్‌వీ స్వామి, డీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సమాధానం చెప్పాలి: పురందేశ్వరి



అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణం కోసం రైతులు అప్పటి ప్రభుత్వానికి భూములిచ్చారు తప్ప తెలుగుదేశం పార్టీకి ఇవ్వలేదని బీజేపీ మహిళా మోర్చా జాతీయ నాయకురాలు పురందేశ్వరి అన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా రాజధాని ప్రాంత రైతులకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి వీల్లేని విధంగా భూములను మార్చేసి ఇప్పుడు వెనక్కి ఇచ్చేస్తామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి లాంటివారు మాట్లాడటం సహేతుకం కాదన్నారు. అమరావతి ప్రాంత రైతులు శనివారం విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో ఆమెతో భేటీ అయ్యారు. రైతుల బాధలు విన్న పురందేశ్వరి ప్రభుత్వ తీరును ఆక్షేపించారు. రాష్ట్రాభివృద్ధి కోసం కమిటీని నియమించి నివేదిక కోరిన ప్రభుత్వం అందులో ఏముందో బహిర్గతం చేయకుండా ప్రజల్లో ఆయోమయం సృష్టిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నది బీజేపీ అభిప్రాయమని, అయితే ప్రగతి వికేంద్రీకరణ, పాలన వికేంద్రీకరణ ఒక్కటిగా చూడలేమన్నారు. రైతులకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత చంద్రబాబుపైనా ఉందన్నారు.

### అది జగన్మోహన్‌రెడ్డి కమిటీ: విష్ణువర్ధన్ రెడ్డి

రాజధానిపై ప్రభుత్వం ఏర్పాటు చేసింది జీఎన్ రావు కమిటీ కాదని, అది జగన్మోహన్ రెడ్డి కమిటీ అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి విజయవాడలో అన్నారు. సీఎం ప్రకటన ప్రతిపక్ష టీడీపీని గందరగోళంలోకి నెట్టేలా ఉంది తప్ప ప్రజలకు ఏమాత్రం ఉపయోగకరంగా లేదన్నారు.

## మార్పు శరాఘాతం: సీపీఎం

▸▸ ప్రభుత్వం మారితే.. మారుస్తారా?: కార్యదర్శివర్గం ధ్వజం

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా రాజధానులు మార్చడం మంచి సంప్రదాయం కాదని, అభివృద్ధికి ఇది గొడ్డలి పెట్టువంటిదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గం అభిప్రాయపడింది. శనివారం విజయవాడలో కార్యదర్శివర్గ సభ్యులు భేటీ అయి పలు తీర్మానాలు చేశారు. రాజధాని మార్పు రాష్ట్రాభివృద్ధికి తీరని విఘాతమని నాయకులు అభిప్రాయపడ్డారు. సొంత రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రజల మనోభావాలతో చెలగాటమాడడం మంచిది కాదని తేల్చిచెప్పారు. వికేంద్రీకరణ అంటే అభివృద్ధి పనులను వెనుకబడిన ప్రాంతాలకు తరలించడం, ఇరిగేషన్ ప్రాజెక్టులకు ప్రాధాన్యతనివ్వడం, స్థానిక సంస్థలకు ఎక్కువ అధికారాలు, నిధులు కేటాయించడమని పేర్కొన్నారు. కానీ, పాలనా వికేంద్రీకరణ పేరుతో రోజువారీ పరిపాలనను అస్తవ్యస్తం చేసుకోకూడదన్నారు. జీఎన్ రావు కమిటీ సిఫారసులు కొత్త వివాదాన్ని సృష్టించాయని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలన్నారు. మంత్రివర్గం ఒకచోట, సెక్రటేరియట్ మరోచోట ఉంటే సమన్వయ సమస్యలొస్తాయని, ఈ ప్రతిపాదనతో సీపీఎం విభేదిస్తోందన్నారు. హైకోర్టు కర్నూలులో, అమరావతి, విశాఖల్లో బెంచ్‌లు పెట్టడం సమర్థనీయమని తీర్మానించారు.

## సీమలో రాజధాని పెట్టాలి

▸▸ లేకపోతే.. ఢిల్లీ దాకా పోరాటం: రాయలసీమ హక్కుల కమిటీ లేఖ

అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాజధానిని రాయలసీమలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రాయలసీమ హక్కుల కమిటీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి శనివారం బహిరంగ లేఖ రాసింది. హైకోర్టు ఏర్పాటుతో సీమకు ఒరిగేదేమీ లేదని.. ఆదాయం, ఉపాధినిచ్చే రాజధానిని ఇవ్వకుండా హైకోర్టు ఇచ్చి చేతులు దులుపుకోవడం సరైన విధానం కాదని కమిటీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమిరెడ్డి రాంగోపాలరెడ్డి, మద్దిపట్ల సూర్యప్రకాశ్ ఆ లేఖలో స్పష్టం చేశారు. 'రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతం రాయలసీమ. ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాలు మిగతా ప్రాంతాలతో పోల్చితే దిగువన ఉన్నాయి. వెనుకబాటుతనం, నిరక్షరాస్యత ఎక్కువ. అప్పట్లో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుతో సీమకు తీవ్ర నష్టం వాటిల్లింది. అప్పటి ప్రభుత్వాలు హైదరాబాద్‌ను రాజధానిగా చేశాయి. 2014లో రాష్ట్ర విభజన తర్వాత కూడా శ్రీబాగ్ ఒప్పందాన్ని కాదని రాజధానిని రాయలసీమలో కొనసాగించకుండా అన్యాయం చేశారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే.. తిరిగి రాయలసీమలో రాజధానిని ఏర్పాటు చేయాలి. సీమ ప్రజలతో రాజకీయ ఆటలాడితే సంహించేది లేదు. కర్నూలు కొండారెడ్డి బురుజు నుంచి ఢిల్లీ పార్లమెంటు దాకా పోరాటం చేసేందుకు సిద్ధం' అని వారు లేఖలో హెచ్చరించారు.

## నాడు సోనియా.. నేడు జగన్

▸▸ పుట్టిన రోజున రాష్ట్రం, రాజధాని విభజన: చినరాజప్ప, ఉమా



అమలాపురం, విజయవాడ వన్‌టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): 'నాడు సోనియాగాంధీ పుట్టినరోజున రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేశారు. ఇప్పుడు సీఎం జగన్ పుట్టినరోజు సందర్భంగా రాజధానిని మూడు ముక్కలుగా విభజించారు.' అని టీడీపీ సీనియర్ నేత చినరాజప్ప అమలాపురంలో విమర్శించారు. జీఎన్ రావు కమిటీ రాష్ట్రంలో ఎక్కడా పర్యటించిన దాఖలాలు లేవన్నారు. ఆ కమిటీ ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వానికి నివేదించకముందే సీఎం జగన్ అసెంబ్లీలో ప్రస్తావించడం పట్ల రాజప్ప అనుమానాలు వ్యక్తం చేశారు. అది జీఎన్ రావు కమిటీ కాదని... జగన్మోహన్‌రెడ్డి కమిటీ అని దేవినేని ఉమ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతికి మద్దతుగా 5 కోట్ల మంది ప్రజలు రోడ్డుమీదకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, సీఆర్‌డీఏ లాంటి బలమైన చట్టంతో ప్రభుత్వ మెడలు వంచైనా అమరావతిని కాపాడుకుంటామన్నారు. వచ్చేవారం నుంచి ఒకవైపు న్యాయ పోరాటం, మరోవైపు ధర్మపోరాటం చేసి అమరావతిని కాపాడుకుంటామని జగన్‌కు సవాలు విసిరారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బొండా ఉమా కూడా పాల్గొన్నారు. కాగా, 'రాజధాని లేని రాష్ట్రం కోసం ఎంతో త్యాగం చేసి 33వేల ఎకరాల భూములను రాజధాని నిర్మాణం కోసం ఇచ్చిన రైతులకు తన జన్మదినం సందర్భంగా గొప్ప బహుమతి ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గారికి హార్దిక జన్మదిన శుభాకాంక్షలు' అని ఎద్దేవా చేస్తూ ఎంపీ నాని ట్వీట్ చేశారు.

### ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టేందుకే..: అఖిలప్రియ

కర్నూలు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 13 జిల్లాల మధ్య చిచ్చు పెట్టడానికి సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని, మూడు రాజధానులను ప్రకటించి ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ విమర్శించారు. శనివారం ఆమె కర్నూలులో మాట్లాడుతూ కర్నూలుకు హైకోర్టు ఇచ్చి జగన్ చేతులు దులుపుకొంటున్నారని అఖిలప్రియ అన్నారు. పెండింగ్‌లో ఉన్న నీటి పారుదల ప్రాజెక్టులు, పరిశ్రమలు, నిరుద్యోగుల విషయంలో ఎలాంటి ప్రస్తావన లేదన్నారు. రాయలసీమలో మెజార్టీ సంఖ్యలో ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్నా ఈ విషయంపై పోరాడగలరా అని ఆమె ప్రశ్నించారు. హైకోర్టు బెంచ్‌ను గతంలోనే చంద్రబాబు ప్రకటించగా, ఇపుడు జగన్ ప్రకటనతో ఒరిగిందేమీ లేదన్నారు. విశాఖను పరిపాలనా రాజధాని చేస్తే ఇక్కడి నుంచి అక్కడ వరకు సామాన్యులు వెళ్లాలంటే సాధ్యమయ్యే పనికాదన్నారు.

### రాజధానిలో రైతులపై ఆరు కేసులు

గుంటూరు, డిసెంబరు 21 : రాజధానిలో మూడు రోజులుగా జరుగుతున్న ఆందోళన నేపథ్యంలో రైతులపై పోలీసులు ఆరు కేసులు నమోదు చేశారు. రాజధాని పరిధిలో 144వ సెక్షన్, 30 పోలీసు యాక్టు అమల్లో ఉన్నప్పటికీ మల్కాపురం జంక్షన్‌లో ధర్నాలో ఎక్కువ మంది గుమ్మిగూడడమే కాక ఎంతచెప్పినా వినకుండా రాజధాని రైతులు పోలీసులతో గొడవపడి వాగ్వాదానికి దిగారని రూరల్ ఎస్పీ విజయరావు తెలిపారు. బారికేడ్‌లు పడేసిన ఘటనలను సీసీ ఫుటేజీలు, వీడియోలు, బాడీవోన్ కెమెరాల ద్వారా చిత్రీకరించినట్లు రూరల్ ఎస్పీ తెలిపారు. సెక్రటేరియట్ వైపు దూసుకెళ్ళి ప్రవేశద్వారం వద్ద పోలీసు అధికారులు, సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన వారిపై రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పలు పంచాయతీ కార్యాలయాలకు నలుపురంగు వేసిన వ్యక్తులపై మూడు కేసులు నమోదు చేశామన్నారు. తుళ్ళూరులోని నీటిపైపులైన్ వద్ద సిబ్బందిని భయపెట్టి.. నీటి సరఫరాను అడ్డుకొన్న ఘటనలో మరో కేసు పెట్టామన్నారు.

## మూడు రాజధానులు.. భేష్

▸▸ వికేంద్రీకరణతోనే అభివృద్ధి సాధ్యం.. ప్రజల్లో అపోహలను తొలగించాలి

▸▸ రాష్ట్రాభివృద్ధికి జగన్ కృషి చేస్తారు: చిరంజీవి



అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడు రాజధానులు ఏర్పాటు చేయాలన్న యోచనను కేంద్ర మాజీమంత్రి, కాంగ్రెస్ నేత కొణిదెల చిరంజీవి స్వాగతించారు. అధికార, పాలనా వికేంద్రీకరణతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. గతంలో శ్రీకృష్ణ కమిటీ, శివరామకృష్ణన్ నివేదిక, ప్రస్తుత జీఎన్‌రావు కమిటీ ఇదే విషయాన్ని స్పష్టం చేశాయన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి సీఎం జగన్ ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అమరావతిని శాసన నిర్వాహక, విశాఖను కార్య నిర్వాహక, కర్నూలును న్యాయపరిపాలనా రాజధానులుగా మార్చే ప్రభుత్వ యోచనను అందరూ స్వాగతించాలని శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో చిరంజీవి కోరారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు నిపుణుల కమిటీ చేసిన సిఫారసులు సామాజిక, ఆర్థిక అసమానతలు తొలగించేవిగా ఉన్నాయని ప్రశంసించారు. గతంలో అభివృద్ధి, పరిపాలన అంతా హైదరాబాద్‌లోనే కేంద్రీకృతమైందని, రాష్ట్ర విభజన తర్వాత రిక్తహస్తాలతో అమరావతికి చేరుకున్న ఆంధ్రులు తిరిగి పాత తప్పులను పునరావృతం చేస్తే భావితరాలు క్షమించవని హెచ్చరించారు. ఇప్పటికే రూ.3లక్షల కోట్ల అప్పుల్లో ఉన్న రాష్ట్రంలో ఇంకో రూ.లక్ష కోట్ల అప్పుతో అమరావతిని నిర్మిస్తే ఉత్తరాంధ్ర, రాయలసీమ పరిస్థితి ఏమిటన్న ఆందోళన అందరిలోనూ ఉందన్నారు. సాగు, తాగునీరు, ఉపాధి అవకాశాలు లేక ఊళ్లు విడిచిపోతున్న వలస కూలీల బిడ్డల భవిష్యత్తుకు, నిరుద్యోగులకు మూడు రాజధానుల ఆలోచన భద్రతను ఇస్తుందన్నారు. రాజధాని రైతుల్లో నెలకొన్న భయాందోళనలు, అభద్రతా భావాన్ని తొలగించాలని, వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజధాని సహా అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం నిపుణుల కమిటీ సూచించిన వ్యూహాన్ని జగన్ అమలు చేస్తారని, రాష్ట్రం సర్వతోముఖంగా అభివృద్ధి చెందుతుందని చిరంజీవి ప్రగాఢ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

## రాజధానిపై గందరగోళం

▸▸ కేబినెట్‌లో చర్చ తర్వాతే జనసేన నిర్ణయం: పవన్



అమరావతి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాజధానిపై జీఎన్ రావు కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన తరువాత రాష్ట్ర ప్రజల్లో అయోమయం, గందరగోళం నెలకొన్నాయని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ పరిస్థితి శ్రేయస్కరం కాదన్నారు. కేబినెట్‌లో నివేదికపై సమగ్రంగా చర్చిస్తామని మంత్రులు ప్రకటిస్తున్నారని గుర్తుచేశారు. మంత్రివర్గ నిర్ణయం తరువాత ఈ విషయంపై జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీలో చర్చించి, పార్టీ నిర్ణయాన్ని ప్రజల ముందు ఉంచుతామన్నారు. అభివృద్ధి అంటే నాలుగు ప్రభుత్వ కార్యాలయాలనో, నాలుగు భవనాలనో భావించడం లేదన్నారు. వెనుకబడిన ప్రాంతాల తక్షణ అభివృద్ధిని, రాజకీయ జవాబుదారీతనాన్ని తమ పార్టీ కోరుకుంటోందని పవన్ స్పష్టం చేశారు.

# యూపీ రక్తసిక్తం


కాన్పూర్‌లో వాహనాలను దగ్ధం చేస్తున్న ఆందోళనకారులు



సీఏఏకు మద్దతుగా థానేలో బీజేపీ, రాష్ట్రీయ మత్‌దాతా మంచ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ


పట్నాలో రైలును ఆపిన ఆర్జేడీ కార్యకర్తలు

## వాళ్లే కాల్చుకున్నారు: యూపీ డీజీపీ

లఖ్‌నవూ, డిసెంబరు 21: ఉత్తర ప్రదేశ్‌లో సీఏఏ వ్యతిరేక నిరసనల్లో జరిగిన కాల్పులు, ప్రాణనష్టంపై ఆ రాష్ట్ర డీజీపీ ఓపీ సింగ్ సంచలన ప్రకటన చేశారు. నిరసనకారులపై తాము కాల్పులు జరపలేదని తెలిపారు. ఆందోళనకారులు తుపాకులతో పరస్పరం జరుపుకొన్న కాల్పుల్లోనే ప్రాణ నష్టం జరిగిందన్నారు.

## ముస్లింలను చేర్చాలి: అకాలీదళ్

న్యూఢిల్లీ, డిసెంబరు 21: బీజేపీ మరో మిత్రపక్షం శిరోమణి అకాలీదళ్(ఎస్ఏడీ) కూడా పౌరసత్వ సవరణ చట్టానికి(సీఏఏ) వ్యతిరేకంగా గళమెత్తింది. మతం ప్రాతిపదికగా వివక్ష చూపితే సహించబోమని ఎస్ఏడీ చీఫ్ సుఖ్‌బీర్ సింగ్ బాదల్ శనివారం హెచ్చరించారు. సీఏఏ పరిధిలోకి ముస్లింలను కూడా తీసుకురావాలని డిమాండ్ చేశారు.

## అందరికీ న్యాయం... కావాలి నినాదం

- పేద, అణగారిన వర్గాలే లక్ష్యం.. నల్సా బలోపేతం కావాలి
- జిల్లాల్లో న్యాయసేవల అమలుకు కమిటీలు: జస్టిస్ ఎన్వీ రమణ



న్యూఢిల్లీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయ సేవల సంస్థ (నల్సా) ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన రెండు వారాల్లోపే సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ .. సామాన్యులకు సత్వర న్యాయం  అందేందుకు, అన్యాయంగా వారు శిక్షలు ఎదుర్కోకుండా చూసేందుకు పకడ్బందీ చర్యలకు నడుంకట్టారు. 1987లో ఏర్పాటైన నల్సా  అనుకున్న రీతిలో పనిచేయడం లేదని గ్రహించి యుద్ధ ప్రాతిపదికన వ్యవస్థల్ని మెరుగుపరిచేందుకు చర్యల్ని ప్రారంభించారు. నల్సాలో పేరుకున్న జడత్వాన్ని రూపుమాపేందుకు ఆయన అనూహ్యమైన రీతిలో కార్యనిర్వాహక ఛైర్ పర్సన్లు, రాష్ట్రాలన్యాయ సేవల అథారిటీల సభ్య కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పేదలకు, అణగారిన వర్గాలకు న్యాయ సేవలు అందించే వ్యవస్థను బలోపేతం చేయాలని, పేదలకు అనుకూలంగా ఆలోచించే విధంగా న్యాయవాదులకు శిక్షణా కార్యక్రమాలను రూపొందించాలని, నల్సా మార్గదర్శక సూత్రాలను జిల్లాల స్థాయిలో సమర్థంగా అమలు చేసేందుకు కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయన ఈ వీడియా సదస్సులో ఆదేశాలు జారీ చేశారు.  "అందరికీ పూర్తి న్యాయం" అన్నదే నినాదం కావాలని ఆయన నిర్దేశించారు. "అరెస్టుకు ముందు, అరెస్టు అయిన తర్వాత, రిమాండ్ దశల్లో పేదలకు న్యాయ సహాయం అందించడం మన కర్తవ్యం కావాలి. ఒక వ్యక్తిని పోలీసుస్టేషన్ కు పిలిపించిన దశ నుంచీ సమర్థమైన న్యాయసహాయం అందించినపుడే ఆ వ్యక్తికి న్యాయవ్యవస్థపై నమ్మకం కుదురుతుంది. ఇందుకోసం ముందుగా న్యాయవాదులకు అరెస్టు, రిమాండ్, చట్టాల గురించి శిక్షణ నివ్వాలి.  అప్పీళ్లు దాఖలు చేసేందుకు శిక్షపడ్డ వారికి కూడా న్యాయ సహాయం అందించాలి" అని జస్టిస్ రమణ సూచించారు. ఇందుకు 17 జిల్లాలను పైలట్ ప్రాతిపదికన ఈ సదస్సులో ఎంపిక చేశారు. నల్సాకు మాత్రమే కాదు, రాష్ట్రాల న్యాయ సేవల అథారిటీలు కూడా అనుసరించేందుకు వీలుగా ఆయన ఇప్పటికే ఓ దార్శనిక పత్రాన్ని (విజన్ 2020 డాక్యుమెంట్‌ను) విడుదల చేశారు.

(మొదటి పేజీ తరువాయి)

చేసుకుంది. కాన్పూర్‌లో నిరసనకారులు ఒక పోలీస్ ఔట్‌పోస్ట్‌కు నిప్పంటించారు. పరిస్థితి అదుపు తప్పుతుండటంతో ఆర్ఏఎఫ్ బలగాలను, వజ్ర వాహనాలను మోహరిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. సోమవారం వరకు మొబైల్ ఇంటర్నెట్‌ను బంద్ చేశారు. ఇక... రాంపూర్‌లో ఐదు వందల మంది ప్రదర్శనగా కదిలారు. అడ్డుకున్న పోలీసులపైకి రాళ్లు రువ్వారు. పోలీసులు లాఠీచార్జితోపాటు బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. ఈ అల్లర్లలో పదిమందికి పైగా పోలీసులు, ఐదుగురు ఆందోళనకారులు గాయపడ్డారు. లఖ్‌నవూలో ఇప్పటిదాకా 268 మందిని అరెస్టు చేశారు.  ఢిల్లీలోని జామియా మిలియా వర్సిటీ విద్యార్థులు మరోసారి నిరసనకు దిగారు. తొలుత కొందరు మహిళా విద్యార్థులతో మొదలైన నిరసన నిమిషాల్లోనే వందలమందికి చేరుకుంది. ఢిల్లీలో శనివారం పరిస్థితి అదుపులోకి వచ్చిందని, ఎక్కడికక్కడ బలగాలను మోహరించామని పోలీసులు తెలిపారు. సీఏఏ, ఎన్ఆర్‌సీకి వ్యతిరేకంగా శనివారం బిహార్‌లో ఆర్జేడీ బంద్‌కు పిలుపునిచ్చింది. దీంతో జన జీవితం స్తంభించిపోయింది. రహదారులు, రైల్వేట్రాక్‌లపై బైఠాయించారు. ఈ సందర్భంగా పలుచోట్ల హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. కేరళలో కాంగ్రెస్ పార్టీ 'రాజ్యాంగాన్ని రక్షించుకుందాం' అంటూ సీఏఏకు వ్యతిరేకంగా అనేక చోట్ల ఆందోళనలు నిర్వహించింది. ఈ నిరసనల్లో పార్టీ సీనియర్ నేతలు రమేశ్ చెన్నితాల, శశి థరూర్ తదితరులు పాల్గొన్నారు. మధ్యప్రదేశ్‌లో ఇప్పటిదాకా జరిగిన అల్లర్లకు సంబంధించి 35 మందిని అరెస్టు చేశారు. మహారాష్ట్రలో హింసాత్మక ఘటనలకు సంబంధించి 130 మందిపై కేసులు పెట్టారు. 20 మందిని అరెస్టు చేశారు. యూపీలోని ఘజియాబాద్‌లో సీసీ టీవీ దృశ్యాల ఆధారంగా 3500 మందిపై కేసులు పెట్టారు. వీరిలో ఇప్పటికి 300 మందిని అదుపులోకి తీసుకున్నారు. తమిళనాడులో 600 మందిపై కేసులు నమోదయ్యాయి.

### శాంతించిన ఈశాన్యం...

ఈశాన్య రాష్ట్రాల్లో పరిస్థితి అదుపులోకి వచ్చింది. అసోంలోని డిబ్రూగఢ్‌లో శనివారం పగటిపూట కర్ఫ్యూను సడలించారు. మేఘాలయలో మొబైల్ ఇంటర్నెట్  సేవలను ఎనిమిది రోజుల తర్వాత పునరుద్ధరించారు. పాత ఢిల్లీలోని దరియాగంజ్‌లో శుక్రవారం జరిగిన అల్లర్లకు సంబంధించి జైభీమ్ ఆర్మీ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆజాద్‌ను పోలీసులు శనివారంఅరెస్టు చేశారు. శుక్రవారం జామా మసీదు నుంచి జంతర్ మంతర్ వరకు ఆజాద్ ఆధ్వర్యంలో జై భీమ్ సంస్థ నిరసన ప్రదర్శన నిర్వహించింది. శుక్రవారమే పోలీసుల నుంచి తప్పించుకుని జామా మసీదులోకి వెళ్లిన ఆయన... శనివారం బయటికి వచ్చారు. రాగానే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

### యూపీలో హింస.. బెంగాల్ వాసుల పనే!

పౌరసత్వ చట్టాని (సీఏఏ)కి వ్యతిరేకంగా ఉత్తరప్రదేశ్‌లో జరిగిన హింసాత్మక ఘటనల వెనక పశ్చిమ బెంగాల్ వాసుల హస్తముందని ప్రాథమిక విచారణలో గుర్తించారు. లఖ్‌నవూలో ఆందోళనలు హింసాత్మకమవడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో పౌరులు మరణించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పెద్దఎత్తున హింస చెలరేగడానికి కారణం బెంగాల్‌కు చెందిన వ్యక్తులేనని పోలీసులు చెప్పారు. కోల్‌కతా నుంచి వచ్చిన ఆరుగురిని అరెస్టు చేశారు. హజరత్‌గంజ్‌లో హింసాత్మక ఘటనలు జరిగిన ప్రదేశంలో 11 మొబైల్ ఫోన్లు దొరికాయని, వాటిలో బెంగాలీలో మెసేజ్‌లు ఉన్నాయని తెలిపారు. లఖ్‌నవూలో జరిగిన హింసలో బయటి వ్యక్తుల ప్రమేయం ఎక్కువగా ఉందని, ఆ కోణంలో దర్యాప్తును ముమ్మరం చేశామని యూపీ డీజీపీ ఓ.పి.సింగ్ వెల్లడించారు.

### 1100 మంది విద్యావేత్తల మద్దతు

పౌరసత్వ సవరణ చట్టాన్ని(సీఏఏ) సమర్థిస్తూ దాదాపు 1100మంది విద్యావేత్తలు, వివిధ యూనివర్సిటీల్లోని పరిశోధక విద్యార్థులు ఒక ఉమ్మడి ప్రకటన చేశారు. ఈ చట్టంపై అనేక రాష్ట్రాల్లో ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రకటన రావడం విశేషం. రాజ్యసభ సభ్యుడు స్వపన్ దాస్‌గుప్తా, ఐఐఎం షిల్లాంగ్ ఛైర్మన్ శిశిర్ బజోరియా ఇంకా అనేక మంది మేధావులు, విద్యావేత్తలు దీనిపై సంతకం చేశారు.

### సీఏఏకు 62% అనుకూలం

**ఐఏఎన్ఎస్-సీవోటర్ సర్వే**

న్యూఢిల్లీ, డిసెంబరు 21: పౌరసత్వ సవరణ చట్టంపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఇంతకీ దీనిపై ప్రజలేమంటున్నారు? ఐఏఎన్ఎస్-సీ వోటర్ వారి అభిప్రాయాలు తెలుసుకుంది. సీఏఏకు తాము అనుకూలమని 62.1% మంది తేల్చిచెప్పారు. ఈ నెల 17-19 మధ్య దేశవ్యాప్తంగా 3 వేల మందిని సర్వే చేసింది. అదే సమయంలో అసోం, ఈశాన్య రాష్ట్రాలు, ముస్లిం వర్గాల నుంచి 500 మంది చొప్పున అభిప్రాయసేకరణ జరిపింది. సీఏఏను 36.8 శాతం మాత్రం వ్యతిరేకించారు.



### యడ్డి పరామర్శ

బెంగళూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని మంగళూరులో శనివారం కూడా కర్ఫ్యూ కొనసాగింది. శనివారం ఉదయం 6 నుంచి 8 వరకు రెండు గంటలు మాత్రమే కర్ఫ్యూను సడలించారు. నిషేధాజ్ఞలను కాదని నిరసనకు దిగిన కేరళకు చెందిన సీపీఐ రాజ్యసభ సభ్యుడు బినోయ్ విశ్వమ్‌తోపాటు పలువురు కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.  సీఎం యడియూరప్ప మంగళూరుకు వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. నిరసనకారులు ఠాణాలో ఆయుధాలున్న గదిని బద్దలుకొట్టేందుకు ప్రయత్నించడంతో కాల్పులు జరపక తప్పలేదని ఆయన చెప్పారు.

### సోనియాయే నిజమైన నాజీ



పౌరసత్వ చట్టం ముస్లింలకు వ్యతిరేకమైనదంటూ అబద్ధాలు ప్రచారం చేస్తున్న నాజీ సైనికుడి కూతురే (సోనియాగాంధీ) నిజమైన నాజీ. మీరు హిందువులకు అనుకూలమైతే.. ముస్లింలకు వ్యతిరేకం! మీరు ముస్లింలకు అనుకూలమైతే సెక్యులరిస్టు!!

- బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి

### విద్యార్థులూ.. రాజకీయాలొద్దు



విద్యార్థులు రాజకీయాలకు దూరంగా ఉండాలి. అయితే, తమను వేధించే సమస్యలపై మౌనం వహించాల్సిన అవసరం లేదు. ఉద్యమాలన్నీ విద్యార్థుల నుంచే ప్రారంభమవుతాయనడంలో సందేహం లేదు. నైపుణ్యత సాధించిన వాళ్లు అవకాశాలను అందిపుచ్చుకోవడంపైనే దృష్టి పెట్టాలి.

- డా. అనిల్ కకోద్కర్, అణుశక్తి కమిషన్ మాజీ ఛైర్మన్

### భారత్ దాడి చేస్తుందేమో?



సీఏఏపై భారత్‌లో నిరసనల నుంచి దృష్టి మరలించేందుకు అక్కడి ప్రభుత్వం మా దేశంపై దాడి చేసే ప్రమాదం కనిపిస్తోంది. భారత సైనికాధికారి రావత్ వ్యాఖ్యలు దీన్ని బలపరుస్తున్నాయి. భారత్‌కు దీటైన జవాబిస్తాం. భారత్‌ను 'హిందూ దేశం'గా మార్చేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారు.

- ఇమ్రాన్ ఖాన్, పాకిస్థాన్ ప్రధాని

### జర్మనీగా మార్చేందుకే సీఏఏ



భారత్‌ను జర్మనీగా మార్చాలనుకుంటున్న ఒక వర్గం సీఏఏను తీసుకొచ్చింది. దాన్ని ప్రజలు అడ్డుకోవాలి. ప్రజల పౌరసత్వాన్ని ప్రభుత్వమే రుజువు చేయాలి. ప్రజలు నిరూపించుకోవాల్సిన అవసరమే లేదు. ఈ భూమిపై జీవించడమే పౌరసత్వానికి సాక్ష్యం.

- పి.చిదంబరం, కాంగ్రెస్ సీనియర్ నేత

### కేంద్రం మొండి పట్టు వీడాలి



సీఏఏ, ఎన్ఆర్సీలపై ఎన్డీయే మిత్రపక్షాల నుంచీ వ్యతిరేకత వస్తోంది. కేంద్రం మొండి పట్టుదల వీడాలి. తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. మరోవైపు నిరసనకారులు శాంతియుత పద్ధతుల్లో నిరసనను వ్యక్తం చేయాలి. విధ్వంసాన్ని మా పార్టీ ప్రోత్సహించదు.

- మాయావతి, బీఎస్పీ అధినేత్రి



## డేగ చూపు.. ఎంత వేగం!

లండన్, డిసెంబరు 21: డేగ.. పరిసరాలను అత్యంత వేగంగా గుర్తించగల పక్షి అని స్వీడన్ శాస్త్రవేత్తలు తెలిపారు. మనుషులు సెకనుకు 50-60 ఫ్రేములే చూడగలరని, పెరిగ్రిన్ ఫాల్కన్ జాతికి చెందిన డేగ మాత్రం సెకనుకు 130 ఫ్రేములను కచ్చితంగా గుర్తించగలదని చెప్పారు. ఇది ఆహారాన్ని అందుకునే క్రమంలో గంటకు 350 కిలోమీటర్ల వేగంతో కిందకి దూకి చిన్న జంతువులను, సరీసృపాలను, కీటకాలను ఎత్తుకెళ్లిపోతుందన్నారు. "వాడివి డేగకళ్లు.. అన్నింటినీ నిశితంగా గమనిస్తాడు" అనే నానుడి అందుకే వచ్చిందేమో!




## ఇక్కడ ప్రశాంతంగా కూర్చోలేరు!

న్యూఢిల్లీ, డిసెంబరు 21: ఉద్యోగులు బాత్రూంలోనే చాలా సేపు గడిపేస్తున్నారన్న విమర్శలతో బ్రిటన్‌కు చెందిన ఓ కంపెనీ చిత్రమైన టాయిలెట్ కమోడ్‌ను డిజైన్ చేసింది. ఇది మామూలు కమోడ్ కంటే 13 డిగ్రీలు కిందకి వంగి, జారేలా ఉంటుంది. దానిపై 5 నిమిషాల కంటే ఎక్కువసేపు కూర్చోవడం కష్టమవుతుంది. దీంతో బాత్రూంలోనే ఎక్కువ సేపు గడపలేరు. ఈ టాయిలెట్ల వల్ల బ్రిటన్‌లో ఏటా రూ.37 వేల కోట్ల సంపద పెరుగుతుందని భావిస్తున్నారు. అయితే ఇలా చేస్తే ఉద్యోగుల ఆరోగ్యం దెబ్బతింటుందనే వారూ ఉన్నారు.



## సైనికులకు శాటిలైట్ ఫోన్లు

న్యూఢిల్లీ, డిసెంబరు 21: సైనికుల కుటుంబాలకు శుభవార్త. 1,409 మారుమూల ప్రాంతాల్లో విధులు నిర్వర్తించే సైనికులు తమవారితో మాట్లాడుకునేందుకు శాటిలైట్ ఫోన్లు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం ప్రతీ సైనికుడికి రోజూ 1 జీబీ డేటా చొప్పున అందిస్తారు. మారుమూల ప్రాం తాల్లో వీ-శాట్ పరిజ్ఞానాన్ని రక్షణ, హోంశాఖలు వినియోగించుకునేందుకు డిజిటల్ కమ్యూనికేషన్ కమిషన్(డీసీసీ) శనివారం అనుమతి ఇవ్వడంతో ఇందుకు మార్గం సుగమమైంది.

## పిచ్చయ్‌కి 'స్టాక్'పాట్!

- వచ్చే మూడేళ్లలో రూ.1721 కోట్లు
- ప్రస్తుతం 4.62 కోట్ల వార్షిక వేతనం
- ప్రోత్సాహకాతో కలిపి 13.5 కోట్లు



న్యూఢిల్లీ, డిసెంబరు 21: గూగుల్ సీఈవో సుందర్ పిచ్చయ్‌కు ఆ మల్టీనేషనల్ టెక్నాలజీ కంపెనీ కళ్లు చెదిరే ప్యాకేజీని ప్రకటించింది. పనితీరు ఆధారంగా వచ్చే మూడేళ్లలో 1721కోట్ల రూపాయలను స్టాక్ ప్యాకేజీని ఇవ్వనుంది. గూగుల్‌తో పాటు దాని మాతృసంస్థ అయిన అల్ఫాబెట్‌కు పిచ్చయ్ సీఈవోగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం గూగుల్ సీఈవోగా ఆయన రూ.4.62 కోట్లు పొందుతున్నారు. ప్రోత్సాహకాలతో కలిసి రూ.13.5కోట్లు తీసుకుంటున్నారు. వచ్చే ఏడాది నుంచి ఆయన వార్షిక జీతమే రూ.14.22కోట్లకు పెరగనుంది. ఈ మేరకు అల్ఫాబెట్ కంపెనీ వెల్లడించింది. 2004లో గూగుల్‌లో చేరిన సుందర్ పిచ్చయ్ 2015 జూలైలో ఆ సంస్థ సీఈవో అయ్యారు. 2017లో అల్ఫాబెట్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో చేరారు.

## ర్యాన్ ఏడాది ఆర్జన 185కోట్లు

- యూట్యూబ్‌లో ఆట వస్తువులపై వివరణ
- 3కోట్ల మంది సబ్‌స్క్రైబర్లు



న్యూఢిల్లీ, డిసెంబరు 21: పట్టుమని పదేళ్లు కూడా లేని బుడతడు యూట్యూబ్ ద్వారా అత్యధిక వార్షిక మొత్తం ఆర్జించిన ఘనత సాధించాడు! అతడు ఏడాదిలో ఎంత సంపాదించాడో తెలుసా? అక్షరాలా రూ.185కోట్లు! ఆ వండర్ కిడ్ అమెరికాలో టెక్సస్‌కు చెందిన ర్యాన్ కాజీ. వయసు 8ఏళ్లే. 'ర్యాన్ వరల్డ్' అనే యూట్యూబ్ చానల్‌ను నడుపుతున్నాడు. అందులో ఆట వస్తువులు, విద్యా విషయాలపై వీడియోలను పోస్ట్ చేస్తాడు! ముద్దు ముద్దు మాటలతో ఆట వస్తువులను విశ్లేషిస్తాడు. ఈ చానల్‌కు పిల్లలు, వారి తల్లిదండ్రుల్లో గొప్ప ఫాలోయింగ్ ఉంది. 2015లో ర్యాన్ తల్లిదండ్రులు లోన్, షియోన్ కాజీ 'ర్యాన్ టాయ్స్ రివ్యూ' పేరిట దీన్ని ప్రారంభించారు. తర్వాత పేరు మార్చారు. ప్రస్తుతం ఈ చానల్‌కు 3 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. 41 బిలియన్ల వ్యూస్ సొంతం చేసుకుంది. యూట్యూబ్ ప్లాట్‌ఫాం ద్వారా ఏడాదిలో అత్యధిక మొత్తం సంపాదించిన వాడు ర్యానేనని ఫోర్బ్స్ పేర్కొంది.

## ఈ ఏటి మేటి ఆవిష్కరణ.. కృష్ణబిల చిత్రం



వాషింగ్టన్, డిసెంబరు 21: ఈ ఏటి మేటి ఆవిష్కరణగా కృష్ణబిలం(బ్లాక్ హోల్) ఫొటో నిలిచింది. 'గెలాక్సీ మెస్సీయర్ 87' పాలపుంతలోని కృష్ణబిలం ఫొటో తీసినట్లు ఏప్రిల్ 10న శాస్త్రవేత్తలు చేసిన ప్రకటనను 2019లోనే అత్యంత విశేష అంశంగా ప్రఖ్యాత జర్నల్ సైన్స్ మేగజైన్ పేర్కొన్నది. కృష్ణబిలం ఫొటో తీసేందుకు వీలు కల్పించిన గొప్ప సంవత్సరంగా 2019ని అభివర్ణించింది. మెస్సీయర్ పాలపుంతలో కనుగొనడంతో కృష్ణబిలానికి 'ఎం87' పేరుపెట్టారు.

### ఎం87 చిత్రీకరణ విశేషాలు

- ఎం87 కృష్ణబిలం పరిమాణంలో భూమి కంటే 30 లక్షల రెట్లు పెద్దది.
- ఇది భూమి నుంచి 55 మిలియన్ కాంతి సంవత్సరాల దూరంలో ఉంది.
- 'ఈవెంట్ హొరైజాన్' అనే భారీ వర్చువల్ టెలిస్కోప్‌తో దీని ఫొటో తీశారు. దీనితో ఐదు ఖండాల్లోని 8 టెలిస్కోప్‌లను అనుసంధానించారు.
- 2017 ఏప్రిల్‌లో వారం పాటు ఈ 9 టెలిస్కోప్‌లతో ఎం87 ఫొటోలను చిత్రీకరణ చేపట్టారు.
- 'ఈవెంట్ హొరైజాన్'కు కృష్ణబిలం వైపు నుంచి రేడియో సిగ్నళ్ల రూపంలో 5 పెరా బైట్ల డేటా వచ్చింది.
- 5 పెరా బైట్ల సమాచారాన్ని వేల పౌండ్ల హార్డ్ డ్రైవ్‌లలో నిక్షిప్తం చేశారు.
- ఆ హార్డ్ డ్రైవ్‌లలోని సమాచారాన్ని ఈమెయిల్ ద్వారా పంపడం అసాధ్యం. దీంతో హార్డ్ డ్రైవ్‌లను విమానాల్లో ఉంచి.. జర్మనీ, అమెరికాల్లోని ల్యాబ్‌లకు పంపారు.
- కృష్ణబిలం ఫొటోను ప్రపంచానికి చూపించాలనే గొప్ప సంకల్పంతో జరిగిన ఆ ప్రయోగాలు రెండేళ్ల తర్వాత(2019 ఏప్రిల్ 10న) ఫలించాయి.

## లేజర్ కిరణాలతో అల్ట్రాసౌండ్ స్కానింగ్



లేజర్ కిరణాలతో శరీర భాగాల చిత్రాలు ఏర్పర్చగల అల్ట్రాసౌండ్ సాంకేతికతను అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. ఈ లేజర్ కిరణాలతో శరీరానికి ఎలాంటి హానీ ఉండదు.  ఇవి శరీరంలోకి 6 సెంటీమీటర్ల మేర చొచ్చుకుపోయి అవయవాలను చిత్రీకరిస్తాయి.

## బ్యాంకు ఖాతాలకు మతం అక్కర్లేదు

న్యూఢిల్లీ, డిసెంబరు 21: బ్యాంకుల్లో నో యువర్ కస్టమర్(కేవైసీ) పత్రాల్లో ఇక నుంచి మతం గురించి కూడా అడగనున్నారనే వార్తలు దేశవ్యాప్తంగా కలకలం సృష్టించాయి. అయితే ఈ వార్తలను కేంద్రం ఖండించింది. బంగ్లాదేశ్, పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ నుంచి లాంగ్ టర్మ్ వీసాలపై వచ్చి ఇక్కడ బ్యాంకు ఖాతాలు తీసుకొనేవారు మాత్రమే తమ మతాన్ని చెప్పవలసి ఉంటుందని తెలిపింది. అది కూడా హిందువులు, క్రిస్టియన్లు, బౌద్ధులు, పార్సీలు, జైనులు, సిక్కులకే ఇది వర్తిస్తుందని పేర్కొంది. భారత పౌరులెవరూ తమ మతాన్ని చెప్పవలసిన అవసరం లేదని ఆర్థిక శాఖ కార్యదర్శి రాజీవ్ కుమార్ స్పష్టం చేశారు. వదంతులను నమ్మవద్దన్నారు.

## సంక్రాంతి తర్వాత కేంద్ర కేబినెట్‌లో మార్పులు

న్యూఢిల్లీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మోదీ సర్కారు రెండోసారి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయింది. ఈ నేపథ్యంలో ప్రధాని శనివారం వివిధ మంత్రిత్వ శాఖల పనితీరును సమీక్షించారు. సంక్రాంతి తర్వాత, ఫిబ్రవరి 1న బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యేలోపు మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతేగాక బడ్జెట్‌లో కొన్ని కీలకమైన జనాకర్షక పథకాలు ప్రవేశపెట్టే అవకాశాలు కూడా ఉన్నాయన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత కేబినెట్‌లో జేడీయూ, అన్నాడీఎంకేలకు ప్రాతినిధ్యం లేకపోవడం, శివసేన ఎన్డీయే నుంచి వైదొలగడంతో మంత్రివర్గంలో మిత్రపక్షాలకు ప్రాతినిధ్యం కల్పించవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు త్వరలో ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనుండడంతో ఆ ప్రచారంపైనా ప్రధాని దృష్టి పెట్టారు. ఆదివారం రాంలీలా మైదాన్‌లో ఆయన ర్యాలీ నిర్వహించనున్నారు.

### ఉల్లికి తోడు వంటనూనెల సెగ!

న్యూఢిల్లీ, డిసెంబరు 21: ఉల్లి ధరలు పెరిగి ఓ వైపు సామాన్యుడు ఇబ్బంది పడుతున్నాడు. ఇటీవలే ధరలు తగ్గినట్లే తగ్గి మళ్లీ పెరిగాయి. మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా సామాన్యుడిపై మరో భారం పడింది. అది వంటనూనెల రూపంలో. గత రెండు నెలల్లో పామాయిల్ ధరలు లీటర్‌కు రూ.20 పెరిగాయి. దీంతో ఇతర వంట (ఎడిబుల్) నూనెల ధరలూ పెరిగాయి. భవిష్యత్తులో ఇవి మరింత పెరగవచ్చని వంటనూనెల పరిశ్రమల నిపుణులు చెబుతున్నారు.

### ఫేస్'బుక్క'యిన 26.7 కోట్ల మంది

వాషింగ్టన్, డిసెంబరు 21: మరోమారు ఫేస్‌బుక్ డేటా లీక్ అయ్యింది. గత ఏడాది కేంబ్రిడ్జ్ అనలిటికా ఉదంతం తర్వాత.. వరుసగా ఫేస్‌బుక్ యాప్‌లోని లోపాలు బయటపడుతూనే ఉన్నాయి. తాజాగా 26.7 కోట్ల మందికి చెందిన అత్యంత సున్నిత వివరాలు ఓ హ్యాకర్ల ఫోరంలో ప్రత్యక్షమయ్యాయని 'కంపారిటెక్' సంస్థకు చెందిన సైబర్‌సెక్యూరిటీ నిపుణుడు బాబ్ డయాచెక్నో గుర్తించారు. ఫేస్‌బుక్ యూజర్ల విశిష్ట సంఖ్య (యూఐడీ)ని కూడా హ్యాకర్లు కొల్లగొట్టడం ఆందోళనకరమని పేర్కొన్నారు. వియత్నాంకు చెందిన హ్యాకర్లు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని వెల్లడించారు. యూజర్లు డేటాలీక్ బారిన పడకుండా ఉండాలంటే.. ప్రైవసీ సెట్టింగ్స్ మార్చుకోవలని, 'సెండ్ డేటా టు సెర్చింజన్స్' అనే ఆప్షన్‌ను డిజేబుల్ చేయాలంటున్నారు.

### గాంధీకి నివాళిగా అమెరికా కాంగ్రెస్‌లో బిల్లు

వాషింగ్టన్, డిసెంబరు 21: భారత జాతిపిత మహాత్మా గాంధీ 150వ జయంత్యుత్సవాల నేపథ్యంలో ఆయనకు నివాళిగా..హక్కుల నేత జాన్ లూయీ అమెరికా కాంగ్రెస్‌లో బిలు (గాంధీ-కింగ్ స్కాలర్లీ ఎక్స్ఛేంజ్ ఇనీషియేటివ్ యాక్ట్) ప్రవేశపెట్టారు. అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ కింద గాంధీ-కింగ్ ఫౌండేషన్ ఏర్పాటు, విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారికత తదితరాలపై కృషి చేసే స్వచ్ఛంద సంస్థలకు సహకారం, మేధావులతో విద్యావేదిక నిర్వహణ ఈ బిల్లు లక్ష్యాలు. భారత సంతతి అమెరికన్ కాం గ్రెస్ సభ్యులతో పాటు ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీ దీనికి మద్దతిచ్చారు.

## బీజేపీ వెయ్యి ర్యాలీలు

న్యూఢిల్లీ, డిసెంబరు 21: పౌరసత్వ చట్టంపై అపోహలు నివృత్తి చేసేందుకు, వ్యతిరేక ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు దేశవ్యాప్తంగా 1000 ర్యాలీలను, 250 మీడియా సమావేశాలు నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. 'విపక్షాల దుష్ప్రచారాన్ని ప్రజలకు వివరిస్తాం. వివిధ వర్గాల్లో నెలకొన్న భయాందోళనలు తొలగిస్తాం. కాంగ్రెస్‌తో పాటు కొన్ని పార్టీలు చెబుతున్న అబద్ధాలను, దేశంలో శాంతిని భగ్నం చేసేందుకు చేస్తున్న యత్నాలను బట్టబయలు చేస్తాం' అని బీజేపీ ప్రధాన కార్యదర్శి భూపేందర్ చెప్పారు.




Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.